విశాలాంధ్ర

శనివారం
10-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 228
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మా ప్రధానే పిరికివాడు: పాక్ ఎంపీ

ఇస్లామాబాద్: భారత్ దాడులను ఎదుర్కోలేకపోవడంపై పాకిస్థాన్ నాయకులు, ప్రజలు తమ ప్రభుత్వంపై మండిపడుతున్నారు. పాక్‌కు చెందిన తెహ్రీక్ -ఏ- ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ ఎంపీ షాహిద్ అహ్మద్... పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ... తమ ప్రధాని పిరికివాడని, భారత ప్రధాని నరేంద్ర మోదీ పేరు పలకడానికి కూడా ఆయన భయపడుతున్నారని అన్నారు. టిప్పు సుల్తాన్ చెప్పిన కోట్‌ను ప్రస్తావిస్తూ సింహాల సైన్యాన్ని నక్క నడిపిస్తే... అవి యుద్ధంలో పోరాడలేక ఓడిపోతాయని అన్నారు. సరిహద్దుల్లో ఉన్న తమ సైనికులు ధైర్యంగా భారత్‌తో పోరాడాలనుకున్నా... దేశ ప్రధానికే ధైర్యం లేనప్పుడు వాళ్లు ముందడుగు ఎలా వేయగలరని ప్రశ్నించారు.

డ్రోన్ల కూల్చివేత

మరోసారి పాక్ దాడి

- తిప్పికొట్టిన భారత బలగాలు
- సాంబా సెక్టార్‌లో కాల్పులు, పేలుళ్లు
- కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తత

న్యూఢిల్లీ: భారత్- పాక్ నడుమ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. జమ్మూకశ్మీర్, పంజాబ్ సరిహద్దులు కాల్పులు, పేలుళ్ల మోతతో దద్దరిల్లాయి. వరుసగా రెండో రోజు శుక్రవారం చీకటి పడగానే డ్రోన్లతో దాడికి పాక్ ప్రయత్నించింది. దీంతో పెద్ద పెట్టున యుద్ధ సైరన్లు మోగాయి. రంగంలోకి దిగిన భారత భద్రతా దళాలు పాక్ కాల్పులను సమర్థంగా తిప్పికొట్టాయి. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్, కశ్మీర్‌లో యూరీ, కుప్వారా, పూంచ్, నౌగామ్ సెక్టార్లలో పాక్ కాల్పులకు తెగబడింది. ఇక సాంబ సెక్టార్, జమ్మూ, పఠాన్ కోట్, పోఖ్రాన్ లో మరోసారి డ్రోన్లతో పాకిస్థాన్ దాడి చేసింది. పాక్ డ్రోన్లను భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కూల్చివేసింది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పాక్ సరిహద్దు రాష్ట్రాల్లోని 24 ఎయిర్ పోర్టులను కూడా కేంద్రం మూసివేసింది. ఈ నెల 15వ తేదీ వరకు మూసివేసి ఉంటాయని స్పష్టం చేసింది. మరోవైపు, జమ్మూ కశ్మీర్ లో కాల్పుల మోత కొనసాగుతుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. తమకు కాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్ లో ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని సీఎం సూచనలు జారీ చేశారు. జమ్మూ కశ్మీర్ పూర్తిగా బ్లాకౌట్ అయిందన్నారు.

భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా గురువారం రాత్రి పాకిస్థాన్ చేపట్టిన దాడులపై భారత విదేశాంగ శాఖ వివరాలు వెల్లడించింది.

400 డ్రోన్లతో దుశ్చర్య

- ఎంతో సంయమనం వహిస్తున్నాం
- విదేశాంగశాఖ వెల్లడి
- ప్రార్థనా మందిరాలే వారి లక్ష్యం

2లో

కీలక భేటీలు

- సరిహద్దు రాష్ట్రాల్లో హై అలర్ట్
- రంగంలోకి టెరిటోరియల్ ఆర్మీ
- పౌర రక్షణ చర్యలపై రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రస్థావరాలపై భారత్ క్షిపణి దాడులు చేసిన నేపథ్యంలో పాక్ సైతం భారత్‌పై ప్రతీకార చర్యలకు దిగింది. ఓవైపు ఎల్ఓసీ వెంట కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూనే దాడులకు పాల్పడుతోంది. అలాగే భారత్‌ను ఎలాగైనా దెబ్బ కొట్టాలనే ఉద్దేశంతో... సరిహద్దు రాష్ట్రాల్లో గురువారం రాత్రి సైనిక కేంద్రాలే లక్ష్యంగా పాక్ చేపట్టిన గగనతల డ్రోన్లు, క్షిపణి దాడులను భారత సైన్యం తిప్పికొట్టిన సంగతి తెలిసిందే. అయితే పాకిస్థాన్ శుక్రవారం కూడా ఎల్ఓసీ వద్ద భారీస్థాయిలో షెల్లింగ్ కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఉరి, జమ్మూకశ్మీర్ ప్రాంతాల్లో వీటి తీవ్రత ఎక్కువగా ఉంది. చాలామంది ప్రజలు ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఇళ్లు ఖాళీ చేసి వెళుతున్నారు. పూంచ్ సెక్టార్‌లోని దిగ్వార్, కుప్వారా జిల్లాలోని

- మిగతా 2 లో

డిప్యూటీ కలెక్టర్‌కు డిమోషన్

న్యూఢిల్లీ: కోర్టు ఆదేశాలు ఉల్లంఘించిన అధికారికి సుప్రీం కోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఆయన పదవిని తగ్గిస్తూ కీలక తీర్పు వెలువరించింది. డిప్యూటీ కలెక్టర్ తాతా మోహన్‌రావును ఎమ్మార్వోగా డిమోట్ చేస్తూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. గతంలో ఏపీ హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘించిన మోహన్‌రావుపై చర్యలు తీసుకోవాలంటూ ఏపీ సీఎస్‌కు ఆదేశాలు ఇచ్చింది. అధికారులు చట్టానికి అతీతులమనే భావన తగదని జస్టిస్ గవాయి

- మిగతా 2 లో

ఐపీఎల్ వాయిదా

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్-25) 18వ సీజన్ వాయిదా పడింది. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ టోర్నీ నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు టోర్నీ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ఫ్రాంఛైజీలు ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై ఐపీఎల్ పాలక మండలిలో చర్చించాం. ప్రసారకర్తలు, స్పాన్సరర్లు, అభిమానుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి

- మిగతా 2 లో

'గాలి' శాసనసభ సభ్యత్వం రద్దు

బెంగళూరు: కర్ణాటకకు చెందిన మైనింగ్ వ్యాపారి, బీజేపీ ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి శాసనసభ సభ్యత్వం రద్దయింది. అనంతపురం జిల్లా ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో హైదరాబాద్ సీబీఐ కోర్టు ఆయనను దోషిగా నిర్ధారించింది. జనార్దన్ రెడ్డి సహా ఐదుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో ఆయన శాసనసభ సభ్యత్వం రద్దు చేస్తూ కర్ణాటక అసెంబ్లీ ప్రకటించింది. ఈ మేరకు విధానసభ కార్యదర్శి ఎంకే విశాలాక్షి ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు... సీసీ నెం.1 ఆఫ్ 2012లో కర్ణాటకలోని గంగావతి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇన్ని సార్లు చెబుతున్నాము అంటే అర్థమేంటి? నువ్వీ చుట్టుపక్కల భూములు కొనుక్కుని బాగుపడమని.

ముష్కరుల కాల్పుల్లో తెలుగు బిడ్డ వీరమరణం

విశాలాంధ్ర-గోరంట్ల: శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాను మురళీ నాయక్ జమ్మూకశ్మీర్‌లో వీరమరణం పొందారు. గోరంట్ల మండలం గడ్డంతండా పంచాయతీ కల్లితండాకు చెందిన మురళీనాయక్ మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు శుక్రవారం ఉదయం సమాచారం అందింది. సరిహద్దులో చొరబాటుదారుల కాల్పుల్లో ఆయన మృతిచెందినట్లు అధికారులు వారికి తెలిపారు. 2022లో అగ్నివీర్ జవానుగా సైన్యంలో చేరిన మురళీనాయక్... రెండు రోజుల క్రితం వరకు నాసిక్‌లో విధులు నిర్వర్తించారు. భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్మీ అధికారులు ఆయనను నాసిక్ నుంచి జమ్మూకశ్మీర్‌కు పిలిపించారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున చొరబాటుదారుల కాల్పుల్లో మురళీనాయక్ మరణించారు. ఈ సమాచారం తెలియడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పరస్పర

- మిగతా 2 లో

'ది వైర్'పై నిషేధం

- ఐటీ చట్టం కింద వెబ్‌సైట్ బ్లాక్
- నిజమైన వార్తలే అందించాం: సిబ్బంది

న్యూఢిల్లీ: ప్రముఖ డిజిటల్ వార్తా సంస్థ 'ది వైర్'పై కేంద్రం చర్యలు తీసుకుంది. వార్తా సంస్థ వెబ్‌సైట్‌ను దేశవ్యాప్తంగా నిషేధించింది. ఐటీ చట్టం-2000లోని నిబంధనల ప్రకారం ఈ మేరకు చర్యలకు ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలో ది వైర్ వెబ్‌సైట్ అందుబాటులో లేదని ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ (ఐఎస్‌పీలు) ధ్రువీకరించాయి. తాజా పరిణామంపై శుక్రవారం ది వైర్ ఒక బహిరంగ ప్రకటన చేసింది. తమ సంస్థ వెబ్‌సైట్‌ను కేంద్ర ప్రభుత్వం నిషేధించినట్లు వెల్లడించింది. ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ఉత్తర్వుల ప్రకారం ఈ చర్యలు తీసుకోబడ్డాయని తెలిపింది. సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని, న్యాయపరంగా ఉన్న అవకాశాలను అన్వేషిస్తున్నామని ది వైర్ వెల్లడించింది. ఇదిలావుంటే, తామెప్పుడు నిజమైన, కచ్చితమైన వార్తలను పాఠకులకు అందించడానికి కట్టుబడినట్లు ది వైర్

- మిగతా 2 లో

యుద్ధ పరిస్థితులు ఎదుర్కొనేందుకు

సమగ్ర యాక్షన్ ప్లాన్

- జిల్లా కేంద్రాల్లో సంఘీభావ ర్యాలీలు
- ప్రజల అవగాహన కోసం మాక్ డ్రిల్
- తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూం
- హైలెవల్ కమిటీ సమావేశంలో భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : యుద్ధ వాతావరణం వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు పోలీస్ అధికారులు సమగ్రమైన యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం హై లెవెల్ కమిటీ సమావేశం జరిగింది. మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సీఎంఓ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, డీజీపీ జితేందర్, డీజీ ఇంటెలిజెన్స్ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సి.వి.ఆనంద్, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, రాచకొండ సీపీ సుధీర్ బాబు హాజరయ్యారు. ప్రజల్లో జాతీయవాదాన్ని పెంపొందించడానికి అన్ని జిల్లా కేంద్రాల్లో సంఘీభావ ర్యాలీలు నిర్వహించాలని రామకృష్ణారావును ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో నిర్వహించిన సంఘీభావ ర్యాలీ సమాజానికి మంచి సంకేతాన్ని ఇచ్చిందన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. 24 గంటల ముందే ప్రజలను అప్రమత్తం చేసి మాక్ డ్రిల్ ట్రయల్ నిర్వహించాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సెలవులను రద్దుచేసి హెడ్ క్వార్టర్ లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వార్తా ప్రచారాల్లో మీడియా అధిపతులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. హైదరాబాదులో సైరన్ హెచ్చరికలకు తగిన చర్యలు తీసుకోవాలని... పరికరాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రజల కోసం తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. రామకృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు. రక్షణ పరికరాల తయారీ పరిశ్రమల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామని... మాక్ డ్రిల్ లో వీళ్ళందర్నీ భాగస్వాములు చేశామని

- మిగతా 2 లో

సర్వే విభాగం బలోపేతం

పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు ముఖ్యంగా రైతాంగానికి మెరుగైన సేవలందించడానికి, భూముల పంచాయితీలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ శాఖలను మరింత బలోపేతం చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాప్‌ను జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుందన్నారు. భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతం ఉన్న 402 మంది సర్వేయర్లు సరిపోరని, మరికొంత మంది సర్వేయర్లు అవసరమవుతారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఒకవైపు లైసెన్స్ సర్వేయర్లను తీసుకోవడం, మరోవైపు సర్వేయర్ పోస్టులు భర్తీ చేయడం... సర్వేకు అవసరమైన అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సచివాలయంలో శుక్రవారం సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ శాఖపై మంత్రి సమీక్షించారు. పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల మంది లైసెన్స్ సర్వేయర్లను తీసుకోబోతున్నామని వెల్లడించారు. అర్హత గలిగిన అభ్యర్థుల

- మిగతా 2 లో

యుద్ధానికి వెళ్తా: మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్: భారత్ -పాకిస్థాన్‌ల మధ్య తరచూ చోటుచేసుకుంటున్న ఘర్షణలు పూర్తిగా పరిష్కారం కావాలంటే పీఓకే స్వాధీనం చేసుకోవడం ఒక్కటే సరైన మార్గమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ సరిహద్దులో త్రివిధ దళాలు చేస్తున్న వీరోచిత పోరాటానికి మా సెల్యూట్ అన్నారు. శుక్రవారం మీడియా ఇష్టాగోష్టిగా మంత్రి మాట్లాడుతూ ఇంతటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఒక్క పౌరుడు గాయపడకుండా భారత దళాలు దాడులు చేయడాన్ని ఆయన కొనియాడారు. మన రఫేల్ యుద్ధ విమానాలను కూల్చామని పాక్ అబద్ధాలు చెబుతుందని స్పష్టం చేశారు. నిజంగా

- మిగతా 2 లో

రాష్ట్రాలపై బలవంతంగా రుద్దలేం

జాతీయ విద్యావిధానంపై సుప్రీం

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడుల్లో కచ్చితంగా జాతీయ విద్యావిధానం అమలుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. విద్యావిధానాన్ని అమలుచేయాలని ఏ రాష్ట్రాన్ని బలవంతం చేయలేమని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం వెల్లడించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా ఉంటే మాత్రం... కోర్టు జోక్యం చేసుకోవచ్చని తెలిపింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ రాజ్యాంగపరంగా విద్యావిధానాన్ని అమలుచేయాలని పేర్కొంటూ ఓ న్యాయవాది సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దేశవ్యాప్తంగా విద్యలో ఏకరూపకతను నెలకొల్పడానికి కేంద్రం ఎన్ఈపీ విధానాన్ని అమలుచేయాలని యోచిస్తోందని, కానీ కొన్ని రాష్ట్రాలు ఈ విధానాన్ని అనవసరంగా రాజకీయ సమస్యగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయని పిటిషనర్ ఆరోపించారు. ఉచిత విద్య ప్రాథమిక హక్కని, కేంద్రం రూపొందించిన ఆ విధానం అమలును నిరాకరించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల పిల్లలకు ఆ హక్కును దూరం చేస్తున్నాయని పేర్కొన్నారు. కాబట్టి పిల్లలు ప్రభావవంతమైన విద్య పొందేలా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కేసుతో తనకేం సంబంధం ఉందని అత్యున్నత న్యాయస్థానం పిటిషనర్‌ను ప్రశ్నించగా... తాను తమిళనాడుకు చెందిన వ్యక్తినని, ప్రస్తుతం ఢిల్లీలో స్థిరపడ్డానని తెలిపారు. దేశ రాజధానిలో స్థిరపడినప్పుడు వివిధ రాష్ట్రాల్లో జాతీయ విద్యావిధానం అమలు గురించి పిటిషన్ దాఖలు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తూ... అత్యున్నత న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టేసింది. తన పిల్లలు ఢిల్లీలో హిందీ నేర్చుకోవడం కొనసాగించవచ్చని పిటిషనర్‌కు తెలిపింది. జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ)లో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లిష్,

- మిగతా 2 లో

భారత్-పాక్ పోరు ఆందోళనకరం

పరిస్థితులు జటిలం చేసుకోవద్దు: చైనా

మేము తలదూర్చం: అమెరికా

బీజింగ్/వాషింగ్టన్: భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధ పరిస్థితులు నెలకొనడం, సైనిక ఘర్షణ తీవ్ర రూపం దాల్చడంతో అగ్రరాజ్యాలైన చైనా, అమెరికా ఆందోళన వ్యక్తం చేశాయి. ఏ రూపంలోనూ ఉగ్రవాదాన్ని సహించేది లేదని రెండు దేశాలు స్పష్టంచేశాయి. అయితే ఇరుగు, పొరుగు దేశాలైన భారత్, పాకిస్థాన్ అంతర్జాతీయ చట్టాలకు లోబడి, శాంతి, సుస్థిరతకు కట్టుబడాలని పిలుపునిచ్చాయి. తాజా పరిణామాలపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని మరింత జటిలం చేసుకోవద్దని, సంయమనం పాటించాలని భారత్, పాకిస్థాన్‌కు సూచించారు. ఉద్రిక్తతలు తగ్గించడానికి నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి చైనా సిద్ధమన్నారు. పాకిస్థాన్‌పై దాడి అనంతరం చైనా విదేశాంగ శాఖ మంత్రితో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మాట్లాడుతూ పరిస్థితులను తీవ్రతరం చేస్తున్నది పాకిస్థాన్ అని, ఉద్రిక్తతలు పెంచే ఉద్దేశం భారత్‌కు లేదని చెప్పారు. పాక్ చర్యలకు దీటుగా బదులిస్తామని చైనా సహా అమెరికా, బ్రిటన్, సౌదీ, జపాన్, రష్యా, ఫ్రాన్స్ దేశాల ప్రతినిధులకు దోవల్

స్పష్టం చేశారు. అమెరికా కూడా భారత్, పాకిస్థాన్ మధ్య ఘర్షణపై స్పందించింది. ఈ రెండు దేశాల మధ్య ఘర్షణలో తలదూర్చమని తేల్చిచెప్పింది. భారత్-పాకిస్థాన్ మధ్య సైనిక ఘర్షణలో అమెరికా జోక్యం చేసుకోదని ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు. ఫాక్స్ న్యూస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

భారత్, పాకిస్థాన్ మధ్య అణ్వస్త్రాలు ఉండటాన్ని గుర్తు చేశారు. 'అణుశక్తి కలిగివున్న రెండు దేశాల మధ్య పోరు ఆందోళనకరం. వీలైనంత తొందరగా పరిస్థితులు సర్దుమణగకపోతే తీవ్ర సంక్షోభానికి దారితీయొచ్చు. పాకిస్థాన్‌తో భారత్‌కు కొన్ని సమస్యలు ఉన్నాయి. న్యూఢిల్లీ చర్యలకు ఇస్లామాబాద్ స్పందిస్తోంది. త్వరగా శాంతి నెలకొనాలని కోరుకుంటున్నాం. ఆ దిశగా మా వంతు ప్రోత్సాహం అందిస్తాం. యుద్ధంలో మాత్రం తలదూర్చం. ఆ దేశాల మధ్య పోరుతో అమెరికాకు ఎలాంటి సంబంధం లేదు' అని వాన్స్ అన్నారు. ఆయుధాలు వీడి శాంతి కోసం రాజీ కుదుర్చుకోవాలని భారత్, పాకిస్థాన్‌కు అమెరికా హితవు పలికింది. ప్రాదేశిక అస్థిరతకు దారితీసుకోవద్దని సూచించింది. అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ బ్రూస్ స్పందిస్తూ 'భారత్, పాకిస్థాన్ మధ్య ఘర్షణలు కొత్తేమీ కాదు. దశాబ్దాలుగా సాగుతున్నాయి. ఇవి పెరగకుండా చూసుకోవడమే ప్రస్తుతం ముఖ్యం' అని అన్నారు. చర్చలతో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఉగ్రదాడికి పాల్పడిన వారిని చట్టప్రకారం శిక్షించాలని బ్రూస్ అన్నారు.

అట్టహాసంగా విక్టరీ డే

ఆకట్టుకున్న రెడ్‌స్క్వేర్ పెరేడ్

హాజరైన 30 దేశాధినేతలు

తొలిసారి డ్రోన్ల ప్రదర్శన

మాస్కో: నాజీ జర్మనీపై సోవియట్ యూనియన్ 80వ విజయోత్సవం సందర్భంగా రష్యాలో విక్టరీ డే వేడుకలు అట్టహాసంగా జరిగాయి. మాస్కో నగరం ఎరుపెక్కింది. సంప్రదాయం ప్రకారం రెడ్ స్క్వేర్ వద్ద పరేడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 30 మంది ప్రపంచ దేశాధినేతలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఘనంగా స్వాగతం పలికారు. విదేశీ అతిథుల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, బ్రెజిల్ అధినేత లులా డ సిల్వా, వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోతో పాటు సెంట్రల్ ఏషియా మిత్రదేశాల అధినేతలు హాజరయ్యారు. యూరప్ నుంచి సెర్బియా, స్లోవికేయి అధినేతలు అలెగ్జాండర్ ఉసిక్, రాబర్ట్ ఫికో మాత్రమే హాజరయ్యారు. అజర్‌బైజన్ అధినేత ఇల్హం అలియేవ్, లావోస్ అధినేత థోంగ్లున్ సిసోలిత్ చివరి నిమిషంలో తమ పర్యటనను రద్దు చేసుకున్నారు. పెరేడ్ మొదలు కాగానే రష్యా రక్షణ మంత్రి ఆండ్రియే బెలౌసా సైనికులకు అభివాదం చేశారు. ఫెరడల్ భద్రతా సేవ (ఎఫ్ఎస్‌బీ), నేషనల్ గార్డ్‌తో పాటు ఇతర భద్రతా సేవలు, రక్షణ శాఖకు చెందిన 11వేల మంది సైనికులు కవాత్‌లో పాల్గొన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో పాల్గొన్న 1,500 సర్వీస్‌మెన్ కూడా భాగస్వాములయ్యారు. ఈ కవాత్‌కు పదాతి దళాల కమాండర్ ఓలెగ్ సల్యుకోవ్ నాయకత్వం వహించారు. 100కుపైగా చైనా దళాలు, ఉత్తర కొరియా, వియత్నాం, మంగోలియాతో పాటు రష్యా మిత్ర దేశాలకు చెందిన దళాలు కూడా పెరేడ్‌లో పాల్గొన్నాయి. యార్స్ క్షిపణి వ్యవస్థలు, ట్యాంకులు, సాయుధ సిబ్బంది కెరియర్లు సహా విస్తృత శ్రేణి రష్యా మిలటరీ హార్డ్‌వేర్‌ను పరేడ్‌లో ప్రదర్శించారు. మొదటిసారిగా వివిధ యుద్ధ డ్రోన్లు ప్రదర్శించారు.

ఆరు ఎస్-25 యుద్ధ విమానాలు రెడ్ స్క్వేర్ మీదగా ఎగురుతూ ఆకట్టుకున్నాయి. యుద్ధ విమానాల విన్యాసాలతో పెరేడ్ ముగిసింది. ఉక్రెయిన్‌తో పోరు క్రమంలో విక్టరీ డే వేడుకల కోసం రష్యా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. చైనా అధినేత జిన్‌పింగ్ పుతిన్ పక్కనే కూర్చొని పరేడ్‌ను వీక్షించారు. రెండవ ప్రపంచ యుద్ధం నేర్పిన పాఠాన్ని రష్యా వరువలేదని జిన్‌పింగ్ అన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలోనే పుతిన్ ప్రసంగం సాగింది. 80వ విజయోత్సవాన్ని పురస్కరించుకొని ఉక్రెయిన్‌తో పోరునకు మూడు రోజుల విరామాన్ని రష్యా ఏకపక్షంగా ప్రకటించింది.

14వ పోప్‌గా రాబర్ట్ ప్రివోస్ట్

తొలిసారి అమెరికన్ ఎన్నిక- ట్రంప్ హర్షం



రోమ్: అమెరికాకు చెందిన రాబర్ట్ ప్రివోస్ట్ (69) 14వ పోప్‌గా ఎన్నికయ్యారు. పోప్ ఎన్నిక ప్రక్రియ పూర్తి అయిందని, కొత్త పోప్‌గా రాబర్ట్ ప్రివోస్ట్ ఎన్నికపై వాటికన్ ఒక ప్రకటన చేసింది. వాటికన్ సిటీలోని సిస్టిన్ చాపెల్ చర్చి పొగగొట్టం నుంచి తెల్లటి పొగ విడుదల చేయడం ద్వారా పోప్‌ను ఎన్నుకునే ప్రక్రియ పూర్తయినట్టు సంకేతమిచ్చారు. పోప్‌గా అమెరికన్ ఎన్నిక కావడం ఇదే మొదటిసారి. పోప్ రాబర్ట్ ప్రివోస్ట్ సంప్రదాయం ప్రకారం పోప్ లియో సెయింట్ పీటర్స్ కూడలిలోని బాల్కనీ నుంచి వేలాది మంది క్యాథలిక్స్‌కు శాంతి సందేశమిచ్చారు. "ఆర్డో రితూమ్ కాంక్లేవిస్" నిబంధనల ప్రకారం పోప్ ఎన్నిక పూర్తి అయినట్లు వాటికన్ వర్గాలు తెలిపాయి. కార్డినళ్లలో అందరికంటే పెద్దవారైన మత గురువు 'అత్యున్నత మతగురువుగా మీ ఎన్నికను అంగీకరిస్తున్నారా' అని పోప్ రాబర్ట్‌ను ప్రశ్నించారు. 'ఇకపై ఏ పేరుతో మిమ్మల్ని పిలవాలని కోరుకుంటారు' అని అడిగారు. తన ఎన్నికను అంగీకరిస్తున్నట్లు పోప్ రాబర్ట్ చెప్పారు. దీంతో 133 మంది కార్డినళ్ల సమావేశం ముగిసింది.పోప్ ఎన్నిక పూర్తి అయినట్లు సంకేతం అందిన వెంటనే 'వైవల్ ఇల్ పపా' (పోప్ వర్ధిల్లాలి) అంటూ క్యాథలిక్స్ నినాదాలు చేశారు. ఒకరినొకరు హత్తుకొని తమ సంతోషాన్ని పంచుకున్నారు. పోప్ ఎన్నికపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తంచేశారు. తమ దేశానికి చెందిన రాబర్ట్ ప్రివోస్ట్ పోప్‌గా ఎన్నిక కావడం గర్వకారణమన్నారు.షికాగోకు చెందిన రాబర్ట్ ప్రివోస్ట్ మతగురువుగా దీర్ఘకాలం దక్షిణ అమెరికాలో పనిచేశారు. ఇటీవల బిషప్ నియామక బాధ్యతలు నిర్వహించారు. దశాబ్దంపాటు పెరూలోని ట్రుజిల్లోలో పని చేశారు. అనంతరం పెరూ దేశంలోని చిక్లాయో నగర బిషప్‌గా నియమితులయ్యారు. 2014-23 వరకు బిషప్‌గా ఉన్నారు.

ఇస్రో కేంద్రాల భద్రత కట్టుదిట్టం

న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ భీకర దాడులతో దేశంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. ఇదే క్రమంలో భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) కేంద్రాల వద్ద హై అలర్ట్ ప్రకటించారు. బెంగుళూరు, శ్రీహరికోట సహా 11 ఇస్రో కేంద్రాల్లో, ఇతర కార్యాలయాలలో అదనపు భద్రత ఏర్పాటు చేశారు. ఇస్రో కేంద్రాల వద్ద సీఐఎస్ఎఫ్ సిబ్బంది సంఖ్యను పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రముఖ పరిశోధన కేంద్రాల భద్రతనూ పెంచింది. రాష్ట్రాల్లోని ప్రముఖ కట్టడాలు, కార్యాలయాలు, కేంద్రాల వద్ద హై అలర్ట్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఇప్పటికే కేంద్ర హోంశాఖ తగు సూచనలు చేసింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ప్రమాదం రాకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. సైరన్ వంటి అత్యవసర పరికరాలు కొనుగోళ్లకు, ఎమర్జెన్సీ నిర్ణయాలు తీసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు 1968 సివిల్ డిఫెన్స్ చట్టంలోని నిబంధన 11 ప్రకారం అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హోం శాఖ లేఖ రాసింది. పౌరుల భద్రతకు కట్టుబడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు చేసింది.

400 డ్రోన్లతో దుశ్చర్య

న్యూఢిల్లీ: భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా గురువారం రాత్రి పాకిస్థాన్ చేపట్టిన దాడులపై భారత విదేశాంగ శాఖ వివరాలు వెల్లడించింది. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని 300 నుంచి 400 డ్రోన్లతో పాక్ దాడులు చేసినట్లు తెలిపింది. పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తోందని వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచార సేకరణే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు. ప్రాథమిక నివేదికల ప్రకారం టర్కీకి చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిసిందన్నారు. "గురువారం రాత్రి రెచ్చగొట్టే చర్యలకు దిగిన పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంట ఉల్లంఘనకు పాల్పడుతూ దాడులకు తెగబడింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. పాకిస్థాన్ నుంచి 300 నుంచి 400 డ్రోన్ల వరకు వచ్చాయి. వీటిలో అనేక డ్రోన్లను కూల్చేశాం. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాం. ఈ దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుంది. ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా పాక్ దాడులు చేస్తోంది. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాక్ ప్రయత్నిస్తోంది. పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు మొదలుపెట్టినప్పటికీ.. అక్కడి పౌర విమానాలకు గగనతలాన్ని మూసివేయలేదు. కరాచీ, లాహోర్ మధ్య విమాన సర్వీసులు నడుస్తూనే ఉన్నాయి. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన ఉంటుందని తెలిసీ.. పౌర విమానాలను పాకిస్థాన్ రక్షణ కవచంగా వాడుకుంటోంది. ఇది భారత్-పాక్ మధ్య అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో వెళ్లే విమానాలతోపాటు అక్కడి పౌర విమానాలకు సురక్షితం కాదు. అంతర్జాతీయ విమానాలను దృష్టిలో ఉంచుకొని భారత వాయుసేన పూర్తి సంయమనంగా వ్యవహరించింది" అని రక్షణశాఖ ప్రతినిధులు కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు వెల్లడించారు. 'పాకిస్థాన్ దాడులకు ప్రతిస్పందనగా, పాక్‌లోని 4 వైమానిక రక్షణ ప్రదేశాలపై సాయుధ డ్రోన్‌లను ప్రయోగించాం. ఆ డ్రోన్లలో ఒకటి పాకిస్థాన్‌కు చెందిన ఏడీ రాడార్‌ను నాశనం చేసింది. పాకిస్థాన్ నియంత్రణ రేఖ వెంబడి భారీ-క్యాలిబర్ ఆర్టిలరీ తుపాకులు, డ్రోన్‌లు, ఫిరంగి దాడులకు పాల్పడింది. దీంతో భారత సైనికులకు కొంత మేరకు నష్టం, గాయాలు అయ్యాయి. అయితే భారత్ దెబ్బకు పాకిస్థాన్ సైన్యం భారీగా నష్టాన్ని చవిచూసింది" అని తెలిపారు. భారత్. భారత సైన్యం దేశ సార్వభౌమత్వాన్ని, దేశ ప్రాదేశిక సమగ్రతను కాపాడటానికి కట్టుబడి ఉందని.. అన్ని దుర్మార్గపు కుట్రలకు తుత్తునియలు చేస్తామని స్పష్టం చేశారు.

సర్వే విభాగం బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి ఈ నెల 17 వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ (గణిత శాస్త్రం) ఒక అంశంగా ఉండి, కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఐటీఐ నుంచి డ్రాఫ్ట్‌మన్ (సివిల్), డిప్లొమా (సివిల్), బి.టెక్ (సివిల్) లేదా ఇతర సమానమైన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. శిక్షణ ఫీజు ఓసీ అభ్యర్థులకు రూ.10వేలు, బీసీ అభ్యర్థులకు రూ.ఐదు వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,500 చెల్లించవలసి ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో 50 పని దినాలలో తెలంగాణ అకాడమీ (ల్యాండ్ ఇన్ఫర్మేషన్, మేనేజ్మెంట్) అధ్వర్యంలో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. వీలైనంత త్వరగా లైసెన్స్ సర్వేయర్ల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

రాష్టాలపై బలవంతంగా రుద్దలేం

(మొదటిపేజీ తరువాయి)

ఒక స్థానిక భాష నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అయితే తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టంచేసింది. 'ఎన్ఈపీ' విషయంలో తమిళనాడు- కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతోంది. రాజకీయ అభిప్రాయ భేదాలకు అతీతంగా దీన్ని అమలుచేయాలని స్టాలిన్‌కు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల ఓ లేఖలో సూచించారు. అయితే... తమిళ భాషకు, ప్రజలకు, రాష్ట్రానికి నష్టం కలిగించే చర్యలను అనుమతించేది లేదని తమిళనాడు ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. మరోవైపు.. జాతీయ విద్యావిధానాన్ని ఆమోదిస్తేనే తమిళనాడుకు నిధులు విడుదలవుతాయని కేంద్ర ప్రభుత్వం బెదిరించింది.

'ది వైర్'పై నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

సిబ్బంది చెప్పారు. తమ వార్తా సేకరణ అన్ని వేళలా వాస్తవాలాధిరతమేనని చెప్పారు. పదేళ్లకుపైగా తమకు అండగా నిలిచినందుకు ప్యూయర్స్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ది వైర్ వెబ్‌సైట్‌ను దేశవ్యాప్తంగా నిషేధించడానికి సంబంధించి ఐటీ శాఖ నుంచి అధికారిక ప్రకటన విడుదల కాలేదు.

ఐపీఎల్ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నాం. మన సాయుధ బలగాల స్థైర్యం, సన్నద్ధతపై మాకు పూర్తి విశ్వాసం ఉన్నప్పటికీ... అందరి అభిప్రాయాలు గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశానికి బీసీసీఐ పూర్తి మద్దతు ప్రకటిస్తోంది. మన సాయుధ బలగాల ధైర్యం, నిస్వార్థ సేవకు సెల్యూట్ చేస్తున్నాం' అని ఐపీఎల్ తమ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చింది. ఆటగాళ్ల భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో టోర్నీని కొంతకాలం వాయిదా వేసినట్లు బీసీసీఐ అధికారులు పేర్కొన్నారు. 'ఓవైపు దేశం యుద్ధం చేస్తుంటే... ఇలాంటి సమయంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం సరైంది కాదనిపించింది' అని వెల్లడించారు.

'గాలి' శాసనసభ సభ్యత్వం రద్దు

(మొదటిపేజీ తరువాయి)

వహిస్తున్న శాసనసభ సభ్యుడు జి. జనార్దన్ రెడ్డిని మే ఆరో తేదీన దోషిగా నిర్ధారించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఇ), ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 8 నిబంధనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇది శిక్ష పడిన నాటి నుంచే అమలులోకి వస్తుంది. జనార్దన్ రెడ్డికి విధించిన శిక్షపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించకపోతే... విడుదలైన నాటి నుంచి మరో ఆరేళ్లపాటు అనర్హత కొనసాగుతుంది' అని అందులో పేర్కొన్నారు. జనార్దన్ రెడ్డిపై అనర్హతతో అసెంబ్లీలో ఒక స్థానం ఖాళీ అయిందంటూ నోటిఫికేషన్ విడుదల చేసింది.

నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు నెల జీతం?

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత్ -పాక్ ఉద్రిక్తతల వేళ తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. నేషనల్ డిఫెన్స్ ఫండ్ కు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఒక నెల వేతనం విరాళం అందజేయాలని నిశ్చయించారు. ఈ విషయమై సీఎం... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో శుక్రవారం చర్చించారు. సీఎం సూచన మేరకు అందరితో చర్చించి ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించనున్నారు.

సమగ్ర యాక్షన్ ప్లాన్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఆస్పత్రి భవనాలపై ఎరుపు రంగుతో ప్లస్ గుర్తు ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. కేంద్ర ఆదేశాలను పాటిస్తూ క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నట్టు చెప్పారు. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని, రైల్వే స్టేషన్స్, బస్టాండ్ల వద్ద భద్రత పెంచినట్లు చెప్పారు. డీఆర్డీఏ, డీఆర్‌డీఓ, ఎన్ఎఫ్‌సీ పరిశ్రమల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 24/7 పెట్రోలింగ్ నిర్వహిస్తూ సీసీటీవీల ద్వారా పరిశీలన చేస్తున్నటు వివరించారు. సోషల్ మీడియాలో ఫేక్ వార్తలు ప్రచారం కాకుండా సైబర్ టీంలను ఏర్పాటు చేసి తప్పుడు వార్తలను కట్టడి చేయడంతో పాటు ప్రచారం చేసే వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు డీజీపీ వివరించారు.

కీలక భేటీలు

(మొదటిపేజీ తరువాయి)

తంగ్దార్ సెక్టార్‌లో పాకిస్థాన్ కాల్పులకు తెగబడుతోంది. పగలు ప్రంశాతంగా ఉన్న ఈ ప్రాంతాలు రాత్రిపూట 7 గంటలు దాటిన తర్వాత బాంబులతో మోతెక్కిపోతున్నాయి. పాక్ కాల్పులతో స్థానిక ప్రజలు బంకర్లలోకి వెళ్లారు. మరోవైపు భారత సైన్యం కూడా పాక్ దాడులను దీటుగా తిప్పికొడుతోంది. పాకిస్థాన్ దాడి చేస్తుందన్న ఉద్దేశంతో స్థానికులను సైన్యం ఖాళీ చేయించింది. గురువారం రాత్రి ఈ రెండు సెక్టార్లలో పాక్ సైన్యం జరిపిన కాల్పులకు భారీగా ఆస్తి నష్టం జరిగి, ఇద్దరు మరణించారు.

ఈ క్రమంలోనే పాక్‌నుంచి ఎదురయ్యే ఎటువంటి సవాలునైనా దీటు ఎదుర్కోవడంతో పాటు పాక్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టేందుకు భారత త్రివిధ దళాలు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా.... శుక్రవారం సాయంత్రం త్రివిధ దళాధిపతులతో ప్రధాన నరేంద్రమోదీ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సీడీఎస్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా పాల్గొన్నారు. ఉదయం రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్రివిద దళాధిపతులతో కీలక సమావేశం నిర్వహించగా... కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. డైరెక్టర్ జనరల్ ఆఫ్ బీఎస్ఎఫ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సీఐఎస్ఎఫ్, హోంశాఖలోని సీనియర్ అధికారులతో భేటీ అయ్యారు. సరిహద్దుల్లో , విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సమావేశానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా హాజరయ్యారు. కేంద్రమంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. ఇక చొరబాటు ఘటనలు చోటుచేసుకుంటున్న తరుణంలో పాక్‌తో సరిహద్దు పంచుకుంటున్న ఆయా రాష్ట్రాలు ఇప్పటికే కీలక చర్యలు చేపట్టాయి. మన దేశంలోకి చొరబాటుకు యత్నించిన పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిని పంజాబ్ సరిహద్దు వద్ద బీఎస్ఎఫ్‌కు చెందిన జవాన్లు హతమార్చారు. రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్లున్న పాక్ సరిహద్దును మూసివేశారు. ఎవరైనా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తే.. కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మూకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి చొరబడేందుకు పాక్ ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను బీఎస్ఎఫ్ తిప్పికొట్టింది. కనీసం ఏడుగురు ఉగ్రవాదులను మట్టుపెట్టినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.

- ప్రస్తుత పరిస్థితుల్లో దేశ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు, సాధారణ సైన్యానికి సహాయం అందించేందుకు ని రంగంలోకి దించేందుకు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదికి విస్తృత అధికారాలను కల్పిస్తూ.. రక్షణ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. టెరిటోరియల్ ఆర్మీ రూల్స్ 1948లోని రూల్ 33 ప్రకారం రక్షణ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త అధికారాల ద్వారా ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది... టెరిటోరియల్ ఆర్మీలోని అధికారులను, సిబ్బందిని అత్యవసర భద్రతా విధుల కోసం లేదా సాధారణ సైన్యం కార్యకలాపాలకు మద్దతుగా ఉపయోగించవచ్చు.
- పాక్‌వైపు నుంచి ముప్పు దృష్ట్యా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర హోంశాఖ అప్రమత్తం చేసింది. ఈ క్రమంలో 1968 సివిల్ డిఫెన్స్ చట్టం ప్రకారం పౌర రక్షణ చర్యలను పెంచాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు, యూటీలకు కేంద్రం లేఖలు రాసింది. యుద్ధ సమయంలో 1968 సివిల్ డిఫెన్స్ చట్టంలోని రూల్ 11 ఉపయోగించాలని రాష్ట్రాలు, యూటీలకు సూచించింది. ఈ సెక్షన్ ప్రకారం సైరన్ వంటి అత్యవసర పరికరాలను కొనేందుకు అధికారం కల్పించింది. "రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పౌర రక్షణ చర్యలను పెంచాలి. శత్రువుల దాడుల సమయంలో ప్రజలు, వారి ఆస్తుల రక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టడానికి, కీలకమైన సేవల పనితీరును నిర్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉంది. రాష్ట్రాలు, యూటీలు సెక్షన్ 11ని అమలు చేయాలి." అని పేర్కొంది.
- భారత్‌పై పాకిస్థాన్ సైబర్ దాడికి దిగే అవకాశముందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దేశంలోని కీలక ఆర్థిక సంస్థలను అప్రమత్తం చేసింది. జాగ్రత్తగా ఉండాలని ఆర్బీఐ, యూపీఐలకు ప్రభుత్వం కీలక సూచన చేసింది. ఇది వాస్తమేనని ప్రభుత్వ సీనియర్ ఉన్నతాధికారి శుక్రవారం న్యూఢిల్లీలో వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థ, సమగ్రతతోపాటు భద్రత కోసం ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. దేశంలో సైబర్ దాడి జరిగే అవకాశముందని.. దీంతో ప్రధాని ఆర్థిక రంగ సంస్థలు చాలా అప్రమత్తతతో వ్యవహరించాలని ఆర్‌బీఐ ఇప్పటికే ఓ సలహా, సూచన చేసిందని తెలిపారు.

డిప్యూటీ కలెక్టర్‌కు డిమోషన్

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనం వ్యాఖ్యానించింది. గతంలో గుంటూరు తహసీల్దారుగా పనిచేసిన తాతా మోహన్‌రావుకు గుంటూరులోని ఒక ప్రాంతంలో ఆక్రమణలు తొలగించవద్దని 2013 డిసెంబర్ 11న హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, హైకోర్టు ఆదేశాలను ఆయన ఉల్లంఘించి 2014లో ఆక్రమణలు తొలగించారు. దీంతో ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన మోహన్‌రావుకు హైకోర్టు రెండు నెలలు జైలు శిక్ష విధించింది. హైకోర్టు తీర్పును ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేయగా... ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. కోర్టు ఆదేశాలు ఉల్లంఘించిన మోహన్‌రావుకు తహసీల్దార్‌గా డిమోషన్ కల్పిస్తూ ఆదేశాలు జారీచేసింది.

పాకిస్థాన్ అనుకూల పోస్ట్... వైద్య విద్యార్థినిపై కేసు

బెంగళూరు: కర్నాటకలో ఓ మెడికల్ కళాశాల విద్యార్థిని సోషల్ మీడియాలో పాకిస్థాన్ అనుకూలంగా పోస్ట్ చేసిందుకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. బీఎన్ఎస్ 152తో పాటు 197(3)(5) సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వివరించారు.

ఆ విద్యార్థిని ముంబైలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సోషల్ మీడియా పోస్ట్ వైరల్ కావడంతో హిందూ సంఘాల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. దాంతో విజయపుర పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు.

యుద్ధానికి వెళ్తా: మంత్రి ఉత్తమ్

(మొదటిపేజీ తరువాయి)

యుద్ధం మొదలైతే పాక్ విచ్ఛిన్నమడం ఖాయమన్నారు. పీవోకేను స్వాధీనం చేసుకోవడానికి ఇదే సరైన సమయమన్నారు. పీవోకే నుంచి పాక్‌ను ఖాళీ చేయడమే సమస్యకు శాశ్వత పరిష్కారమన్నారు. ప్రస్తుతం మన జోష్ చూసి పాక్ ఎదుర్కొనే ధైర్యం చేయదని అభిప్రాయపడ్డారు. యుద్ధం మొదలైతే అందులో పాల్గొనేందుకు తాను ముందుంటానని, తన అవసరం ఏమాత్రం ఉన్నా యుద్ధానికి వెళ్తానని ఆయన చెప్పారు. తాను 16 ఏళ్లకే డిఫెన్స్‌లోకి వెళ్లానని, 1982లో మిగ్ 21 ఫైటర్ పైలెట్‌గా... ఆ తర్వాత మిగ్ 23 అత్యాధునిక ఫైట్ పైలెట్‌గా పని చేశానని, ఇది శబ్ద వేగానికి 2.5 రెట్లు ఎక్కువ వేగంతో దూసుకుపోతుందని వివరించారు. ఉత్తర్ లే, శ్రీనగర్, అమృత్ సర్‌లో తాను పని చేసినట్లు గుర్తు చేసుకున్నారు. చాలా చిన్న వయస్సులో 20 ఏళ్లకే ఫైటర్ పైలెట్ గా పని చేశానని, అలాంటిది ఇప్పుడు అవకాశం దొరికితే ఖచ్చితంగా యుద్ధానికి వెళ్తానని స్పష్టం చేశారు. గత నెల 22న పాక్ ప్రేరేపిత ఉగ్రచర్య దుర్మార్గమని, మతం అడిగి చంపడం శోచనీయమన్నారు. టీఆర్ఎఫ్ అనేది లష్కరే తోహిబాకు అనుబంధ సంస్థ కావడంతో పాటు వీరికి పాక్ మద్దతు ఇవ్వడం వల్ల ఆ దేశ నిర్వాకానికి బుద్ధి చెప్పడం సరైన చర్య అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో రఫేల్ యుద్ధ విమానాలు, కామికసేన్ డ్రోన్‌లు అద్భుతంగా పని చేశాయని కితాబిచ్చారు.

తెలుగు బిడ్డ వీరమరణం

(మొదటిపేజీ తరువాయి)

కాల్పుల్లో ఐదుగురు పాక్ ముష్కరులను చంపి... మురళీ నాయక్ చనిపోయారు. శ్రీనివాస్ నాయక్, జ్యోతిబాయిలకు మురళీ నాయక్ ఏకైక సంతానం. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు సోమందే పల్లె మండల కేంద్రంలోని విజ్ఞాన్ స్కూల్లో చదువుకున్నాడు. 2022 అగ్నివీర్ ద్వారా ఆర్మీకి ఎంపికయ్యాడు. నాసిక్, పంజాబ్‌లో పనిచేశాడు. ప్రస్తుతం ఆయన భౌతికకాయం ఢిల్లీ చేరుకుంది. శనివారం ఉదయం స్వగ్రామంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతాయి. మరోవైపు మురళీ నాయక్ తల్లిదండ్రులను సీఎం చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. మంత్రి సవిత కల్లితండాకు వెళ్లి తల్లిదండ్రులను ఓదార్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చెక్కును మురళీనాయక్ తల్లిదండ్రులకు ఆమె అందజేశారు. చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడించారు.

ఒక్కగానొక్క కుమారుడు పాక్ సైనికుల కాల్పుల్లో మృతి చెందడంపై తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. దేశం కోసం చస్తా... దేశం కోసం ఆర్మీలోనే ఉంటా అనేవాడని కుమారుడి మాటలు గుర్తు చేసుకున్నారు. మురళీ నాయక్ నిన్న ఉదయం తమతో మాట్లాడాడని, అవే చివరి మాటలని రోధించడం కలచివేసింది. తెల్లవారు జామున మూడు గంటలకు జరిగిన కాల్పుల్లో మృతిచెందినట్లు ఉదయం ఆర్మీ కమాండ్ కంట్రోల్ కార్యాలయం నుంచి తమకు ఫోన్ ద్వారా సమాచారం అందించారని తెలిపారు.

చంద్రబాబు, పవన్, జగన్ సంతాపం

వీరజవాను మురళీ నాయక్ మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంతాపం తెలిపారు. మురళీనాయక్ కుటుంబానికి అండగా ఉంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దేశం కోసం మురళీ ప్రాణాలు అర్పించారని పవన్ అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉష్షశ్రీ చరణ్ మురళి తల్లిదండ్రులను పరామర్శించారు. జగన్‌మోహన్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. మీకు వైసీపీ అండగా ఉంటుందని, త్వరలోనే మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని పరామర్శిస్తానని జగన్ చెప్పారు. యుద్ధభూమిలో పోరాడుతూ మురళీ నాయక్ వీరమరణం పొందడం తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మురళీ నాయక్ చూపిన ధైర్య సాహసాలు రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. మురళీ నాయక్ అంత్యక్రియలు రాష్ట్రప్రభుత్వం అధికారిక లాంఛనాలతో జరిపిస్తామని తెలిపారు. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి

విశాలాంధ్రబ్యూరో – ములుగుజిల్లా : గోవిందరావుపేట మండలం లోని కర్లపల్లి గ్రామానికి చెందిన, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు రసుపుత్ సీతారాం నాయకు కూతురి వివాహానికి, ములుగు లీలా గార్డెన్‌లో ములుగు పట్టణ కేంద్రానికి జగ్గాని రఘువీర్ కూతురి వివాహానికి, మల్లంపల్లి మండలం శ్రీ నగర్‌కు చెందిన కామ రమేష్ కూతురి వివాహానికి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి నీటిసరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ, సీతక్క హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్‌తో పాటు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా బ్లాక్, మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ

విశాలాంధ్ర – భద్రాచలం : వేసవి ఎండలు పెరిగి వడగాల్పులు తీవ్రంగా ఉండటంతో భద్రాచల పట్టణంలో ట్రాఫిక్ పోలీసులకు ఓఆర్ఎస్ పాకెట్ల పంపిణీ చేశారు. నిత్యం ఎండలో ఉండి ప్రజల రక్షణ కోసం పనిచేస్తున్న ట్రాఫిక్ పోలీసులకు రత్న ఫార్మా నాగబాబు సహకారంతో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ తరపున శుక్రవారం ఈ ప్యాకెట్స్‌ను పంపిణీ చేయడం జరిగినది. సుమారు 30 లీటర్లకు సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఔషధ తనిఖీ అధికారి సిహెచ్. సంపత్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి, పట్టణ కెమిస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్టు సహాయనిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర – జిల్లా బ్యూరో మహబూబాబాద్: అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్టుకు ఆర్థిక సహాయంగా రాష్ట్ర మీడియా అకాడమీ నుంచి రూ. లక్ష చెక్కును అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం హైదరాబాదులో మృతుడు బోగోజు సురేష్ సతీమణికి అందజేశారు. ఈ సందర్భంగా టీయుడబ్ల్యూజే హెచ్ 143 మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి సిరికొండ విక్రమ్ కుమార్ మాట్లాడుతూ బోగోజు సురేష్ మృతి చెందడం బాధాకరమని ఆయన కుటుంబానికి అండగా ఉండాలని సహాయనిధి అందే వరకు తమ వంతుగా కృషి చేశామని వెల్లడించారు. తోటి జర్నలిస్ట్ మిత్రులకి అండగా ఉండాలని ఉద్దేశంతో అందుకు అవసరమయ్యే విధి విధానాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని సహాయనిధి వచ్చేంత వరకు కృషి చేశామని భవిష్యత్తులో ఏ జర్నలిస్ట్ కుటుంబానికైనా అండగా ఉంటూ ఇదే విధంగా సహకరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్దవంగర మండల ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షులు బోగోజు భద్రయ్యచారి, పలువురు పాత్రికేయులు, అకాడమీ సభ్యులు హాజరయ్యారు.

త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర – జిల్లా బ్యూరో మహబూబాబాద్: కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చిన వరి ధాన్యం రోజుల తరబడి నిరీక్షిస్తున్న, సమయానికి కొనుగోలు చేయకపోవడంతో, అకాల వర్షం ద్వారా రైతులు నష్టపోతున్నారని, వెంటనే కొనుగోలు చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం కర్కాల, హరిపిరాల గ్రామ రైతులు ధాన్యం కొనుగోలు సెంటర్లో రైతులు ధర్నా చేయగా, ఈ విషయం తెలుసుకున్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంఘటన స్థలాన్ని చేరుకొని చరవాణి ద్వారా మహబూబాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరబ్రహ్మయ్య సమస్యలు వివరించగా వారు వెంటనే స్పందించి 2 లారీలను పంపించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ తొర్రురు మండలం కర్కాల ధాన్యం కోలుగోలు సెంటర్లో 1 నెల రోజులు దాటినా కనీసం సన్న వడ్లకి కూడా బస్తాలు, లారీలు కొరతతో ఇబ్బంది పడుతున్న రైతుల ఆవేదనతో ధర్నా చేపట్టారని, రైతుల సమస్యలను గుర్తించి ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మాజీ జెడ్పి టిసి జెడ్పి ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, పెద్ద వంగర బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఈదురు ఐలయ్య, బి ఆర్ ఎస్ నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో మహిళ అరెస్ట్

విశాలాంధ్ర – నేరేడుచర్ల : నేరేడు చర్ల పట్టణంలో గురువారం సాయంత్రం మహిళ మెడలో నుండి 2 తులాల బంగారు పుస్తెలతాడు అపహరించిన నిందితురాలిని పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుజూర్ నగర్ సిఐ చరమంద రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఎస్ఐ రవీందర్ నాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం పట్టణంలోని గ్రంథాలయం వీధిలో గూండా చంద్రకళ ఇంటి ముందు కూర్చుని ఉండగా పట్టణానికి చెందిన అమర వరపు మంజుల ఆమెను మంచినీళ్లు అడిగి నీళ్లు తాగే క్రమంలో ఆమె చంద్రకళ మెడలోని సుమారు 2 తులాల బంగారు గొలుసు దొంగిలించినట్లు తెలిపారు. వెంటనే ఆమె తేరుకొని స్థానికుల సహాయంతో 100కు డయల్ చేసి సమాచారం అందించగా నేరేడుచర్ల పోలీసులు వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారన్నారు. శుక్రవారం బస్టాండ్ సమీపంలో అనుమాదాస్పదంగా కనిపించిన మంజులను తనిఖీ చేయగా తన వద్ద బంగారు గొలుసు దొరికినట్లు తెలిపారు. నిందితురాలుపై కేసు నమోదు చేసి నిందితురాలని రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. రిటైర్డ్ టీచర్లు, వృద్ధులు ఎవరైనా సరే తమ ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది వీరాంజనేయులు, వెంకన్న, విష్ణు, శ్రీలత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వామ్యం కావాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో– కొత్తగూడెం: జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు స్థానికంగా ఉన్న అన్ని పరిశ్రమల యజమానులు, అధికారులు సహకరించి భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలొ జిల్లాలోని ఎస్సీఏ, ఏడిపి, డిఎంఎఫ్టి, సిఆర్ ఎస్పి, ఎంకెఎస్‌వై, ఎయిర్టెల్ తదితర కంపెనీల, టీజీఎఫ్ డిసి నిధుల ద్వారా పురోగతిలో ఉన్న పనులు, చేపట్టనున్న పనులపై సమీక్ష నిర్వహించారు. ఇందులో జిల్లాలోని సింగరేణి, కేటీపిఎస్, బిటిపిఎస్, నవభారత్, ఐటిసి, టీజీఎఫ్‌డిసి పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారుల తోపాటు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కేటాయించిన అన్ని రకాల నిధులను సద్వినియోగం చేసుకొవాల్సి ఉందన్నారు. జిల్లాలోని పరిశ్రమలు వారు సిఎస్ఆర్ కింద ఎంత నిధులు మంజూరు చేస్తారో మే 15 లోపల నివేదికలు అందించాలన్నారు. వీటి ద్వారా ఎక్కడ అభివృద్ధి చేయాలి అనేది ప్రణాళికలు రూపొందించవచ్చన్నారు. పరిశ్రమలు కేటాయించే సిఎస్ఆర్ నిధులను విద్య, వైద్యం, త్రాగునీరు, అంగన్వాడీల అభివృద్ధికి కేటాయిస్తా మన్నారు. నవభారత్‌లో తయారయ్యే ఇటుకలు కేవలం 6 రూపాయలకే విక్రయిస్తున్నారని వాటిని ప్రభుత్వ కట్టడాలకు ఉపయోగించాలన్నారు. జిల్లాలో 27 వేల ఎకరాల్లో టిటిసి సంస్థ కోసం జామ్ ఆయిల్ సాగు రైతులు చేపడుతున్నారన్నారు. ఆర్టికల్ 275 ద్వారా జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఆపరేషన్ థియేటర్లు, మార్చురీలు నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. సిపిఓ సంజీవరావు, వైద్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, ఆర్ అండ్ బిఈఈ వెంకటేశ్వరరావు, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, మిషన్ భగీరథ ఈ ఈ లు తిరుమలేష్, నలిని, సింగరేణి, నవభారత్, కేటీపీఎస్, బిటిపిఎస్, ఐటిసి అభిషేక్ ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పరిశ్రమలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ రోహిత్ రాజు

విశాలాంధ్ర – కొత్తగూడెం క్రైమ్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలొ ముఖ్యమైన ప్రయివేట్, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో కీలకంగా అశ్వాపురంలోని హెవీ వాటర్ ప్లాంట్ పాల్వంచ మణుగూరులో విద్యుత్ ఉత్పత్తి సొధాలు, బొగ్గుబావులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం ప్రభుత్వ రంగ ప్రవేట్ పరిశ్రమల అధికారులు, యజమానులను ఎలర్ట్ చేసారు. భారత్ – పాక్ యుద్ధ నేపథ్యంలో జిల్లాలోని పరిశ్రమలు, కంపెనీల భద్రతాధికారులతో తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసిన ఎస్పీ రోహిత్ రాజు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పరిశ్రమల యాజమాన్యాలు, భద్రతాధికారులు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అశ్వాపురం లోని భారజల ఉత్పత్తి కేంద్రం, సారపాక ఐటీసీ, పేపర్ బోర్డ్, కేటీపీఎస్, బీడీపీఎస్‌లతోపాటు నవ లిమిటెడ్ కంపెనీల భద్రతాధికారులు నిరంతరం అలర్ట్‌గా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా పరిశ్రమలు, కంపెనీలలో ప్రస్తుత భద్రతా ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్న నియమ నిబంధనలను పాటిస్తూ దానికనుగుణంగా పటిష్టమైన ఏర్పాట్లను చేసుకోవాల్సి ఉందన్నారు. అలారం సిస్టమ్ విధానాన్ని తమ కంపెనీల ఉద్యోగులకు, వారి కుటుంబాలకు, చుట్టుప్రక్కల ప్రాంతాల వారికి అర్థమయ్యే విధంగా ప్రాక్టీస్ చేయాలని తెలిపారు. తమ ప్రాంతాల్లోని ప్రతి ప్రదేశంలో సీసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. పరిశ్రమల, కంపెనీల ప్రధాన ప్రవేశ ద్వారాల వద్ద ఇతర వ్యక్తులు లోనికి ప్రవేశించకుండా పకడ్బందీ ఏర్పాట్లు చెయ్యాలన్నారు. పరిసర ప్రాంతాలలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో పరిశ్రమలు, కంపెనీల వద్ద గస్తీని ముమ్మరం చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. భారజల కేంద్రం కమాండెంట్ అమిత్ కుమార్, మణుగూరు, పాల్వంచ డిఎస్పిలు రవీందర్ రెడ్డి, సతీష్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సీఐలు వెంకటేశ్వర్లు, అశోక్ రెడ్డి, ఐటీసీ సెక్యూరిటీ ఆఫీసర్ మనీష్ శర్మ, కేటీపీస్, బిటిపిఎస్ అసిస్టెంట్ కమాండెంట్‌లు చంద్రశేఖర్, తిరుపతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు : కలెక్టర్

విశాలాంధ్ర – కొమరం భీం : నిరుపేదల కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకే ఇండ్లు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్. ఎస్.సి. కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలోని లబ్ధిదారుడి ఇంటిని పరిశీలించి, ఆదాయం, కుటుంబ నేపథ్యం, రేషన్ కార్డు వంటి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నట్లయితే విచారించి వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

విశాలాంధ్ర– గూడూరు: ఏజెన్సీ మండలంగా ఉన్న గూడూరులో జర్నలిస్ట్ లందరికీ ఒకేచోట ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం కొంత కష్టమని చెబుతున్న నేపథ్యంలో మండలంలోని వర్కింగ్ జర్నలిస్ట్ లందరికీ వారి.. వారి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి న్యాయం చేయాలని కోరుతూ టీయుడబ్ల్యూజే (ఐజేయు) గూడూరు మండల శాఖ అధ్యక్షులు యాకాంబ్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. టీయుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లా ప్రధానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరితో పాటు గూడూరు మండలానికి చెందిన యూనియన్ బాధ్యులు పాపయ్య, కరుణాకర్ రెడ్డి, యాకూబ్ అలీ, యాదగిరి, నవనీత్, నర్సింహా తదితరులు ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్ ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా టీయుడబ్ల్యూజే ఐజేయు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గూడూరు మండలంలోని వర్కింగ్ జర్నలిస్టులు ఇంటిస్థలాల కోసం, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నారని, తమ కోరిక నెరవేరుతుందని ప్రస్తుత ప్రభుత్వంపై, ఎమ్మెల్యే మురళీనాయక్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. గూడూరు మండలకేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణం అంశాన్ని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్ దృష్టికితేగా, ఇది కూడా సమంజసమైన డిమాండ్ గానే తాను భావిస్తున్నానని మండల పర్యటనకు వచ్చినప్పు డు జర్నలిస్టులతో కలిసి పరిశీలన చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలపై అంత్యంత సానుకూలంగా స్పందించిన మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్‌కు టీయుడబ్ల్యూజే (ఐజేయు) పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

శరవేగంగా ట్యాంక్ బండ్ పనులు

విశాలాంధ్ర – తొర్రూర్: తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువు దగ్గర ట్యాంక్ బండ్ పనులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదేశానుసారం శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ట్యాంక్ బండ్ పనులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాంక్ బండ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ను ఆదేశించారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చొరవతో ఐదు కోట్ల రూపాయలతో ట్యాంక్ బండ్ పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. ఎక్కడ కూడా రాజీ పడకుండా పనులలో నాణ్యత పాటించాలని ట్యాంక్ బండ్ పనులను సుందరీ కరణంగా తీర్చిదిద్దాలన్నారు. తొర్రూరు పట్టణాభివృద్ధిలో ట్యాంక్ బండ్ చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రంజిత్, హెల్త్ అసిస్టెంట్ రాజు, కాంట్రాక్టర్ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏటిసి కేంద్రాల ద్వారా ఆధునిక విద్యా బోధన : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి – పెద్దపల్లి, సింగరేణి : యువతకు ఉపాధి అవకాశాలు లభించే విధంగా ఏటిసి కేంద్రాల ద్వారా ఆధునిక విద్యా బోధన ప్రారంభించామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం ఆయన రామగుండం ఐటిఐ కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ఏటీసీ సెంటర్‌ను సందర్శించారు. ఏ.టి.సి కేంద్రంలో యంత్రాల అమరిక పనులను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేసి, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన ఐటిఐ కేంద్రాలలో ప్రభుత్వం ఏటీసీ కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా ఆధునిక విద్యా బోధన చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భనలో జిల్లా కలెక్టర్ వెంట ఐటిఐ ప్రిన్సిపాల్ ఈ.సురేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైజ్ హాస్పిటల్ డైరెక్టర్ స్వామిగౌడ్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో – సంగారెడ్డి : సన్ రైజ్ హాస్పిటల్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయి నాథ్ అన్నారు. శుక్రవారం సన్ రైజ్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ స్వామిగౌడ్ పుట్టినరోజు పురస్కరించుకొని సన్ రైజ్ హాస్పిటల్ ఆవరణలో పదోవ సారి రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్ మాట్లాడుతూ సంగారెడ్డిలోని సన్ రైజ్ హాస్పిటల్ కార్పొరేట్ వైద్యం సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చిందని ఆయన కొనియాడారు. అనంతరం డాక్టర్ స్వామిగౌడ్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అదృష్టం తనకు తగ్గిందని డాక్టర్ వృత్తిలో ఎంతో సంతృప్తికరంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సన్ రైజ్ హాస్పిటల్ డైరెక్టర్ సంతోష్ గౌడ్, డాక్టర్ మల్లిక రాములు గౌడ్, డాక్టర్ మహేష్ డాక్టర్ వెంకటేష్, డాక్టర్ ప్రసన్న రాణి, డాక్టర్ కృష్ణ, సన్ రైజ్ హాస్పిటల్ వైద్య బృందం సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లి, శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ట

విశాలాంధ్ర – కారేపల్లి : మండల కేంద్రమైన శ్రీ వెంకట సాయినగర్‌లో శుక్రవారం నుండి నుంచి 12వ తేదీ వరకు బొడ్రాయి ముత్యాలమ్మ తల్లి, శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాల సందర్భంగా పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు జరిగాయి. శ్రీవెంకట సాయి నగర్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చాందావత్తు లక్ష్మణ్, కల్తీ భాస్కర్ కమిటీ సభ్యులు పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈనెల11వ తేదీన బొడ్రాయి (నాభి శిల) ముత్యాలమ్మ తల్లి, శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 12వ తేదీన గ్రామదేవతలకు బోనాల సమర్పణ కార్యక్రమం ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగేష్, రాంబాబు, రామారావు, దుర్గయ్య, సమ్మయ్యలతో పాటు వెంకట సాయి నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

'సీతారామ' కాలువల ద్వారా భూములు సస్యశ్యామలం : తుమ్మల

విశాలాంధ్ర బ్యూరో– కొత్తగూడెం: భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు కాలువల ద్వారా ఉమ్మడి జిల్లాలోని భూములను సస్య శ్యామలం చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. జూన్ 15 నాటికి ప్రాజెక్ట్ కెనాల్ నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా అభివృద్ధి పర్చాలని అధికారులను ఆదేశించారు. ములకలపల్లి మండలంలోని సీతారామ ఎత్తిపోతల అక్విడెక్ట్ (సూపర్ ప్యాసేజ్) పిల్లర్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. వేగవంతంగా పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పూసుగూడెం నుంచి కమలాపురం పంప్‌హౌస్ కు వెళ్లే కాలువ మార్గంలో 48.3 కి.మీ. వద్ద సమీప గుట్టపై నుంచి వచ్చే నీళ్ల కాలువలోకి బదులు బయటకు వెళ్లేలా అక్విడెక్ట్ మొత్తం నాలుగు పిల్లర్లతో నిర్మించగా ఒక పిల్లర్ గత నెలలో కూలింది. దాని స్థానంలో కొత్త పిల్లర్ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల, అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి పాటిల్ కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం నాటికి పిల్లర్ నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. జూన్ 15 నాటికి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చేయాల న్నారు. కాలువలో పేరుకున్న గడ్డి, చెట్లు, చెత్తను తొలగించాలన్నారు. అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఎస్సీ శ్రీనివాసరెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్సీ రమేష్, డిప్యూటీ డీఎంహెచ్ ఓ.జయలక్ష్మి పాల్గొన్నారు

ఇస్లాం మతంలో ఉగ్రవాదానికి చోటు లేదు

విశాలాంధ్ర – కొత్తగూడెం అర్బన్: ఇస్లాం ధర్మంలో మహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మానవ విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, ఉగ్రవాదానికి ఏమాత్రం చోటు లేదని ఆయన బోధించినట్లు రాష్ట్ర మైనారిటీ నాయకులు, డాక్టర్ నయీమ్ ఖురేషి స్పష్టం చేశారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదం అక్కడి దేశ ప్రజలకు సంబంధం లేదని, అక్కడి క్రూర ప్రభుత్వల విధానమన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ వక్ఫ్ బోర్డుసవరణ బిల్లు ను వ్యతిరేకస్తూ దేశ ముస్లింలు ఉద్యమిస్తున్న సమయంలో భారత్ – పాక్ మధ్య యుద్ధం రావడం దురదృష్టం అన్నారు. ముస్లింల బహిరంగ సభలకు తాత్కాలిక విరామాన్ని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రకటించిందన్నారు. అదేవిధంగా వాక్ఫ్ బోర్డు సవరణ నల్ల చట్టానికి వ్యతిరేకంగా చేపడుతున్న బహిరంగ సభలను ఈ మే నెల 16 వరకు వాయిదా వేశారన్నారు. ఇండోర్ సమావేశాలు, చర్చలు యధావిధిగా కొనసాగుతాయని ఖురేషి తెలిపారు.

హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర – గార్ల : ప్రభుత్వం హామీలు ఇవ్వడం తప్పా అమలు విషయంలో దిక్కులేని పరిస్థితిలో ఉందని సిపిఐ గార్ల మండల కార్యదర్శి జంపాల వెంకన్న అన్నారు. రాంపురం పాకాల యేటిపై హై లెవల్ బ్రీడ్జి నిర్మించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఐ మండల కమిటీ సమావేశాన్ని నల్లమల గిరి ప్రసాద్ కార్యాలయంలో ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా పెండింగ్లో ఉన్న రాంపురం హై లెవల్ బ్రిడ్జి కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నిర్విస్తారని ఆశించామన్నారు. ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. అందుకే ఈనెల 11 నుండి పాకాల యేటి వద్ద నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోనే ప్రదాన సమస్యగా ఉన్న ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని పాలకులు నిర్లక్ష్యం చేస్తే స్థానిక ప్రజలు ఉపేక్షించారన్నారు. గత పదేళ్లుగా వీళ్ళోస్తే చేస్తారు, వాళ్ళోస్తే చేస్తారెమో అని స్థానికులు ఎదురు చూడటం తప్ప ఫలితాలు కనిపించడం లేదన్నారు. ఈ నెల 11న నిర్వహించే నిరాహార దీక్షని జయప్రదం చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు రాగం రమేష్, పోతుల నరసింహారావు, దూపాటి జనార్దన్, లావుడ్య భీముడు, మాగం లోకేష్, సింగు రమేష్, సిరిమర్తి నాగరాజు, గుండ సుధాకర్ రెడ్డి, రవి, యశ్వంత్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగంగా చేయండి : కలెక్టర్

విశాలాంధ్ర – పెనుబల్లి : రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్, పెనుబల్లి మండలంలో పర్యటించారు. మండాలపాడు గ్రామంలో గులాబీ గ్రామ సమైక్య ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో నిర్వహణ రిజిష్టర్లు, రైతులు తెచ్చిన ధాన్యం తేమశాతం, గన్నీ బ్యాగుల వివరాలు పరిశీలించారు. రైతులతో కలెక్టర్ ఏ రకం ధాన్యం తీసుకువచ్చారని అడిగారు. ఎచ్ఎంటి 1630 రకం వడ్లు తీసుకువచ్చామని చెప్పుతూ రైతులు పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాతావరణం చూస్తే ఎప్పుడు ఆకాల వర్షం వస్తే చేతికి వచ్చిన పంట నష్టపోతామని కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు కోరారు. ప్రతి కేంద్రంలో నిల్వల పరిస్థితిని ప్రతిదినం సమీక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉంటూ పంటకు టార్పాలిన్ కవర్లు కప్పాలని కలెక్టర్ తెలిపారు. పంట మార్పిడి విధానంలో ఆయిల్ పామ్ సాగు చేయాలని కలెక్టర్ కోరారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, పెనుబల్లి తహసీల్దారు గంటా ప్రతాప్, రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భద్రాచలంలో 75 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర – భద్రాచలం: ఒరిస్సా రాష్ట్రం నుంచి భద్రాచలం మీదుగా రాజస్థాన్ రాష్ట్రానికి తరలిస్తున్న గంజాయిని భద్రాచలం వద్ద ఎక్సైజ్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. గంజాయి డ్రగ్స్ నియంత్రణ లో భాగంగా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ తెలంగాణ రాష్ట్రంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టిన నేపథ్యంలో భద్రాచలం ప్రాంతంలోని గోదావరి ఇసుక ర్యాంప్ సమీపంలో 75 కిలోల గంజాయి దొరికింది. అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా ఉన్న కారును ఆపారు. అందులో గంజాయి పట్టుబడినట్లు ఎన్ఫోర్స్మెంట్ సీఐ రమేష్ తెలిపారు. గంజాయి, కారుతో కలిపి రూ. 41 లక్ష విలువ ఉంటుందని అంచనా వేశారు. గంజాయిని పట్టుకున్న కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ గంజాయిని తరిస్తున్న రాజస్థాన్‌కు చెందిన అనిల్ కుమార్ శర్మ, ముఖేష్ కుమార్ దేవ్‌లను అరెస్ట్ చేశారు. పాల్వంచకు చెందిన దుర్గాప్రసాద్ గంజాయి సరఫరా చేశాడని నిందితులు విచారణలో వెల్లడించిన్నట్లు సిఐ తెలిపారు. దుర్గా ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి పట్టుకున్న వారిలో ఎక్సైజ్ ఏఈఎస్ తిరుపతి, ఈఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్స్ కరీం, బాలు ఈసిలు సుధీర్, హరీష్, విజయ్, హనుమంతు ఉన్నారు.

సంపాదకీయం

దండ ప్రయోగంతో నక్సలిజం ఆగదు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా వచ్చే ఏడాది మార్చి ఆఖరు నాటికి మావోయిస్టు ఉద్యమాన్ని తుడిచి పెట్టేస్తానంటున్నారు. అమిత్ షా ఈ మాట చెప్తున్నారంటే నక్సలైట్లు లేవనెత్తుతున్న అసలు సమస్యలను పరిష్కరిస్తారని కాదు. నక్సలైట్ల వ్యవహారాన్ని అనేక ప్రభుత్వాలు కేవలం శాంతి భద్రతల సమస్యగానే చూశాయి. దొరికిన నక్సలైట్లను దొరికినట్టు హతమారిస్తే ఈ సమస్య తీరుతుందని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. అవి రాష్ట్ర ప్రభుత్వాలు కావొచ్చు. కేంద్ర ప్రభుత్వమూ కావచ్చు. నక్సలైట్లు కేవలం శాంతి భద్రతల సమస్యే అయితే ఆ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేయవచ్చు. ఈ సమస్య అనేక రాష్ట్రాలలో ఉంది కనక, కేంద్ర రిజర్వు పోలీసు దళాలను కూడా వినియోగిస్తున్నారు అందుకని కేంద్ర ప్రభుత్వం కూడా జోక్యం చేసుకుంటోంది. మునుపటి ఆంధ్రప్రదేశ్ దృష్టితో చూస్తే డా.వై.ఎస్. రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే నక్సలైట్లతో చర్చలు జరిపారు. ఆ చర్చలు విఫలమయ్యాయి. ఇప్పుడు చర్చల ప్రస్తావన నక్సలైట్ల వేపు నుంచి వస్తోంది. మార్చి 28తో మొదలు పెట్టి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ చర్చలకు సంసిద్ధత తెలియజేస్తూ రెండు పత్రికా ప్రకటనలు విడుదల చేసింది. అలాగే మావోయిస్టుల వాయవ్య కమిటీ చర్చల ప్రస్తావన తెస్తూ మరో రెండు ప్రకటనలు జారీ చేసింది. దీన్ని బట్టి ప్రభుత్వ దమనకాండ నుంచి తప్పించుకోవడానికి మావోయిస్టులు ఆత్రుత పడ్తున్నారని అర్థం అవుతోంది. మావోయిస్టుల కార్యకలాపాలు ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా జరుగుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమ, దంతెవాడ, బీజాపూర్, కంకేర్, నారాయణ్‌పూర్‌లో మావోయిస్టులు బలంగా ఉన్నారు. అయినా చర్చలకు సిద్ధపడ్తున్నారంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఈ ప్రాంతంలోని కర్రెగుట్ట ప్రాంతాన్ని పోలీసులు దిగ్బంధం చేయడంవల్ల మావోయిస్టులకు ఊపిరి ఆడడం లేదు. నిజానికి ప్రభుత్వం అక్కడ మారణహోమం కొనసాగిస్తోంది. ఎన్‌కౌంటర్ పేరిట భద్రతా దళాలు విరుచుకు పడ్డప్పుడల్లా కనీసం రెండు డజన్ల మంది నక్సలైట్లు నేలకొరుగుతున్నారు. మావోయిస్టులను అంతమొందిస్తాం అని అమిత్ షా చేస్తున్న ప్రచారంలో అంతర్భాగంగానే ఈ దిగ్బంధం జరుగుతోంది. గత ఏడాది కాలంలో భద్రతా దళాలు కనీసం 400 మందిని నక్సలైట్ల పేరున మట్టుపెట్టాయి. కశ్మీర్‌లో ప్రతి ఏడుగురు పౌరులకు ఒక పోలీసు ఉంటే నక్సలైట్లకు బలం ఉందనుకుంటున్న ఛత్తీస్‌గఢ్‌లో ప్రతి తొమ్మిది మందికి ఒక పోలీసును నియమించారు. ఇంత మందిని నియమించడం ప్రభుత్వానికి కూడా ఖరీదైన వ్యవహారమే. ఎక్కడ పడితే అక్కడ పోలీసుల శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాజశేఖరరెడ్డి నక్సలైట్లతో చర్చలు జరిపినప్పుడు అది అపూర్వమైన చర్య అనుకున్నారు. కానీ చివరకు ఆయుధాలు వదిలిపెట్టాలన్న షరతును నక్సలైట్లు అంగీకరించలేదు. నిజానికి వైఎస్సార్ ప్రభుత్వం నిశితంగా ఆలోచించి నక్సలైట్లతో చర్చించలేదు. ఆ చర్చలను కేవలం రాజకీయ ఎత్తుగడగానే భావించింది. చర్చల వైఫల్యానికి ప్రభుత్వ దిశారాహిత్యం కూడా ప్రధాన కారణమే. నక్సలైట్ల సమస్య వెనక ఉన్న మూల కారణాలను ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. చర్చలను సానుకూలం చేయడానికి వైఎస్సార్ ప్రభుత్వం చేసిందల్లా మావోయిస్టుల మీద ఉన్న నిషేధం గడువు ముగిసినా పొడిగించక పోవడమే. ఆయుధాలు విసర్జించాలన్న ప్రభుత్వ షరతును మావోయిస్టులు ఒప్పుకోలేదు. భూమి పంపిణీ చేయాలన్న మావోయిస్టుల కోర్కెను ప్రభుత్వం తీర్చలేదు. భూ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న షరతుకు కూడా ప్రభుత్వం సమ్మతించలేదు. నక్సలైట్లు కోటి ఎకరాలు పంచాలంటే వైఎస్సార్ ప్రభుత్వం పంపిణీ చేయడానికి భూమిని గుర్తించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేసింది. లక్ష ఎకరాలు పంచాలని నిర్ణయించింది.

నక్సలైట్ల హింసా మార్గాన్ని ఎవరైనా అభ్యంతర పెట్టవచ్చు. ఆ హింసను అరికట్టడానికి ప్రభుత్వం చర్య తీసుకోవచ్చు. నక్సలైట్ల సమస్య కేవలం శాంతి భద్రతలకు పరిమితమైంది కాదు. అందులో ఆర్థికాంశాలు ఉన్నట్టే అది రాజకీయ సమస్య. రాజకీయ సమస్యను రాజకీయాల ద్వారానే ఎదుర్కోవాలి తప్ప ప్రభుత్వమే నక్సలైట్లను అంతమొందించాలని అనుకోకూడదు. చట్టబద్ధపాలనకు కట్టుబడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఎక్కువగా ఉంటుంది. పేదరికం, స్వేచ్ఛ కొరవడడం, నిరుద్యోగంలాంటి అనేక సమస్యలు మావోయిస్టు కార్యకలాపాలకు రాజకీయ మద్దతు లభించడానికి ముఖ్యమైన కారణం. ఈ మద్దతును తుపాకీ మొన చూపించి లాగేయడం కుదిరే పని కాదు. పైగా సాయుధ పోరాటం మినహా నక్సలైట్లు లేవనెత్తే అత్యధిక సమస్యలు రాజ్యాంగబద్ధమైనవే. ఈ అంశాన్ని ఏ ప్రభుత్వమూ ఆమోదించడం లేదు. 2009 జూన్ నుంచి కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, బీహార్, ఒడిశా రాష్ట్రాలలో నక్సలైట్లను అంతమొందిస్తూనే ఉంది. నక్సలిజం అంటే అదేదో రుగ్మత అని దాన్ని అరికట్టడానికి వారి అస్తిత్వమే లేకుండా చేయడమే మార్గమని ప్రభుత్వం మొదటి నుంచి తప్పుడు అవగాహనలోనే ఉంది. నక్సలైట్లు లేవనెత్తిన అంశాలను పరిష్కరించడానికి గానీ, రాజకీయ పరిష్కారం కనుగొనడానికిగానీ ప్రభుత్వం ప్రయత్నించనే లేదు. నక్సలైట్ల అర్థరహిత హింసాకాండను సమర్థించవలసిన అవసరం లేదు. హింసకు పాల్పడిన వారి మీద చట్టరీత్యా చర్య తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం అసలు లెక్కలోకే తీసుకోవడం లేదు. నక్సలైట్ల విషయంలో రాజ్యాంగంలోని 14వ, 21వ అధికరణాలను ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలే లేవు. నక్సలైట్ల ఉద్యమం అణచివేత, దోపిడీ, నిరాశ నుంచి పుట్టిందని వీటికోసం అంగలారుస్తున్న వారు మావోయిస్టులకు ఏదో ఒక రకంగా మద్దతిస్తున్నారని కూడా ప్రభుత్వం గ్రహించడం లేదు. శాంతి భద్రతల పరిరక్షణ అంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిని, ఎదిరించేవారిని చిత్రహింసలు పెట్టడం కాదు. 2008లో ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన నిపుణుల బృందం కూడా నక్సలైట్ల సమస్యను సామాజిక, రాజకీయ దృక్కోణంతో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కోవాలని సూచించింది. వినిపించుకునే నాథుడేలేడు. దహనకాండ, హత్యాకాండకు దిగడానికి తమకు సర్వహక్కులూ ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్‌కౌంటర్లు చేసిన పోలీసులకు పదోన్నతులు ఇవ్వడంవల్ల కొందరు పోలీసులు మరీ కిరాతకంగా తయారయ్యారు. వీరికి "ఎన్‌కౌంటర్ నిపుణులు" అన్న ముద్దు పేరు కూడా వచ్చింది. హోం మంత్రి అమిత్ షా చెప్పిన లెక్కల ప్రకారమే 2019 నుంచి బస్తర్‌లో 250 భద్రతా శిబిరాలు ఏర్పాటు చేశారు. అంటే ప్రతి రెండు నుంచి అయిదు కిలోమీటర్ల దూరంలో ఓ భద్రతా శిబిరం ఉంది. ఇవి భద్రత కల్పించడం మాటేమోగాని జనాన్ని బెదరగొడ్తున్నాయి. వారి కదలికలను దుర్భరం చేస్తున్నాయి. ఇంత భారీ భద్రత కల్పించడం వెనక ప్రభుత్వానికి మరో కుటిల ఉద్దేశమూ ఉంది. అది ఖనిజాలు తవ్వే కంపెనీల కోసం మార్గం మరింత సుగమం చేయడం. బస్తర్ ప్రాంతం ఖనిజాల నిక్షేపం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి ఖనిజాల ద్వారా సమకూరే ఆదాయంలో 50 శాతం ఒక్క దంతెవాడ నుంచే అందుతోంది. 2022 నుంచి బస్తర్‌లో 51 మైనింగ్ లీజులు మంజూరు చేశారు. అందులో 14 మాత్రమే ప్రభుత్వ రంగంలో ఉన్నాయి. మిగతా లీజులు మంజూరు చేయడం ద్వారా ప్రభుత్వం ఎవరి కొమ్ము కాయదలచుకుందో చెప్పక్కర్లేదు.

అసమానతలతో ప్రాంతీయ వాదమే

వి. శంకరయ్య

ప్రాంతీయ అసమానతలు కొనసాగినంత కాలం ప్రాంతీయ వాదం వర్ధిల్లుతూనే వుంటుంది. విడదయలేని వాణి, వీణ కవల పిల్లలు నిత్య జీవితంలో ఎంత హింస అనుభవిస్తున్నారో ప్రాంతీయ అసమానతలతో రాష్ట్రంలో వెనుకబడిన ఏడు జిల్లాల ప్రజలు అంతకు మించి కుములుతున్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ అమరావతి రాజధానిపైననే నిధుల్ని వ్యయం చేస్తూ ఇతర ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తూ ప్రాంతీయతత్వం రెచ్చగొడుతున్నారని ఈ విషయంలో జాగ్రత్తగా వుండి తిప్పికొట్టాలని సూచించారు. రాష్ట్రంలోని మెట్ట ప్రాంతమైన ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో ఏం జరుగుతోందో నిఘా అధికారులు చంద్రబాబు నాయుడుకు సమగ్రమైన క్షేత్రస్థాయి వాస్తవ సమాచారం ఇచ్చినట్లు లేదు. నిఘా వర్గాలను అటుంచగా కనీసం సీమకు చెందిన మంత్రులైనా ముఖ్యమంత్రికి ఎందుకు వాస్తవ పరిస్థితి నివేదించలేదో మిలియన్ డాలర్ల ప్రశ్నగా వుంది.

అమరావతికే నిధులు వ్యయం చేస్తూ రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు వాటికి పంట కాలువలు త్రవ్వడం లేదని వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారం ఎంత వాస్తవమో అందుకు కావలసినంత ఇంధనం సరఫరా చేసేవిధంగా ప్రభుత్వ విధానం వుండటం అంతే వాస్తవం. అయితే గత ఐదేళ్ల అనుభవం కళ్ల ముందు వున్నందున అంత త్వరగా వైసీపీ బుట్టలో పడరేమో. గత రెండు నెలలుగా రాయలసీమలోని అనేక నియోజకవర్గ కేంద్రాల్లో వివిధ సాగునీటి ప్రాజెక్టుల సాధనకు ఏర్పడిన సంస్థలు ధర్నా, నిరసన ప్రదర్శనలు నిర్వహించి అధికారులకు మెమోరాండాలు ఇస్తున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో వైసీపీకి పార్టీగా ప్రమేయంలేదు. వ్యక్తులుగా కొందరు నేతలు పాల్గొంటున్నారు. పైగా అన్ని వామపక్ష పార్టీల నేతలు వున్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తొలి రోజుల్లో శ్రీశైలం జలాశయం సందర్శనకు వచ్చిన సందర్భంగా సిద్దేశ్వరం అలుగు నిర్మాణం గురించి ప్రయత్నం చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అది సాధ్యమా కాదా అనే ఫాలో అప్ లేదు. ఈ అంశంపై సీమ సామాజిక మీడియాలో డిమాండ్ ఎక్కువగా ఉంది. తుదకు సీమ మంత్రులు పట్టించుకోలేదు. ఇవన్నీ వైసీపీ నేతలు చేసిన పని అని ముఖ్యమంత్రికి తప్పుడు నివేదికలు చేరి వుండాలి. 2019లో ఎన్నికలు ముందు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వేదవతి ఎత్తిపోతలు గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణ కోసం పరిపాలనా అనుమతి ఇచ్చి టెండర్లు పిలిచారు. ఇప్పుడు చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రిగా వచ్చారు కాబట్టి ఈ పథకాల నిర్మాణం చేపట్టాలని ఉమ్మడి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో తీవ్ర అలజడిగా వుంది. అదే విధంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో శ్రీ శైలం కుడి ప్రధాన కాలువకు చెందిన గోరకల్లు రిజర్వాయర్ రివిట్‌మెంట్ జారిపోయి కట్ట కూడా పరమ అధ్వానంగా తయారైంది. ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీని మీద స్థానికంగా రైతులు ఆందోళన చేస్తున్నారు. వీటి మరమ్మతులకు నిధులు లేవంటున్నారు. మరో వేపు కోట్లాది రూపాయలు అమరావతికి అప్పు తెచ్చి వ్యయం చేస్తున్నారు. వాస్తవంలో అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ పథకం కావచ్చు. అది సామాన్య ప్రజలకు తెలియదు కదా! అమరావతి పట్ల చూపుతున్న శ్రద్ధలో కొద్దోగొప్పో వెనుక బడిన ప్రాంతాలకు చూపవలసి వుందని కోరుతున్నారు. ఇది వైసీపీ వారు రెచ్చగొట్టే అంశంగా భావిస్తే అంతకన్నా ఆత్మహత్యా సదృశ్యం మరొకటి ఉండదు. వైసీపీ మీడియాలో వచ్చే వార్తలకు ఈ ఉద్యమాలకు సంబంధం లేదు.

అదే విధంగా హంద్రీనీవా ప్రాజెక్టు. ప్రభుత్వం నేడు చేపట్టిన విధానం, మంత్రులు మరి కొందరు నేతలు చేసిన ప్రకటనలు అనంతపురం, చిత్తూరు జిల్లా ప్రజల మధ్య విభేదాలు ఏర్పడే పరిస్థితి కల్పించాయి. నీటి వసతి సున్నితమైన అంశం. నేతలు జాగ్రత్తగా ఉండాలి. జీడిపల్లి జలాశయం కింద భాగంలో కాలువ లైనింగ్ పనులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన నియోజకవర్గం కుప్పంకు నీళ్లు తీసుకుపోయేందుకు అనే అభిప్రాయం అనంతపురం జిల్లా రైతుల్లో ఏర్పడింది. ఇప్పుడు రైతులు డిమాండ్ చేస్తున్నట్లు కాలువ వెడల్పుచేసే ఆర్థిక స్థితిలో ప్రభుత్వం లేదు. కనీసం లైనింగ్ చేస్తున్న కాలువ వెంబడి పంట కాలువలు తవ్వితే ఎంతో కొంత ఊరట వుంటుంది. ఈ డిమాండ్లు కూడా వైసీపీ నేతలు రెచ్చగొట్టడంగా భావిస్తే ఇంతకన్నా మించిన పలాయన వాదం మరొకటి వుండదు. ఈ ఆందోళనలో జిల్లాలోని అన్ని పార్టీలు పాల్గొంటున్నాయి. అదే విధంగా పెన్నా నది మీద వున్న రిజర్వాయర్లన్నీ పరమ అధ్వానంగా వున్నాయి. ఎప్పుడైనా కుంభవృష్టి పడి వరద వస్తే అరకొరగా నీళ్లు నిల్వ చేస్తున్నారు. మిగిలిన నీరు సముద్రం పాలౌతోంది. ప్రధానంగా కుందు నది నీళ్లు సోమశిల చేరి సముద్రం పాలౌతున్నాయి. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఈ అభిప్రాయం సీమ ప్రాంతంలో బలంగా నెలకొన్నది. కనీసం పదీ, పదిహేనేళ్ల కాలంలో గాని (పోలవరం అనుభవం చూపెడుతున్నారు) అమలుకురాని గోదావరి బనకచర్ల అనుసంధానం చూపెట్టి తమకు వెను వెంటనే ఫలితాలు ఇచ్చే పథకాల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారనే అభిప్రాయం సీమ ప్రాంతంలో బలంగా ఉంది. బొల్లాపల్లి జలాశయం వరకే గోదావరి జలాలు పరిమితంచేసి తద్వారా మిగిలే కృష్ణా నీళ్లు శ్రీ శైలం నుంచి తమకు ఇవ్వమని సీమ వాసులు కోరుతున్నారు. తద్వారా మిగిలే నిధులు సీమ ప్రాజెక్టులకు వ్యయం చేయమని కోరుతున్నారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత లోతుగా అధ్యయనం చేయవలసి వుంది. ఈ గందరగోళాన్ని వైసీపీ ఉపయోగించుకొంటోంది. రాయలసీమ ప్రజలు ఏం కోరుకొంటున్నారో ఆ డిమాండ్లు గాలికి వదలిపెడితే మంత్రులు ఎమ్మెల్యేలు ఎంత ప్రచారం చేసినా వైసీపీ దుష్ట పన్నాగాలు నివారించడం అసాధ్యం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వతహాగా అవగాహనలేని నేత కాదు. పైగా కేవలం నిఘా వర్గాలు, పార్టీ నేతలు, మంత్రులు ఇచ్చే ఫీడింగ్ కాకుండా వేర్వేరు మార్గాల్లో సమాచారం సేకరించే అలవాటు వుంది. అంతెందుకు? 2024 ఎన్నికల్లో రాయలసీమ జిల్లాల్లో జరిగిన ప్రతి బహిరంగ సభలోనూ టీడీపీ అధినేతగా చంద్రబాబు నాయుడు అమరావతి గురించి స్పష్టంగా చెప్పారు. దాపరికం అంటూ ఏమీ లేదు. కాని అదే సమయంలో కర్నూలులో హైకోర్టు పెడతానని జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. కాని కర్నూలు జిల్లాతో పాటు మొత్తం రాయలసీమలో కూటమి స్వీప్ చేసింది. అమరావతి రాజధాని తమది కాదనుకొని వుంటే ఈ తీర్పు వచ్చేది కాదు కదా? రాయలసీమలో ఎక్కువ మంది అమరావతి రాజధానిని వ్యతిరేకించడం లేదు. విశాఖ కన్నా అమరావతి తమకు దగ్గరని లెక్కలు వేసుకున్న వారు లేకపోలేదు. అయితే ఒక్కో ప్రాంతంలో ప్రజల డిమాండ్లు భావజాలం ఒక్కో రకంగా వుంటాయి. రాయలసీమలో ఎవరి నైనా నిద్ర నుంచి లేపండి నీళ్లు నీళ్లు అని కలవరిస్తారు. గొంతెండి పోతున్న ప్రాంతమది. అమరావతికి ఎన్ని వేల కోట్లు వ్యయం చేసినా పట్టించుకోరు. రాయలసీమకు "ఆ హబ్ ఈ హబ్" లు, గ్రీన్ ఎనర్జీలతో సరిపెట్టకుండా వచ్చే రెండు మూడేళ్లలో పొలాలకు నీళ్లు ఇచ్చే కార్యక్రమం చేపడితే వెయ్యి మంది జగన్‌మోహన్ రెడ్డిలు చెప్పినా రాయలసీమలో ప్రాంతీయ వాదం గురించి మాట్లాడే వారు వుండరు.

విశ్రాంత పాత్రికేయులు, సెల్: 9848394013

విశాఖ సమగ్రాభివృద్ధి ఎలా ?


డాక్టర్ సీ ఎన్ క్షేత్రపాల్

రాష్ట్రంలోని పెద్ద నగరం విశాఖ ఏపీకి ఆర్థిక రాజధాని అనిపించుకుంటున్నది. అత్యంత వెనుబడ్డ ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఆయువుపట్టు. ఇటువంటి విశాఖ నగరం రాష్ట్ర విభజన అనంతరం అనుకున్నంత స్థాయిలో అభివృద్ధి చెందలేదు. నగర అభివృద్ధిలో ప్రధాన పాత్ర వహించిన ప్రభుత్వ రంగ సంస్థలనేకం సంక్షోభంలోకి జారుకున్నాయి. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో ఏమి జరుగుతున్నదో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. విభజన చట్టంలోని ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఆగిపోయాయి. మెట్రో రైల్ పాలకుల ప్రకటనల్లో తప్ప నిజరూపం దాల్చడం లేదు. పెట్రో యూనివర్సిటీ నిర్మాణమే ప్రారంభం కాలేదు. నగర నీటి అవసరాలను తీర్చే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు మిగిలింది. రాష్ట్రానికే తలమానికమైన ఆంధ్ర యూనివర్సిటీ కళావిహీనంగా మారింది. ఇటీవల ప్రారంభమైన వందేళ్ల సంబరాల్లో నిరుత్సాహం చోటుచేసుకుంది. ఇవన్నీ విచారించదగిన అంశాలే. ఈ తరుణంలో విశాఖ నగరం సర్వతోముఖాభివృద్ధికి ఉన్న అవకాశాలేమిటో చర్చనీయాంశం కావలసి ఉన్నది.

రాష్ట్రంలో ఇప్పటికున్న ఐటీ రంగానికి విశాఖే ప్రధాన కేంద్రం. విభజన అనంతరం ఐటీ రంగం విశాఖలోనే ప్రగతి సాధిస్తోందనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది. ఇప్పటికే నగరంలోని రుషికొండ వద్ద ఐటీ కోసం ప్రత్యేక సెజ్ ఏర్పాటు ఉన్నది. ఐటీ అభివృద్ధి కోసం గతంలో కొంత ప్రయత్నం జరిగింది. టెక్ మహీంద్రా(అప్పట్లో సత్యం కంప్యూటర్స్) వంటి సంస్థలు టవర్స్ కట్టాయి. మధురవాడ కేంద్రం అవుతుందని ఆందరూ అనుకున్నారు. కానీ ఆశించిన స్థాయిలో కంపెనీలు రాలేదు. అదానీ డేటా సెంటర్‌కు వందల ఎకరాలు భూమి ఇచ్చినా వస్తాయనుకున్న ఉద్యోగ అవకాశాలు రాలేదు. గత జగన్ ప్రభుత్వం వేధింపు చర్యల కారణంగా కొన్ని కంపెనీలు ఇక్కడి నుంచి వెళ్లిపోయాయి. మధురవాడ వద్ద 22 ఎకరాల్లో ఏర్పాటైన ఐబీఎం వెనక్కు వెళ్లింది. నగరం నడిబొడ్డున ఉన్న అనేక కంపెనీలు మూతపడ్డాయి. తెలంగాణలో ఐటీ ఉద్యోగుల సంఖ్య 9 లక్షలకు చేరుకుంటే ఏపీలో 30 వేలలోపే ఉన్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. నవ్యాంధ్రలో ప్రస్తుతం సగటున కేవలం రూ.2,200 కోట్ల మేర మాత్రమే ఐటీ ఎగుమతులు జరుగుతున్నాయంటే మన రాష్ట్రం ఐటీ రంగం అభివృద్ధి విషయంలో ఎంత వెనకబడి ఉన్నదో అర్థమవుతుంది. దీనికి కారణం ఐటీ రంగంలో మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ప్రభుత్వం సక్రమమైన చర్యలు తీసుకోకపోవడమే. మెట్రోపాలిటన్ సిటీని తలపించే విశాఖలో అవకాశాలు పుష్కలంగా ఉన్నా ప్రభుత్వాల నిర్లక్ష్యమే ఐటీ అభివృద్ధికి శాపంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ మీద కేంద్రీకరించి, విశాఖ మీద తగిన శ్రద్ధ చూపలేదు. ఇప్పుడూ అదే పరిస్థితి కనిపిస్తోంది. రాజధాని అమరావతి మోజులో ఉన్న ప్రభుత్వ పెద్దలు అక్కడే ఐటీకి ప్రాధాన్యత అంటూ ప్రకటనలు చేస్తున్నారు. విశాఖలో విస్తృతమైన అవకాశాలున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆలోచనా విధానంలో మార్పు రావలసి ఉన్నది. ప్రత్యేకంగా ఐటీ విధానాన్ని ప్రత్యేకంగా రూపొందించడం తోపాటు సమయాన్ని నిర్దేశించుకుని పక్కా ప్రణాళికలతో అవసరమైన రాయితీలు అందిస్తే విశాఖలో ఐటీ పరిశ్రమ బలపడుతుంది. ఐటీ రంగాన్ని అభివృద్ధి పరచడం ద్వారానే రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖ అనే దానికి సార్థకత కల్పించవచ్చు. సీఎం చంద్రబాబు చెబుతున్న విజన్ 2047 నాటికి నగర జనాభా కోటి మార్కును దాటుతుంది. ఇప్పుడున్న 30 లక్షలలోపు జనాభాకే తగిన రీతిలో ఉపాధి అవకాశాల కల్పన జరగలేదు. కోటి జనాభాను దాటితే ఉపాధి అవకాశాలు ఎలా అని ప్రభుత్వం ఆలోచించవలసి ఉంది. ఈ ముందస్తు ఆలోచన భవిష్యత్తులో ఉపాధి కల్పనకు అవసరమైన మార్గాల అన్వేషణకు మార్గం చూపుతుంది. విశాఖ నగరంలోని విలువైన ప్రభుత్వ ఆస్తులు కబ్జాకోరుల చేతుల్లోకి చేరుతున్నాయి. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం విశాఖకు లక్షల మంది పేదలు వలస వస్తున్నారు. ఉపాధి అవకాశాలు మృగ్యమవుతున్నాయి. స్వయం ఉపాధి మార్గాలు లేకుండా పోతున్నాయి. బతుకు తెరువు కోసం నగరానికి వస్తున్న వారికి ఉపాధి అవకాశాల కల్పనపైనా ప్రభుత్వాలు దృష్టి పెట్టవలసి ఉన్నది. నగరంలోని పుట్‌పాత్‌లపై వ్యాపారాలు పెరిగాయి. ఇది ట్రాఫిక్ సమస్యకు దారి తీస్తున్నది. పుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే వారి జీవనాన్ని దెబ్బ తీయకుండా వారి కోసం నగరంలో ప్రత్యేక ప్రాంతాలను గుర్తించి హాకర్స్ జోన్‌లను ఏర్పాటు చేయవలసిన బాధ్యతను పాలకులు గుర్తించాలి ఉన్నది. నగరానికి ఆనుకుని ఉన్న సింహాచలం దేవస్థానం పరిధిలోని పంచగ్రామాల భూసమస్య పరిష్కారం అవలేదు. టూరిజం అభివృద్ధిలో సింహభాగమైన సాగరతీర పరిరక్షణలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది. సముద్ర తీర ప్రాంతంలో ప్రైవేటు ఆక్రమణలకు అడ్డు లేకుండా పోతోంది. అనుమతులు లేకుండానే ప్రైవేటు రిసార్టులు, రెస్టారెంట్లు వెలుస్తున్నాయి. నగరంలో పర్యాటక రంగానికి ఎన్నో అవకాశాలు ఉన్నా పాలకులు దృష్టి సారించడం లేదు. పైగా పర్యాటకం అభివృద్ధి పేరుతో బీచ్‌లలో మద్యం అమ్మకాలు



చేపడతామంటూ విశృంఖలత్వానికి ప్రభుత్వమే దారులు వేస్తోంది. నగరంలో ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం దొరకడం లేదు. దీని పరిష్కారం కోసం చేసిన ఎక్స్‌ప్రెస్ కారిడార్ల నిర్మాణం అటకెక్కింది. వచ్చే ఏడాది ప్రారంభిస్తామని చెబుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరాలంటే మూడు గంటల సమయం పడుతుంది. సులభంగా చేరుకునేందుకు కూర్మన్నపాలెం నుంచి భోగాపురం వరకూ హైదరాబాద్‌లోని పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే తరహాలో ఫ్లైవోవర్ నిర్మాణం జరగాల్సి ఉన్నది. ఇదే రీతిలో మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణాన్ని చిత్తశుద్ధితో పూర్తి చేయవలసి ఉంటుంది. ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి మీదుగా భోగాపురం వరకూ వేగవంతమైన ప్రయాణానికి అవసరమైన చర్యలు చేపట్టవలసి ఉన్నది.

ప్రశాంతతకు మారుపేరు విశాఖ అనేది కాలగర్భంలో కలుస్తున్నది. నగరంలో శాంతి భద్రతలు రోజు రోజుకూ క్షీణిస్తున్నాయి. అనేక అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రౌడీ షీటర్ల ఆగడాలు శృతిమించి పోయాయి. రెండేళ్ల కాలంలో ఉషోదయ జంక్షన్ పరిసరాల్లో రెండు మూడు హత్యలు చోటుచేసుకున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో దందాలు, మోసాలు పెరిగిపోతున్నాయి. 2018లో 180 మంది రౌడీ షీటర్లు ఉన్నట్టు పోలీసుల రికార్డుల్లో నమోదు కాగా తాజాగా ఈ సంఖ్య 450కి చేరువైనట్టు అధికారిక గణాంకాలే తెలుపుతున్నాయి. ఇది నేరాల సంఖ్య పెరుగుదలను వెల్లడిస్తోంది. మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపుల కేసులు కూడా పెరిగాయి. మాదకద్రవ్యాల దందా యధేచ్ఛగా సాగుతోంది. నిరుద్యోగులను మోసం చేసే సంస్థలు పెరుగుతున్నాయి. ఉద్యోగాల ఆశచూపి లక్షలు వసూలు చేసి బోర్డు తిప్పేస్తున్న సంస్థలు పెరుగుతున్నాయి. ఒక ముఠా ఏకంగా జిల్లా కలెక్టరు కార్యాలయం, రైల్వే శాఖలో ఉద్యోగాలు అంటూ 70 మంది వద్ద దాదాపు రూ.5 కోట్లు వసూలు చేసి కలెక్టరు కార్యాలయం ముద్రతో అపాయింట్ లెటర్లు ఇచ్చి నిరుద్యోగులను మోసగించింది. ఈ రకమైన సమస్యలను పరిష్కరించడంతో పాటు నగరంలోని వివిధ వర్గాల ప్రజా సమూహాలతో చర్చించి విశాఖ సర్వతో ముఖాభివృద్ధికి అవసరమైన చర్యలకు ప్రభుత్వం ఉపక్రమిస్తుందని ఆశిద్దాం.

సెల్ :9059837847

యుద్ధం మధ్యలో నిలబడిన కవయిత్రి....

యుద్ధం ఎవరి మధ్యలో జరుగుతుంది...!? అసలెవరెవరికి యుద్ధం జరుగుతుంది.!? ఇందులో మన పాత్ర ఏమిటీ!?. మనం నేరుగా యుద్ధంలో ఉంటామా!? అసలు యుద్ధ ఛాయలు మన చుట్టూనే ఉంటాయా!? మనం యుద్ధం నుంచి తప్పించుకోలేమా...!? ఇన్ని ప్రశ్నలకు మన దగ్గర సమాధానం ఉంటుందా... !? అసలు ఇన్ని ప్రశ్నలు వేసుకుంటామా.. !? ఇదంతా ఎందుకు... ఎక్కడ యుద్ధం జరుగుతోందో మనకి తెలుసా..!? ఎందుకు జరుగుతోందో తెలుసా...!? మన మధ్యతరగతి జీవితాలకి, యుద్ధానికి ఏమైనా సంబంధం ఉందా...!? అసలు ఇన్ని ప్రశ్నలున్నాయని మనకి తెలుసా..!?

మీ గురించి నాకు తెలీదు కానీ... నాకు మాత్రం ఈ మధ్యనే ఇన్ని ప్రశ్నలు ఎదురయ్యాయి. జర్నలిస్టుని కదా... తెలుసనుకున్నాను. తెలీకపోతుందా అని అనుకున్నాను. ఇదంతా నా బోలుతనమే అని నాకు తెలిసొచ్చింది. అన్నీ తెలుసు అన్న... లేదూ తెలుస్తాయి అనుకున్న ఓ అతి విశ్వాసమే. ఇది చదివాక తెలిసొచ్చింది... యుద్ధం గురించి మనకి

చక్రవాకం

- ముక్కాము చక్రధర్

తెలిసింది చాలా తక్కువని. మనిషి గురించి మనకి తెలిసింది అతి తక్కువని. మానవత్వం గురించి మనకి తెలిసింది అసలు లేనే లేదని. ఇలా ఇన్ని తెలియని తనాల నుంచి తెలివిడితనంలోకి రావడానికి చాలా కాలమే పడుతుంది. మన కనుసన్నల్లోనే అంతా జరగాలని మనం ఆశిస్తున్నామని ప్రపంచం అనుకుంటోందని మనకి తెలిసే వరకూ మనకు తెలీదు. అసలు మన కనుసన్నలు మన పరిధిలోనే లేవనే విషయం ప్రపంచానికి తెలిసే వరకూ తెలీదు.

కానీ ఇదిగో ఇలా తెలుస్తుంది... ఇదిగో ఇలా అశ్చర్య పరుస్తుంది. అప్పుడు యుద్ధం మన ఎరుకలోకి వస్తుంది. ఇలా ఎరుకలోకి తీసుకువచ్చే వాళ్లే సృజనకారులని తెలిసొస్తుంది. నాకూ అలాగే తెలిసొచ్చింది. ఇదే కాదు చాలా విషయాలు ఇలాగే తెలిసొచ్చాయి ఈ లైఫ్ డ్రామా అనే కవిత్వ సంకలనం చదివాక. ఈ కవిత్వం రాసిన రాధాకృష్ణ కర్రి అతి సాధారణ మధ్య తరగతి గృహిణి. ఇంట్లో నిత్యావసరాలు, పిల్లల చదువులు, కట్టాల్సిన ఈఎంఐలు, ప్రతినెలా చిల్లర బాకీలు, పనిమనిషి లేకుండా ఇంటిని అందంగా అమర్చుకోవడాలు, కరెంట్ బిల్లు ఇంత కంటే ఎక్కువ రాకూడదని చేసుకున్న నిర్ణయాలు... ఇలాంటి దిగువ మధ్య తరగతి మహిళకు యుద్ధం గురించి ఎలా తెలిసింది !? అసలు యుద్ధ విరామం గురించి ఎలా అంచనా వేసింది!? జీవితం మొత్తం ఓ నాటకం అని ఎలా నిర్ధారణకు వచ్చింది!? ఇవన్నీ నాకు వచ్చిన ప్రశ్నలు. లేదూ నేను వేసుకున్న ప్రశ్నలు. ఎందుకంటారా... ఎక్కడో యుద్ధ బీభత్సం జరిగితే దాని ప్రభావం ఖండాతరాలు, సముద్రాలు, నదులు, పర్వతాలు, ఏరులు, సంస్కృతులు, ఎల్లలు, రంగులు, నానా పుర్రాకులు దాటి ఆంధ్రప్రదేశ్ అనే రాష్ట్రంలో ఓ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న చిన్న పట్టణం నందిగామలో ఉంటున్న ఈ రాధాకృష్ణ అనే కవయిత్రికి ఎలా చేరుకుంది. ఆ బీభత్సం ఆమెకు చేరువైన తర్వాత ఇలా కవిత్వంలా ఎందుకు బద్ధలైంది.

"ఆకలి, నిద్ర కలుసుకునేలోపు
తెగిపడ్డ దేహాలు వాటిని ఎడం చేస్తున్నాయి.
దేహాల డంపింగ్ యార్డులు,
ఎర్రటి నేలలు కొత్త రోదనాగీతం ఆలపిస్తుంటే
రాబందులు దావత్ చేసుకుంటున్నాయి"

ఇదీ ఈ లైఫ్ డ్రామా అనే ఈ కవిత్వ సంకలనంలో యుద్ధ విరామం అనే పద్యంలోది. ఆకలి, నిద్ర కలుసుకునే లోపు తెగిపడ్డ దేహాలు వాటిని ఎడం చేస్తున్నాయి. వేటిని ఎడం చేస్తున్నాయి.... !? అసలు ఆకలి, నిద్ర కలుసుకోవడమేమిటి...!? ఈ ఆకలి, నిద్రకు సారూప్యమేమిటి...!? సాంగత్యమేమిటి...!? ఈ రెండింటిని తెగిపడ్డ దేహాలు ఎడం చేయడమేమిటి....!? ఇవీ నాకు వచ్చిన ప్రశ్నలు ఈ రాధ గారు రాసిన యుద్ధ విరామం కవిత చదివిన తర్వాత. ఓ సాధారణ గృహిణి యుద్ధ బీభత్సాన్ని ఇంత అనుభవించిందా... మనుషులు మాత్రమే లోకంలో ఉండాలని కాంక్షిస్తే తప్ప ఇంత భయాన్ని చెప్పగలమా....!? అసలు యుద్ధం లేని ఓ జీవితాన్ని కోరుకుంటే తప్ప ఇంత విశాలమైన భావాల్ని చెప్పగలమా....!? ఇలా చెప్పడానికి ధైర్యం కావాలా... లేక ఓ వెర్రి లోకపు సుఖాన్ని వాంఛించాలా....!? ఈ రెండూ ఉంటేనే ఇలాంటి యుద్ధ విరామం వంటి పద్యాన్ని రాయగలరు. అవును... "మనుషులురా... మీ యుద్ధ వాంఛతో ఈ భూమి మీద మనుషుల్ని లేకుండా చేస్తున్నారా....!? మీ యుద్ధాలాపనకు లక్షలాది ప్రాణాలు కళ్ల ముందే లేకుండా పోతున్నాయిరా" అని నిలదీసే ధైర్యం కావాలి. ఇదే కాదు... లోకా సమస్తా సుఖినో భవంతు అనే కాంక్ష కావాలి. బహుశా ఇంతటి తీవ్ర కాంక్షతో, ప్రజల కోసం రాసిన కవులు తెలుగులో 70, 80 దశకాల్లోనే కనిపించారు. కొంతవరకూ 90 దశకంలో కాన వచ్చారు.

నేటి కవిత్వావరణంలో హఠాత్తుగా కవులుగా, రచయితలుగా అప్పటికప్పుడు పేరు తెచ్చేసుకున్న వారిలాగే ఈ కవయిత్రి కూడా అని భ్రమించాను. నేటి సాహిత్య వాతావరణంలో ఇలా యుద్ధ విరామం వంటి కవిత్వాన్ని ప్రకటించిన రాధాకృష్ణ సహజంగానే నన్ను ఆశ్చర్యపరిచారు.

"ముఖానికి నవ్వుల రంగులు అద్దుకొని
అద్దెకు తెచ్చుకున్న కలగలపుతనంతో
అద్భుతమైన నటనను ప్రదర్శిస్తూ వస్తున్నా"....
"జోకర్ మాస్కులో ఉన్న నా ముఖం
చిరునవ్వుల నటనను కొనసాగిస్తూనే
రోజుకో ప్రదర్శన చేస్తూనే ఉంది"

ఇదీ ఈ లైఫ్ డ్రామాలో ప్రత్యేక స్థితి. ఇది ఏకవచనం కాదు. బహువచనం కూడా కాదు. ఇది అందరికీ వర్తించే సామూహిక వచనం. ఈ విషయాన్ని రాధాకృష్ణ చెప్పారు. నిజానికి ప్రతి ఒక్కరూ ఈ లైఫ్ డ్రామాలో రంగులు అద్దుకోవడం, కలగలుపుతనంతో నటించడం నిత్యకృత్యమైన దినచర్య.

"నెర్రలు బారిన నేలను తాకిన చినుకులా
ప్రసవ వేదనను దూరం చేసిన చిట్టిపాపలా
కొత్త ఆశ పొద్దు పొడిచింది" అని ఆశలు చూపారు. ఇలాగే ఉండాలి కవిత్వం. వాస్తవాన్ని కళ్ల ముందు సాక్షాత్కరించి ఇది కాదురా బాబూ బతుకు అని చెబుతూ, ఎలా ఉండాలో కూడా చెప్పాలి... బాధ్యత కలిగిన సాహితీవేత్తలు. ఈ పనే చేశారు రాధాకృష్ణ తన ఈ లైఫ్ డ్రామా కవిత్వంతో. ఎవరికి వారే పరాయీకరణ చెందుతున్నా నేటి స్థితిలో ఆ విషయాన్ని పట్టుకున్న కవయిత్రి రాధాకృష్ణ నాకు "నేను కూడా పరాయినే"... "అప్పుడప్పుడు ఎప్పుడైనా" అని తనకు తానే ఉన్న స్థితిని చెబుతూనే లోకం అంతా ఇలానే ఏడ్చిందనే వేదన కూడా చెప్పారు. "ప్రపంచం ఉన్న స్థితిలోకి నువ్వు వెళ్తేనో... నువ్వున్న స్థితికి ప్రపంచం వస్తేనో తప్ప నీకు నువ్వు, ప్రపంచం నీకు బోధ పడదు" అంటాడు నీషే. ఈ రాధాకృష్ణ అనే కవయిత్రి కూడా తాను ప్రపంచం దగ్గరికి వెళ్లారు. ప్రపంచాన్ని తన దగ్గరికి తెచ్చుకున్నారు తన కవిత్వావరణలోకి. అందుకే ఇలాంటి కవిత్వం రాయడం సాధ్యమైంది. ఈ కవయిత్రి రాధాకృష్ణ పేరు కోసం వెంపర్లాడలేదు. తన పేరు పత్రికల్లోనో, ఇతర మాధ్యమాల్లోనో రావాలనే దురాశకు పోలేదు. తనది సొంత గొంతు. సొంత కల. సొంత కలం. సొంత ప్రపంచం. సొంత వ్యక్తిత్వం. అందుకే ఇలాంటి కవిత్వం రాశారు. భవిష్యత్‌లో ఇంకా మంచి కవిత్వం రాస్తారని నేను నమ్ముతున్నాను.

(రాధాకృష్ణ కర్రి తొలి కవిత్వ సంకలనం "లైఫ్ డ్రామా"కి రాసిన ముందుమాట. ఆదివారం ఉదయం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సంకలనం ఆవిష్కరణ)

సరిహద్దు రాష్ట్రాల్లో హై అలర్ట్

జమ్మూలో పర్యటించిన ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ రెండు దేశాల సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు జమ్మూ ప్రభుత్వం తరలిస్తున్నది. ప్రజలకు భోజనంతోపాటు షెల్టర్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఫుడ్, మెడికల్ క్యాంపుల సౌకర్యం కల్పించారు. మరోవైపు నగరంలో పరిస్థితుల స్థితిగతులు తెలుసుకునేందుకు సీఎం ఒమర్ అబ్దుల్లా జమ్మూలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం పరిశీలించారు. స్థానికులతో ఆయన చర్చించారు. వారికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా సీఎం ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. జమ్ముకశ్మీర్‌లోని విద్యా సంస్థలకు సోమవారం వరకు సెలవు ప్రకటించారు. స్థానిక పరిస్థితులపై సోమవారం చర్చించి... సెలవులు పొడిగించాలా లేదా అనే అంశంపై ఓ నిర్ణయానికి వస్తామని చెప్పారు. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకున్న నేపథ్యంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు పాఠశాలలకు సెలవులు ఇచ్చిన సంగతి తెలిసిందే.

చిన్నారులు చేసిన తప్పేంటి?

మెహబూబా ముఫ్తీ భావోద్వేగం

జమ్మూ: భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతోన్న తరుణంలో సరిహద్దులో పాక్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది. దీంతో సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. చిన్నపిల్లలు మృతి చెందడంపై జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉద్వేగానికి గురయ్యారు. 'కళ్లముందే ఆటలాడిన కవలలు అంతలోనే రక్తపుమడుగులో కనిపించారు. ఇలా ఎదురుకాల్పుల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు, మహిళలు చేసిన తప్పేంటి? ఇది ఎక్కడివరకు వెళ్తుంది. జమ్మూకశ్మీర్ ప్రజలు ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల వారు ఇంకా ఎంతకాలం బాధపడాలి? తల్లులకు ఎంతకాలం ఈ కడుపుకోత?' అని ఆమె ప్రశ్నించారు. మాట్లాడుతూ ఆమె కంటతడిపెట్టారు. ఆపరేషన్ సిందూర్‌తో దిక్కుతోచని పాకిస్థాన్... సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. కుప్వారా, బారాముల్లా, ఉరీ, పూంఛ్, మెంధార్, రాజౌరీ సెక్టార్లలో మోర్టార్లు, శక్తిమంతమైన శతఘ్నులతో కాల్పులకు తెగబడింది. దీంతో బుధ, గురువారాల్లో 16 మంది మరణించారు. ఇందులో ఐదుగురు చిన్నారులు, ముగ్గురు మహిళలున్నారు.

యుద్ధం పరిష్కారం కాదు: ముస్లిం లా బోర్డు

న్యూఢిల్లీ: ఏ సమస్యకు యుద్ధం పరిష్కారం కాదని, దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) పేర్కొంది. భారత్-పాక్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఉగ్రవాదం, పౌరుల హత్యలను ఆక్షేపించింది. ద్వైపాక్షిక చర్చలు, ఇతర దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని శుక్రవారం భారత్, పాకిస్థాన్‌కు సూచించింది. ఇస్లామిక్ బోధనలలో, మత గ్రంథాలలో, మానవ విలువలలో ఉగ్రవాదానికి స్థానం లేదని నొక్కిచెప్పింది. దేశం, ప్రజల రక్షణ కోసం తీసుకునే ప్రతి చర్యకు మద్దతిస్తున్నట్లు ముస్లిం లా బోర్డు ప్రకటించింది. క్లిష్ట సమయాల్లో ప్రజలు, రాజకీయ పార్టీలు, సాయుధ దళాలు, ప్రభుత్వం ఐక్యంగా ఉండాలని పేర్కొంది. భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలపై ఆఫీస్ బేరర్ల ప్రత్యేక సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించింది. తమ 'సేవ్ వక్ఫ్ క్యాంపెయిన్'ను యథావిధిగా కొనసాగిస్తామని పేర్కొంది. తాజా పరిణామాల దృష్ట్యా బహిరంగ సభలు, కార్యక్రమాలను 16వ తేదీ వరకు వాయిదా వేస్తున్నట్లు ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వెల్లడించింది.

భారత్‌పై పాక్ వ్యక్తి ప్రశంసలు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలను భారత్ నేలమట్టం చేయడంతో ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ తరుణంలో ఒక పాక్ వ్యక్తి ... భారత్ చేసింది న్యాయమే అంటూ పోస్ట్ చేసిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇలాంటి సమయంలో శత్రు దేశానికి చెందిన వ్యక్తే ఇలా మాట్లాడటం పలువురిని ఆశ్చర్యపరుస్తోంది. దుబాయ్‌కి చెందిన ఫారెక్స్ వ్యాపారి అభయ్ ... ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్‌పై చేసిన దాడి సరైందని, అది న్యాయం అని మాట్లాడారు.

భారత ప్రభుత్వం చర్యను, సాయుధ దళాల ప్రతిస్పందనను కొనియాడాడు. ఇప్పుడు పాక్ ... తామూ బాధితులమే అని డ్రామా ఆడుతోందని ఆరోపించాడు. పహల్గాం పర్యటనకు వచ్చిన 26 మంది అమాయకులను పొట్టనపెట్టుకున్నప్పుడు ఏమైంది ఇదంతా అని నిలదీశాడు. అకస్మాత్తుగా శాంతి, మానవహక్కులు అంటూ నీతి కబుర్లు చెప్పడమే గాక పాక్ కూడా ఉగ్రవాద బాధిత దేశమే అని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉంది అని మండిపడ్డాడు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా స్పందించే హక్కు భారత్‌కి పూర్తిగా ఉందన్నారు. అలాగే భారత్ చేసింది న్యాయమే అని ప్రశంసించాడు. అసలు ఉగ్రవాదాన్ని పెంచి పోషించినప్పుడు తెలియలేదా పాక్‌కి ఇది ఎప్పటికైనా నష్టమే అని అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ప్రజలు మరణించగానే శాంతి అనడం కాదు... భారత్ మొదటి నుంచి సంయమనం పాటిస్తూ శాంతికి పీటవేస్తూ వచ్చిందనేది గుర్తులేదా అని మండిపడ్డారు. భారత్ చేసింది యుద్ధ చర్య కాదు... కేవలం అది న్యాయం అని అభయ్ ఆ వీడియోలో నొక్కి చెప్పాడు. పైగా ఆ వీడియోకి 'ఒక పాకిస్థానీ హిందువుగా నా అభిప్రాయం' అనే క్యాప్షన్ కూడా ఇచ్చాడు. దీనిపై సోషల్ మీడియా ఫాలోవర్స్ పాక్ వ్యక్తిని ప్రశంసిస్తూ పోస్టులు పెట్టారు.

అన్నిచోట్ల పటిష్ఠ బందోబస్తు

- విమానాశ్రయాలకు భద్రత పెంపు
- ఆలయాలకు అదనపు రక్షణ
- ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు రద్దు
- తనిఖీలు ముమ్మరం... తీరంలో డేగకన్ను

దేశరాజధాని ఢిల్లీలో ఏర్పాటు చేసిన సైరన్‌లు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్, పాకిస్థాన్ దాడులతో ఉద్రిక్తతలు పెరిగాయి. దాడులు, ప్రతి దాడుల క్రమంలో భారత్‌లోని అన్ని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. చాలా చోట్ల హై అలర్ట్ విధించారు. భద్రతను కట్టుదిట్టం చేశారు. కీలక ప్రాంతాల్లో ఆంక్షలు అమలు చేశారు. దేశంలోని విమానాశ్రయాలు, నౌకాశయాలకు భద్రతను పెంచారు. షెడ్యూల్ సమయానికి కంటే కొన్ని గంటలు ముందుగానే ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలని ప్రయాణికులకు సూచనలు జారీచేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు రద్దు కాగా పంజాబ్, జమ్మూ కశ్మీర్, హర్యానా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో విద్యాసంస్థలను మూసివేశారు. మహారాష్ట్రలోనూ కీలక శాఖల ఉద్యోగుల సెలవులు రద్దు చేశారు. రాష్ట్రంలోని 36 జిల్లాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నట్లు అక్కడి ప్రభుత్వం పేర్కొంది. భారత్, పాకిస్థాన్ మధ్య సైనిక ఘర్షణ తీవ్రతరం అవుతున్న క్రమంలో అప్రమత్తమైన ఢిల్లీ నగర వాసులను అప్రమత్తం చేసేందుకుగాను మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తోంది. కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ భవనాలు సహా కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. ఎయిర్-రైడ్ సైరన్లు ఏర్పాటు చేసింది. శుక్రవారం మధ్యాహ్నం ఐటీవోలోని బహుళ అంతస్తుల పీడబ్ల్యూడీ భవనంలో ఎయిర్ రైడ్ సైరన్లు ఏర్పాటు చేసిన సివిల్ డిఫెన్స్ డైరెక్టరేట్ వాటిని పరీక్షించింది. 11 రెవెన్యూ జిల్లాల్లో 10 సైరన్లు ఏర్పాటు చేసినట్లు ఒక అధికారి చెప్పారు. నాలుగు నుంచి 16 కిమీల వరకు సైరన్ వినిపించేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

27 విమానాశ్రయాలు మూసివేత- కొన్ని చోట్ల ఆంక్షలతో ప్రయాణాలు

చండీగఢ్, శ్రీనగర్, అమృత్‌సర్, జోధ్‌పూర్, భుజ్, జమ్మూ వంటి 27 విమానాశ్రయాలను మూసివేసినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ వెల్లడించింది. విమానాశ్రయాల వద్ద భద్రత అధికారులు పెంచారు. ప్రయాణికుల నిర్దేశిత కాలానికి మూడు గంటలు ముందుగానే చేరుకోవాలని విమాయాన సంస్థలు ఇప్పటికే సూచనలు జారీ చేశాయి. తనిఖీలకు సమయం పడుతుందని, ఇందుకు సంసిద్ధం కావాలని సూచించింది. ఢిల్లీలో శుక్రవారం 138 విమానాలు రద్దు అయ్యాయి. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మొత్తం 66 డొమెస్టిక్ డిపార్చర్లు, 63 అరైవల్స్ సహా ఐదు అంతర్జాతీయ డిపార్చర్స్, నాలుగు అరైవల్స్ రద్దు అయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే ఢిల్లీ ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలు సాధారణంగానే జరిగినట్లు దేశంలోనే అతిపెద్ద ఆపరేటర్ డయల్ 'ఎక్స్'లో వెల్లడించింది. గగనతల పరిస్థితుల ఆధారంగా కొన్ని ప్రయాణ సమయాలు ప్రభావితం కావచ్చని పేర్కొంది. సెక్యూరిటీ చెక్‌పాయింట్ల వద్ద ఎక్కువ సమయం పట్టవచ్చని, ఎయిర్‌లైన్-భద్రతా సిబ్బందికి సహకరించాలని ప్రయాణికులను కోరింది. ఇదిలావుంటే, అన్ని విమానాల తనిఖీలను సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ బ్యూరో (బీసీఏఎస్) తప్పనిసరి చేసింది. టెర్మినల్ భవనాల వద్ద పర్యటకులను నిషేధించింది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది.

ముంబై ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్ ఎంఐఏఎల్ 'ఎక్స్'లో స్పందిస్తూ భద్రతను పెంచిన నేపథ్యంలో ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికులకు నిరీక్షణ తప్పబోదని, నిర్దేశిత సమయానికి చాలా ముందుగానే ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలని సూచనలు చేసింది. ఇదిలావుంటే, తాజా పరిస్థితుల దృష్ట్యా శ్రీనగర్, జమ్మూ, అమృత్‌సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాల, బికానీర్, జోధ్‌పూర్ కిషన్‌ఘర్, రాజ్‌కోట్ నుంచి అన్ని విమానాల రాకపోకలను శనివారం అర్ధరాత్రి వరకు రద్దు చేసినట్లు ఎక్స్ మాధ్యమంగా ఇండిగో ప్రకటించింది. పరిస్థితులు నిశితంగా గమనిస్తూ, అధికారులకు సహకరిస్తున్నట్లు వెల్లడించింది. గుజరాత్‌లోని విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేసిన విమానయాన సంస్థలు ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ అడ్వైజరీలో ప్రయాణికులు మూడు గంటల ముందుగానే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోవాలని ఉంది.

భద్రతా చర్యలు, చెక్-ఇన్, బోర్డింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలని కోరింది. అసాధారణ సమయంలో అన్ని విమానాశ్రయాలలో కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని విమానయాన సంస్థలు తమ వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాల ప్రకటించాయి.

సురక్షిత ప్రాంతాలకు తరలివెళుతున్న పూంచ్ సెక్టార్ ప్రజలు

పూరి ఆలయానికి భద్రత కట్టుదిట్టం

ఒడిశాలోని పూరి జగన్నాథ్ ఆలయం వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. ఎన్ఎస్‌జీ కమాండోలు పరిస్థితిని సమీక్షించారు. ఆలయం చుట్టు, పరిసర ప్రాంతాల్లో నిఘా పెంచాలని, అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు. స్పెషల్ ఫోర్స్‌ను రంగంలోకి దించారు. పెట్రోలింగ్ వ్యవస్థను పెంచారు. అలాగే, సాంబాల్‌పూర్ జిల్లాలోని పొడవైన హీరాకుడ్ డ్యామ్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. భువనేశ్వర్‌లోని బిజు పట్నాయక్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, జగత్‌సింగ్‌పూర్‌లోని పారాదీప్ పోర్ట్ వద్ద పటిష్ఠ బందోబస్తు చేశారు. బాలాసోర్‌లోని డీఆర్‌డీవో వద్ద అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించి రక్షణ శాఖకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఢిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మాల్స్, మార్కెట్లు, మెట్రో స్టేషన్లు, హోటళ్లు, రవాణా కేంద్రాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. మెట్రో స్టేషన్‌లకు భద్రత పెంచారు. బాంబ్ స్క్వాడ్‌ల తనిఖీలు ముమ్మరం చేశారు. ఆసుపత్రుల్లోనూ సముచిత ఏర్పాట్లు చేశారు. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్, బికానీర్, జోధ్‌పూర్, జైసల్మేర్, బార్మర్ వంటి సరిహద్దు జిల్లాల్లో పాఠశాలలు మూతపడ్డాయి.

జైసల్మేర్‌లో డ్రోన్ బాంబు గుర్తింపు

జైపూర్: రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో బాంబును పోలిన వస్తువును స్థానికులు గుర్తించారు. స్థానిక కిషన్‌ఘాట్‌లోని నర్సరీ సమీపంలో శుక్రవారం ఉదయం దీనిని గుర్తించిన స్థానికులు వెంటనే సర్పంచ్‌కు విషయం తెలిపారు. ఆయన పోలీసులు, ఆర్మీ అధికారులకు సమచారం ఇచ్చారు. ముందు జాగ్రత్త కోసం బాంబును గుర్తించిన ప్రాంతానికి దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్లకుండా దానిని సీల్ చేశారు. పోలీసులు, భారత వైమానిక దళ సిబ్బంది అక్కడకు వెళ్లి బాంబును పోలీన వస్తువును పరిశీలించారు. జైసల్మేర్ సహా కొన్ని ప్రాంతాలపై గురువారం రాత్రి పాకిస్థాన్ డ్రోన్‌లు, క్షిపణులను ప్రయోగించగా భారత దళాలు వాటిని కూల్చివేశాయి. జైసల్మేర్‌లో గుర్తించిన వస్తువును పాకిస్థాన్ డ్రోన్ బాంబు భాగంగా భావిస్తున్నారు. దీంతో బాంబు స్క్వాడ్‌ను రంగంలోకి దింపి, దానిని నిర్వీర్యం చేశారు. జైసల్మేర్‌లో బ్లాక్‌అవుట్ అమలులో ఉన్నది. భద్రతా ముమ్మరం చేశారు. భద్రతా సూచనలను పాటించాలని ప్రజలకు అధికారులు సూచించారు.

భటిండా, హోషియార్పూర్‌లో శకలాలు లభ్యం

పంజాబ్‌లోని భటిండా, హోషియార్పూర్ ప్రాంతాల్లోనూ గుర్తుతెలియని వస్తువులు, క్షిపణి శకలాలు లభ్యమయ్యాయి. హోషియార్పూర్‌లో క్షిపణి భాగంగా అనుమానించే వస్తువులు లభ్యమయ్యాయని ఎస్పీ ముకేశ్ కుమార్ తెలిపారు. వైమానిక దళానికి సమాచారం ఇవ్వగా ఐఏఎఫ్ బృందం ప్రాథమిక తనిఖీలు చేసిందన్నారు. భటిండాలోని తుంగ్‌వాలి గ్రామంలో గుర్తుతెలియని వస్తువును గుర్తించారు. శకలాలు పడ్డ చోట్ల మూడు అడుగుల లోతైన గుంట పడినట్లు గ్రామస్తులు చెప్పారు. శకలాలను తాకవద్దని, ఆ ప్రాంతానికి వెళ్లవద్దని స్థానికులను పోలీసులు హెచ్చరించారు. పఠాన్‌కోట్ జిల్లాలోనూ తూటాలు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. కాగా, గురువారం రాత్రి భారీ పేలుడు శబ్దాలు విన్నామని, ఆకాశంలో మెరుపులు కనిపించాయని, భయాందోళనకు గురయ్యామని స్థానికులు తెలిపారు.

మేము జోక్యం చేసుకోం

సింధు జలాల ఒప్పందంపై ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు ప్రపంచబ్యాంకు షాకిచ్చింది. సింధు జలాల ఒప్పందంపై తాము జోక్యం చేసుకోబోమని స్పష్టంచేసింది. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమంటున్నాయి. పాక్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం... సింధుజలాల ఒప్పందం అమలును నిలిపివేసింది. దీనిపై తాజాగా ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా స్పందించారు. 'ఈ ఒప్పందం విషయంలో ప్రపంచబ్యాంక్ జోక్యం చేసుకొని సమస్యను ఎలా పరిష్కరిస్తుందనే దానిపై చాలా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అవన్నీ అర్థం లేనివి. ఈ బ్యాంక్ పాత్ర ఒక సహాయకుడిగా మాత్రమే ఉంటుంది' అని బంగా స్పష్టం చేశారు. బంగా ఇప్పుడు భారత్‌లో పర్యటిస్తున్నారు. గురువారం ఆయన ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కలిశారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల సమయంలో ఆయన భారత్‌లో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవి చేపట్టిన తొలి భారతీయ అమెరికన్‌గా, సిక్కు అమెరికన్‌గా బంగా చరిత్ర సృష్టించారు. ఇదిలా ఉంటే... సింధు, దాని ఉపనదుల జలాలు పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్ మధ్య ఒప్పందం కుదిరింది. దీనిపై 1960 సెప్టెంబరులో నాటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం సింధు ఉపనదుల్లో తూర్పున పారే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారతదేశానికి హక్కులు లభించాయి. వీటి సగటు వార్షిక ప్రవాహం 33 మిలియన్ ఎకరాల అడుగులు (ఎంఏఎఫ్)గా ఉంది. సింధు నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌పై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి. సింధు నదీ జలాల పంపిణీ ఒప్పంద నియమ నిబంధనలపై పునఃసమీక్ష జరపాల్సి ఉందని భారత్ కొంతకాలంగా డిమాండ్ చేస్తోంది. 1960లో ఒప్పందం కుదిరిన నాటికి, ఇప్పటికీ రెండు దేశాల జనాభాలో, తాగు, సాగు నీటి అవసరాలలో చాలా మార్పులు వచ్చాయనీ, పర్యావరణ, భౌగోళిక, రాజకీయపరంగా మార్పులు చోటుచేసుకున్నాయని గుర్తుచేసింది. వాటిని పరిగణనలోకి తీసుకొని ఒప్పందాన్ని సమీక్షించాల్సి ఉందని భారత్ స్పష్టంచేసింది. అయితే, దీనిపై పాక్ మాత్రం వ్యతిరేకత వ్యక్తంచేస్తోంది. ఈ పరిణామాల వేళ తాజాగా పహల్గాం దాడితో ఈ ఒప్పందం అమలును భారత్ నిలిపివేస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది.

బంకర్ల పాలిట మృత్యువు

ఏటీజీఎం

న్యూఢిల్లీ: పాక్ సైనికులు దాక్కోవడానికి వీలుగా సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసుకున్న ప్రత్యేకంగా బంకర్లను భారత సైన్యం ధ్వంసం చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేక ఆయుధాన్ని వాడుతోంది. దానిపేరే ఏటీజీఎం (యాంటీట్యాంక్ గైడెడ్ మిసైల్). భారీగా సాయుధ కవచాలతో డిజైన్ చేసిన వాహనాలను ధ్వంసం చేయడానికి దీనిని వాడతారు. ఒక్కసారి దీనిలో ట్యాంక్ లేదా టార్గెట్‌ను లాక్ చేస్తే... తనకుతాను లక్ష్యాన్ని వెంటాడి ఛేదిస్తుంది. దీనిని భుజం పైనుంచి లేదా ట్రైపోడ్, వాహనాలపై అమర్చి ప్రయోగించవచ్చు. సురక్షితమైన దూరం నుంచి సాయుధ బలగాలను ఎదుర్కోవడానికి ఇది సరైన ఆయుధం. ఏటీజీఎంల్లో షేపుడ్ ఛార్జి అనే దానిని వినియోగిస్తారు. ఈ పేలుడు పదార్థాల్లోని శక్తి మొత్తం ఒకే దిశలో కేంద్రీకృతమై ప్రయాణిస్తుంది. దీంతో మందపాటి సాయుధ కవచాన్ని కూడా ఛేదించేంత శక్తి ఇది విడుదల చేస్తుంది. కొన్ని అత్యాధునిక ఏటీజీఎంల్లో రెండుసార్లు పేలుళ్లు జరిగేలా ప్రత్యేక వార్‌హెడ్లు వినియోగిస్తారు. తొలి పేలుడుకు ట్యాంక్‌కు బయట ఉన్న కవచం ధ్వంసం అవుతుంది. ఈ కవచాన్ని ఎక్స్‌ప్లోజివ్ రియాక్టివ్ ఆర్మర్ అంటారు.

ప్రత్యర్థులు ప్రయోగించే క్షిపణుల వార్ హెడ్ దీనికి తగిలి మొదటే పేలిపోవాలన్న లక్ష్యంతో తయారుచేస్తారు. ఇలాంటివాటిని తట్టుకొని ట్యాంక్‌ను నాశనం చేయడానికి రెండో పేలుడు జరిగేలా తయారుచేస్తారు. తొలి పేలుడుకు సాయుధ కవచం, రెండో దానికి ట్యాంక్ ధ్వంసం చేయటమే వీటి లక్ష్యం. వీటిల్లో కొన్నింటికి టాప్ అటాక్ మోడ్ ఉంటుంది. వీటిని ప్రయోగించాక గాల్లోకి ఎత్తుకు ఎగిరి... ట్యాంక్ టాప్‌పై పడుతుంది. దీనిలో డ్యూయల్ మోడ్ సీకర్ అనే ఆప్షన్ ఉంది. ఇది లక్ష్యాన్ని గుర్తించి... దానిని అనుసరించేలా చేస్తుంది.

ఏటీజీఎంను ఆపడం సాధ్యం కాదు. కొన్ని ట్యాంకులు రీయాక్టివ్ ఆర్మర్ అనే కవచాన్ని వాడతాయి. వీటిపై కొన్నిరకాల ప్రత్యేకమైన ప్లేట్లు ఉంటాయి. ఏటీజీఎం తాకగానే బయటవైపునకు పేలుడు జరుపుతాయి. మరికొన్ని దేశాలు లోహపు పంజరం వంటి వాటిని ట్యాంకులపై అమరుస్తున్నాయి. ఏటీజీఎం వీటిని తాకి ముందే పేలిపోతాయి.

ఇక క్షిపణుల సిగ్నల్స్‌ను జామ్ చేసే వ్యవస్థలు వాడటం లేదా డికాయ్‌లను ప్రయోగించి క్షిపణిని గందరగోళానికి గురిచేయడం చేయవచ్చు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 130కి పైగా దేశాలు ఏటీజీఎంలను వినియోగిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ కూడా వీటిని వినియోగిస్తోంది. ప్రస్తుతం భారత్ వద్ద నాగ్, ధ్రువాస్త్ర (హెలినా) వంటివి ఉన్నాయి.

బ్రిటన్ మంత్రితో జైశంకర్ చర్చలు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ జోరుగా జరుగుతున్న వేళ కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ ల్యామితో చర్చలు జరిపారు. పాక్‌తో ఘర్షణలు, పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి, పాకిస్థాన్-పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో భారత సైన్యం ఉగ్రశిబిరాలు ధ్వంసం చేయడం...ప్రతీకారంగా...ఉద్రిక్తతలు పెంచేలా భారత్‌పై పాక్ సైనికదాడులకు దిగడం వంటి అంశాలను బ్రిటన్ మంత్రికి వివరించారు. ఉగ్రవాదాన్ని వదులుకోవడానికి పాక్ ఏమాత్రం ముందుకు రావడం లేదని ఫిర్యాదు చేశారు. భారత్ తరపున ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరమేశ్వరన్ అయ్యర్ హాజరయ్యారు. ఉగ్రవాదాన్ని పాక్ పెంచి పోషిస్తున్న నేపథ్యంలో దానికి నిధులు ఇవ్వడంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాకుండా పాక్ టెర్రరిజాన్ని వదులు కోవడానికి అంత సానుకూలంగా లేదని భారత్ చెబుతోంది. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి, దానికి ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' తదితర విషయాలు బ్రిటన్ పార్లమెంటులో బుధవారం చర్చకు వచ్చాయి. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను ఉపసంహరింపజేయాలని ఎంపీలు తమ ప్రభుత్వానికి సూచించారు. సమస్యలను సంప్రదింపులు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ చేసిన విజ్ఞప్తిని ప్రస్తావిస్తూ హమిష్ ఫాక్నర్ పార్లమెంటులో చర్చ ప్రారంభించారు. రెండు దేశాలూ సంయమం పాటించాలని కోరారు. భారత్, పాక్‌లతో బ్రిటన్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనీ, తాము పహల్గాం ఉగ్రదాడిని నిర్ద్వంద్వంగా ఖండించామని ఫాక్నర్ గుర్తు చేశారు. మరోవైపు దౌత్యపరంగా పాక్‌ను ఎదుర్కోవడానికి భారత్ అన్ని యత్నాలు చేస్తోంది. ఇప్పటికే ఆపరేషన్ సిందూర్‌పై అమెరికా సహా మిత్రదేశాలకు తాజా పరిస్థితిని వివరించింది. నిన్న రాత్రి కూడా కేంద్రమంత్రి జైశంకర్‌తో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఫోన్‌లో చర్చించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదాన్ని సహించబోమని ఆయన పేర్కొన్నారు.

సైన్యం ఆపరేషన్ల కవరేజీలో అప్రమత్తం

మీడియా సంస్థలకు రక్షణశాఖ సూచన

న్యూఢిల్లీ: దేశ భద్రతకు సంబంధించిన ఆపరేషన్ వార్తలు, దళాల కదలికల కవరేజీల విషయంలో మీడియా కొంత సంయమం పాటించాలని రక్షణశాఖ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించింది. 'భద్రతా దళాల ఆపరేషన్ల ఫలితాలను ప్రభావితం చేసే సమాచారాన్ని వెల్లడిస్తే... వారి ప్రాణాలకు ముప్పు రావచ్చు. గతంలో కూడా కార్గిల్ యుద్ధం, 26/11 దాడులు, కాందహార్ హైజాక్ ఘటనలు అత్యుత్సాహపు రిపోర్టింగ్‌కు నిదర్శనగా నిలిచాయి. కేబుల్ టెలివిజన్ చట్టం ప్రకారం ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ల సమయంలో కేవలం అర్హత ఉన్న అధికారి సమయానుసారం బ్రీఫింగ్స్ ఇచ్చేందుకు అర్హులు. అందరూ అప్రమత్తంగా వ్యవహరించి... సున్నితంగా, బాధ్యతాయుతంగా కవర్ చేయాలి' అని పేర్కొంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కూడా ఆపరేషన్ సిందూర్ వేళ తప్పుడు వార్తలు ప్రచారంలోకి రాకుండా చర్యలు తీసుకుంటోంది. పీఐబీ ఫ్యాక్ట్ చెక్‌లు నిర్వహిస్తోంది. ఇంతకుముందు గుజరాత్‌లోని పోర్టు సహా జలంధర్‌లో డ్రోన్, క్షిపణి దాడుల దృశ్యాలంటూ సోషల్ మీడియాలో పాక్ అనుకూల వ్యక్తులు వీడియోలు షేర్ చేసిన సంగతి తెలిసిందే. వీటిని భారత్ తిప్పికొట్టింది. పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ చేసి.. అవన్నీ అవాస్తవేమనని తేల్చింది.

విశాలాంధ్ర హైదరాబాద్

తెలంగాణ సివిసిగా చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా డా.జి.చంద్రశేఖర్ రెడ్డి (రిటైర్డ్ ఐఎఫ్ఎస్) శుక్రవారం మధ్యాహ్నం 12.05 గంటలకు పదవి బాధ్యతలు స్వీకరించారు. రాజ్ భవన్ దర్బార్ హాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జి.చంద్రశేఖర్ రెడ్డిచే రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణ రావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, రాష్ట్ర రైతు కమీషన్ చైర్మన్ కోదండ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, డీజీపీ జితేందర్, రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుమిదిని, విజిలెన్స్ కమీషనర్ ఎం.జీ.గోపాల్, సీ.ఎం.ఓ. అధికారులు శేషాద్రి, శ్రీనివాస రాజు, మాణిక్ రాజ్, శ్రీనివాసులు, రాజ్ భవన్ కార్యదర్శి దాన కిషోర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మహేష్ దత్ ఎక్కా, సీనియర్ ఐఏఎస్ అధికారులు రఘునందన్ రావు, బుద్ధ ప్రకాష్, వినయ్‌కృష్ణారెడ్డి, మహేష్ భగవత్ తదితరులు హాజరయ్యారు. డా. చంద్రశేఖర్‌రెడ్డి ఈ పదవిలో మూడు సంవత్సరాలు లేదా 65ఏళ్ల వరకు ఉంటారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు చర్యలు తీసుకోవాలని, అలాగే మంచి నీరు సరఫరా మెరుగు పరచాలని కోరుతూ ఖైరతాబాద్‌లోని వాటర్ వర్క్స్ ఎం.డి అశోక్‌రెడ్డిని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సేవా దృక్పథంతో పని చేయాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.సి.ఉమ గౌరి, జిల్లా కోఆర్డినేటర్ హెల్త్ సర్వీసెస్ డా. సునితతో కలిసి మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య సేవల మెరుగుదల, తక్కువ సమయంలో అత్యవసర చికిత్స అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, సిబ్బందికి నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమాల గురించి చర్చించారు. అలాగే గర్భిణీ స్త్రీలకు మెరుగైన సేవలు, పిల్లల టీకా కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో వైద్య సిబ్బంది సమస్యలు, వీలైన పరిష్కార మార్గాలు కూడా చర్చించారు. డా.సి.ఉమ గౌరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో పని చేయాలని, జిల్లా ఆరోగ్య వ్యవస్థను మరింత శక్తివంతం చేయడానికి ప్రతీ వైద్య సిబ్బంది తమ పాత్రను నిబద్ధతతో నెరవేర్చాలని సూచించారు.

వరద ముంపు సమస్య నుండి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : డివిజన్ అభివృద్ధిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు పోతున్నామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. నల్లగండ్ల చెరువు నుండి బిహెచ్ఇఎల్ చౌరస్తా ఇండియన్ గ్యాస్ గోడౌన్ నాలా వరకు ఎస్ఎన్‌డీపీ అండర్ హెచ్‌సిఐటీఐలో భాగంగా రూ.28 కోట్లు 45 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపడుతున్న ఓపెన్ డ్రైన్ ఆర్‌సీసీ బెడ్, సైడ్ వాల్స్ నిర్మాణం పనులను సంబంధిత జిహెచ్ఎంసీ అధికారులతో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాలాల విస్తరణ పనులతో లోతట్టు ముంపు ప్రాంతాలకు శాశ్వత ఉపశమనం అని పేర్కొన్నారు. ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ పనులు నాణ్యతతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా స్థానికవాసులకు ఇబ్బంది కలగకుండా రాబోయే వర్షాకాలం లోపు పరిసర ప్రాంతవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకట్ రమణ, డిప్యూటీ సిటీ ప్లానర్ తులసిరామ్, ఎస్ఎన్డిపి జిహెచ్ఎంసీ డిఈ దీరజ్, ఎఈ యుగేందర్, టీపిఎస్ జీషన్ కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, సుభాష్, సాయి, రమేష్, శశి, పాములేటి యాదవ్, వంశీ, హరీష్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఒక్కొక్కటిగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.విరాహత్ అలీ, కే.రాంనారాయణల నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం మంత్రి శ్రీనివాస్ రెడ్డితో సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో సమావేశమై జర్నలిస్టుల వివిధ సమస్యలపై చర్చించింది. ఎన్నికల సమయంలో, కాంగ్రెస్ మేనిఫెస్టోలో జర్నలిస్టుల సంక్షేమాన్ని పొందుపర్చడంతో జర్నలిస్టులు ఎంతో హర్షించారని, అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా ఇంకా ఏ ఒక్క సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో జర్నలిస్టుల్లో నిరాశ చోటుచేసుకుందని విరాహత్, రాంనారాయణలు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రెడిటేషన్ల నియమావళి రూపకల్పనా కోసం ప్రభుత్వం కమిటీ వేసిందని, ఆ కమిటీ నివేదిక సమర్పించి నెల రోజులు గడుస్తున్నా ఇంకా జీవో జారీ కాలేదన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన అక్రెడిటేషన్లను ఏడాదిన్నర కాలంగా జర్నలిస్టులు రెన్యూవల్ చేసుకుంటున్న పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే కొత్త అక్రెడిటేషన్లు జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు వ్యతిరేకంగా ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కేవలం అర్బన్ ప్రాంతాల్లో సొసైటీల వరకే వర్తిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు కాదని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వర్తించేందుకు గాను వారికి రక్షణ కల్పించేందుకు, సామాజిక సేవలో నిమగ్నమైన జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు అనేక జీవోలు జారీ చేసి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాయని, గత పదేళ్లుగా వాటిని నిర్వీర్యం చేసారని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులపై దాడుల నిరోధక హైపవర్ కమిటీ, వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ ఫండ్ కమిటీ, వేజ్ బోర్డు సిఫారసులను పర్యవేక్షించే త్రైపాక్షిక కమిటీని ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. చిన్న, మధ్యతరగతి పత్రికల బిల్లులు పెండింగులో ఉండడం, అప్‌గ్రేడేషన్ ప్రక్రియ జరగకపోవడంతో వాటి నిర్వాహకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునగనూరు గ్రామ శివారులో ఎల్.బి.నగర్ జర్నలిస్టులకు ఏడాదిన్నర క్రితం ఇంటి స్థలాలు కేటాయించగా వారు ఇండ్లను సైతం నిర్మించుకున్నారని, అయితే ఆ స్థలాలను ఖాళీ చేయాలని గత కొన్ని రోజుల నుండి రెవెన్యూ అధికారులు లబ్దిదారులను మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని, వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వారు మంత్రిని కోరారు. టీయూడబ్ల్యూజే విన్నవించిన ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి, త్వరలోనే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు కే.శ్రీకాంత్ రెడ్డి, జి.మధు గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రాజేష్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, రాష్ట్ర నాయకులు మాతంగి దాస్, హెచ్.యూ.జే అధ్యక్షులు శిగా శంకర్ గౌడ్‌లు పాల్గొన్నారు.

ఫ్యాసిజంపై రష్యా సాధించిన విజయ స్ఫూర్తితో

భారత స్వాతంత్ర్య పోరాటం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఫ్యాసిజంపై రష్యా సాధించిన విజయ స్ఫూర్తితో భారత స్వాతంత్ర్య పోరాటం మరింత ముందుకు పోవడంతో స్వాతంత్ర్యం వచ్చిందని, ఆ స్ఫూర్తితో అనేక విముక్తి పోరాటాలు విజయవంతమైయ్యాని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి, భారత సాంస్కృతిక స్నేహ సంఘం (ఇస్కఫ్) అధ్యక్ష వర్గ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. భారత సాంస్కృతిక స్నేహ సంఘం తెలంగాణ రాష్ట్ర సమితి హైదరాబాద్, హిమాయత్ నగర్, అమృత ఎస్టేట్స్, ఇస్కఫ్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఫ్యాసిజంపై విజయం సాధించిన 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సదస్సును నిర్వహించింది. ఈ సదస్సుకు అజీజ్ పాషాతో పాటు ఇండియన్ అసోసియేషన్ అఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, ఇస్కఫ్ రాష్ట్ర ఉపాధ్యాక్షులు కడారి ప్రభాకర్, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, ఇస్కఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.గోపాల్, అరుణ్ కుమార్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షులు మునీర్ పటేల్, తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షులు ఆర్.శంకర్ నాయక్ హాజరయ్యారు. సదస్సుకు ఆర్.గోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యా ఫ్యాసిజంపై విజయం సాధించిందన్నారు. సుమారు 4 కోట్ల మంది రష్యా సైనికులు ప్రాణ త్యాగం చేశారన్నారు. హిట్లర్, జర్మన్‌ను రష్యా ఓడించి, ప్రపంచ విముక్తి పోరాటాలకు భాసటగా నిలిచిందన్నారు. ఇటీవల రష్యాలో జరిగిన 80వ విజయోత్సవ కార్యక్రమానికి తాను వెళ్లినట్లు చెప్పారు. తమ దేశంలో భిన్నమైన మతాలు, అభిప్రాయాలు ఉన్నప్పటికీ రష్యాన్లు ఇంటికొకరు చొప్పున సైన్యంలో చేరి, జర్మన్‌పై విజయం సాధించి, తమ దేశాన్ని కాపాడుకున్నారని తెలిపారు. ఫ్యాసిజంపై రష్యా కమ్యూనిజం సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో నయా ఫాసిజంపై పోరాటాలు నిర్మించాలని ఆయన కోరారు. ఫహల్గామ్‌లో అమాయక ప్రజల ప్రాణాలు తీసిన పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకుంటుందని అన్నారు. హిజ్బుల్ ముజాహిద్దీన్, లాష్కరే తోయిబా తదితర ఉగ్రవాద ముష్కరమూకలకు పాకిస్థాన్ శిక్షణ ఇచ్చి భారత్‌లోకి ఎగదొలుతుందని మండిపడ్డారు. పల్గాహంలో అమాయక భారత ప్రజలపై విచాక్షణ రహితంగా టెర్రరిస్టులు దాడులకు పాల్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన మానవత్వాన్ని మంటగలిపిందన్నారు. హిందు, ముస్లీం గొడవలు సృష్టించేందుకు పాకిస్థాన్ టెర్రరిస్టు మూకలు ప్రయత్నించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌పై వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి రెడ్ సెల్యూట్ చేస్తున్నామన్నారు.

ప్రపంచ దేశాలన్ని భారత్ మద్దతు ఇస్తున్నాయని అజీజ్ పాషా తెలిపారు. అంతకుముందు భారత సైన్యానికి సంఘీభావంగా హిమాయత్ నగర్ నుంచి హైదర్‌గూడా వరకు ఇస్కఫ్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. పాకిస్థాన్ ముర్ధాబాద్, హిందూస్థాన్ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కఫ్ సభ్యులు విజయలక్ష్మి, కె.శ్రీనివాస్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళంగా ఒకరోజు వేతనం

రాష్ట్ర సివిల్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రకటన

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇవ్వనున్నట్లు తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం నాడు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శి ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ భద్రతకు అంకితమైన మన సైనిక బలగాలు పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సాహసోపేతంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహిస్తున్న సందర్భంలో వారి సేవా నిరతికి ఉడతా భక్తిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం, మార్గదర్శనంలో, తమ ఒకరోజు వేతనాన్ని నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళంగా ఇవ్వనున్నట్లు వెల్లడిరచారు. దేశభక్తిని ప్రేరణగా చేసుకుని, సైనికుల పట్ల గౌరవ భావంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కె. చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ఏ.భాస్కరరావు ఒక ప్రకటనలో వెల్లడిరచారు. ప్రభుత్వానికి ఈ మేరకు అధికారికంగా లేఖను అందించనున్నట్లు వారు తెలిపారు.

సందీప్‌కు నివాళులర్పించిన మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - మేడిపల్లి: మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని ఘట్కేసర్ చెందిన ముద్దు బిడ్డ సి.ఆర్.పి.ఎఫ్. ఏ.ఆర్. జవాన్ తిక్క సందీప్ తండ్రి తిక్క అశోక్ ఛత్తీస్ ఘడ్ లో నక్సలైట్లు పేల్చిన ల్యాండ్ మైన్ కాల్పుల్లో వీర మరణం పొందినారు. శుక్రవారం ఉదయం తెలంగాణ ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టిపిసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, పిర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి సిఆర్‌పిఎఫ్ జవాన్ సందీప్‌కి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ సందీప్ సేవలను కొనియాడారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాన్ని వారు స్మరించుకున్నారు. జవాన్ సందీప్ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ పనులు ఎమ్మెల్యే పరిశీలన

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హెల్త్ సబ్ సెంటర్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ సుందర్, బాలరాజు గౌడ్, అంబటి రాజు, శివలింగం, అందే మోహన్, శ్రీనివాస్, ఖదీర్, శ్రీశైలం, వెంకటేష్ గుప్తా, పులిమామిడి రాజేష్ గౌడ్, రాము ముదిరాజ్, అజయ్, రాహుల్, సాయి కిరణ్ లడ్డు, తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజల అవసరాలు తీర్చేందుకు

మై జిహెచ్ఎంసి యాప్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగర ప్రజల అవసరాలు తీర్చేందుకు మై జిహెచ్ఎంసి యాప్. సమస్యల పరిష్కారంతో పాటు అవసరమైన సేవలు పొందేందుకు మై జిహెచ్ఎంసి ఉపయోగించుకోవచ్చు. ఈ యాప్ ద్వారా శానిటేషన్, ఇంజనీరింగ్, హెల్త్, స్ట్రీట్ లైట్, రోడ్స్, డ్రెయిన్ క్లీనింగ్, రోడ్ స్వీపింగ్ సమస్యలపై ఫోటో గ్రాఫ్‌తో పాటుగా జియో లోకేషన్ ద్వారా ఫిర్యాదు చేస్తే డైరెక్ట్‌గా పరిష్కారం కోసం సంబంధిత అధికారికి చేరుకుంటుంది. తమ సమస్య పరిష్కారం అయ్యిందో లేదో తెలుసుకోవడానికి చెక్ చేసుకునే వెసులుబాటుతో పాటుగా ఫీడ్ బ్యాక్ సబ్మిట్ చేసుకోవచ్చు. గ్రేటర్ ప్రజలు సర్వీసెస్ కూడా పొందవచ్చు. ట్రేడ్ లైసెన్స్, ప్రాపర్టీ టాక్స్, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగింపు కోసం వెహికిల్ బుకింగ్ సింగిల్ క్లిక్ ద్వారా చేసుకోవచ్చు. క్రెడిట్, డెబిట్ కార్డు, యుపిఐ ద్వారా పేమెంట్ చేసుకునే అవకాశం ఈ యాప్ ద్వారా చేసుకోవచ్చు. వీటితో పాటుగా జిహెచ్ఎంసి కార్యాలయాల లోకేషన్, వెదర్ అలెర్ట్, ఇంకా చాలా అవసరమైన సేవలు పొందవచ్చు. గ్రేటర్ ప్రజల సౌకర్యం కోసం ఈ యాప్ మరింత ఈజీగా ఉపయోగం చేసుకొనే విధంగా ఉన్నందున ప్రజలు వినియోగించుకొని సేవలతో పాటు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారం పొందవచ్చునని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ కోరారు. మై జిహెచ్ఎంసి యాప్‌ను ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఈ రోజు మీ మొబైల్‌లోని ప్లే స్టోర్ ద్వారా డౌన్ లోడ్ చేసుకొని సమస్యలు, సేవలు పొందవచ్చునని కమిషనర్ పేర్కొన్నారు. ఉపయోగించుకునే విధానం ఫోటో క్లిక్ ద్వారా మీ సమస్యను పంపవచ్చును. మీ సమస్య పరిష్కారం స్టేటస్‌ను ట్రాక్ చేసుకొని ఏదైనా, ఎక్కడైనా స్టేటస్‌ను చెక్ చూసుకోవచ్చు. సమస్య పరిష్కారం అయిన వెంటనే ఫీడ్ బ్యాక్ ఇవ్వవచ్చును. లోకేట్ వార్డు ఆఫీస్ ఆప్షన్ లోకి వెళ్తే జిహెచ్ఎంసి ఆఫీస్‌ల లోకేషన్ తెలుసుకోవచ్చు. ట్రేడ్ లైసెన్స్, పెట్ డాగ్ లైసెన్స్ కోసం అప్లై చేసుకునే ప్యూ క్లిక్‌తో వెసులుబాటు ఉంటుంది. సిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు.

కొన్ని జోన్‌లలో పత్తాలేని సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ల ద్వారా క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించి క్రీడాకారులను తీర్చిదిద్దాలని జిహెచ్ఎంసి అధికారులు భావిస్తున్నప్పటికి ఆచరణకు నోచుకోని పరిస్థితి నెలకొంటుంది. ఎల్‌బినగర్ జోన్‌లో ఉప్పల్, కాప్రా సర్కిళ్లల్లో, కూకట్‌పల్లి అల్వాల్ సర్కిల్‌తో ఇతర సర్కిళ్లల్లో సమ్మర్ కోచింగ్ క్యాంపులను ప్రారంభించకపోవడంలో ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రతి సంవత్సరం 6 నుండి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహించే అధికారులు ఈ ఏడాది కొన్ని ప్రాంతాలకే పరిమితం చేయడం చూస్తే స్పోర్ట్స్ విభాగం సంబంధించిన అధికారులు దృష్టి సారించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వేసవి కాలం మొదలై 15 రోజులు పూర్తి అయినా సమ్మర్ కోచింగ్ క్యాంపుల నిర్వహణలో జాప్యం జరగడం గమనార్హం. కూకట్‌పల్లి జోన్ గేమ్స్ ఇన్స్‌పెక్టర్‌ను దీనిపై వివరణ కోరగా తాను రెండు జోన్‌లు చూస్తానని అల్వాల్ సర్కిల్ కోచ్ నెంబర్ ఇస్తానంటూ అక్కడ నిర్వహించే క్రీడలపైనే అవగాహన లేనట్లు మాట్లాడం చూస్తే సర్కిళ్లలో జరుగుతున్న క్యాంపులపై పర్యావేక్షణ ఏ విధంగా ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది సమ్మర్ కోచింగ్ క్యాంపులు నామమాత్రంగా మారయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ క్రీడల పట్ల జిహెచ్ఎంసి పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నప్పటికీ ఈ ఖర్చు బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోందని పలువురు పేర్కొంటున్నారు. క్రీడల విభాగానికి సంబంధించిన కొంతమంది అధికారులు స్పోర్ట్స్ మెటీరియల్ సరఫరా చేసే కాంట్రాక్టర్లతో కుమ్మకై మెటీరియల్ తీసుసున్నట్లు తీసుకుని తిరిగి వారికే ఇచ్చి బిల్లులను కాజేస్తున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాక క్యాంపుల్లో నిర్వహించని క్రీడలకు కూడ కోచ్‌ల పేరుతో బిల్లు కాజేసే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా గ్రేటర్‌లో జరుగుతున్న సమ్మర్ క్రీడల పట్ల ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వీటిలో జరిగే అవకతవకలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

బోరు వేయించి నీటి కొరత తీర్చిన కార్పొరేటర్

విశాలాంధ్ర - కాప్రా : భారీ హనుమాన్ విగ్రహ నిర్మాణం కొరకు, దహన సంస్కారాల నీటి కోసం కుషాయిగూడ గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సహకారంతో కుషాయిగూడ బస్ స్టాండ్‌లో పూజలు నిర్వహించిన అనంతరం బోర్ పని ప్రారంభించడం జరిగింది. దీంతో కుషాయిగూడ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్‌ని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

10న కన్నుల పండువగా మిస్ వరల్డ్ ప్రారంభ ఉత్సవాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సంస్కృతి, సౌందర్యం రెండింటి మేళవింపుగా నిర్వహించనున్న మిస్ వరల్డ్-2025 ఉత్సవాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అధికారులు ఈ పోటీల్లో తెలంగాణ సంస్కృతి, కళలు, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా చక్కని కార్యక్రమాలను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణాకు చెందిన వివిధ రకాల జానపద, గిరిజన, శాస్త్రీయ కళలు, హైదరాబాది దక్కని కళారూపాలను ఈ ఉత్సవాలలో సమ్మిళితం చేసి ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ ఖ్యాతిని, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ప్రపంచ దేశాల నుంచి హైదరాబాద్ నగరానికి విచ్చేసే సుందరీమణుల ఆహ్వానం కోసం రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో ఈనెల 3వ తారీఖు నుంచి 9వ తారీఖు వరకు కూచిపూడి, భరతనాట్యం, పేరిణి, కథక్, డప్పులు, బాజాభజంత్రీలు, మంగళ వాయిద్యాలతో కూడిన బృందాలతో స్వాగతం పలికేలా ఏర్పాటు చేయడం జరిగింది. 24 గంటల పాటు అందుబాటులో ఉండి ఈ కళాకారులు ఎయిర్పోర్టులో ప్రపంచ సుందరి పోటీలకు విచ్చేస్తున్న సుందరీమణులకు స్వాగతం పలకడం జరిగింది. వారందరూ తెలంగాణ నేల మీద, హైదరాబాదులో కాలిడగానే కుంకుమ తిలకం దిద్ది, హారతులతో వారికి స్వాగతం పలకడం జరిగింది. శనివరం నుండి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరుగుతున్న ప్రపంచ సుందరి ప్రారంభోత్సవ వేడుకలలో తెలంగాణ సంస్కృతి, కళలు ఆకట్టుకునేలా రూపొందించడం జరిగింది. వాటిలో మొదట తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపనతో ప్రారంభం అవుతాయి. లోకకవి డాక్టర్ అందెశ్రీ రచించిన ఈ గీతానికి, ఆస్కార్ పురస్కార గ్రహీత ఎం.ఎం.కీరవాణి సంగీతాన్ని సమకూర్చగా, ఈ పాటని ఈ ప్రపంచ సుందరి వేడుకలలో ప్రముఖ గాయకుడు, శిక్షకుడు కొమాండూరి రామాచారి శిష్య బృందం 50 మంది బృంద గీతంగా ఆలపిస్తారు. ఆ తర్వాత కాకతీయుల కాలం నుండి తెలంగాణ శాస్త్రీయ నృత్య రీతిగా ఖ్యాతి గడించిన పేరిణి నాట్య ప్రదర్శన అత్యంత వైభవంగా జరగనుంది. 250 మంది మహిళా కళాకారిణులు పేరిణి లాస్య సంప్రదాయాన్ని అనుసరించి ఈ నృత్యాన్ని ప్రదర్శించబోతున్నారు. దీనికి పేరిణి సందీప్ నృత్య దర్శకత్వం వహించగా, ప్రముఖ సంగీత నిపుణుడు ఫణి నారాయణ స్వరాలు సమకూర్చడం జరిగింది. దాదాపు పది నిమిషాల పాటు జరిగే ఈ పేరిణి నాట్యంలో సౌందర్యం, సంస్కృతి, స్త్రీల సాధికారత అంశాలు ప్రధానంగా ఉదహరించడం జరిగింది. దాంతోపాటు కళాకారులు అందరూ కలిసి నక్షత్రం ఆకారంలో, సీతాకోకచిలుక ఆకారాన్ని, అలాగే మిస్ వరల్డ్ లోగో ఆకృతిని కూడా తమ విన్యాసాలలో భాగంగా ప్రదర్శిస్తారు. ఆ తర్వాత ప్రపంచ దేశాల నుంచి విచ్చేసిన సుందరీమణుల పరిచయ కార్యక్రమానికి ప్రారంభ సూచికగా, ఖండాల వారీగా తెలంగాణ జానపద, గిరిజన కళారూపాల ప్రదర్శనలతో ప్రారంభమవుతాయి. వాటిలో భద్రాచలం గోదావరి పరివాహక ప్రాంతానికి పట్టుగొమ్మగా నిలిచిన కొమ్ము కోయ కళాకారులు రామకృష్ణ బృందం ప్రదర్శన ఉంటుంది. ఆ తర్వాత ఆదిలాబాద్ ప్రాంతం నుంచి గోండు జాతి ప్రజల విశిష్ట కళారూపం గుస్సాడీ కళా ప్రదర్శన కత్లే శ్రీధర్ బృందంతో మరొక ఖండానికి సంబంధించిన సుందరీమణులు వేదికకి పరిచయం అవుతారు. అలాగే తెలంగాణ జానపద సంప్రదాయానికి నిలువెత్తు నిర్వచనంగా నిలిచే డప్పులు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత అందే భాస్కర్ బృందంతో, తెలంగాణ గిరిజన వైభవానికి ప్రతీకగా నిలిచే బంజారా మహిళల విన్యాసాలు శ్రీమతి స్వప్న బృందంతో ప్రదర్శనకి వస్తాయి. ఆ తర్వాత తెలంగాణ గ్రామీణ పల్లె జీవన ప్రతీకగా నిలిచిన ఒగ్గుడోలు కళా విన్యాసాలు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత చౌదరపల్లి రవి కుమార్ బృందంచే ప్రదర్శితమవుతోంది. ఈ కళారూపాలు అన్నింటి మేళవింపుగా ముగింపు ఉంటుంది. ఇలా సౌందర్యం, సంస్కృతి రెండు కలగలిసిన వేడుకగా ఈ ప్రారంభోత్సవ సంబరాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించింది.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాంపల్లిలోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మండల, నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్న చిన్న మరమత్తులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామని తెలిపారు. విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42.00 కోట్లను ఫిక్సడ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమి ఖర్చు పెడుతుందని, జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్ డిపాజిట్‌పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.1,00,000తో పాటు అయిదు సంవత్సరాల వరకు, నెలకు రూ.3000ల చొప్పున పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల క్రింద 1 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు 1,000ల చొప్పున గరిష్టంగా ఇద్దరికి అందించడం జరుగుతుంది. ఇప్పటి వరకు ఈ ఖాతాలో మొత్తం రూ.8,98,39,000 లు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి మాట్లాడుతూ ఈ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారని గడిచిన రెండు రోజులుగా రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో అన్న ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రజలకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని కొనియాడారు. అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణలో మొట్టమొదటి సెర్టా షోరూమ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ప్రపంచంలోనే అతిపెద్ద, విశ్వసనీయమైన మ్యాట్రెస్ (పరుపుల) తయారీ సంస్థ సెర్టా, తెలంగాణ రాష్ట్రంలోని తమ తొలి ఎక్స్క్లూజివ్ షోరూమ్‌ను హైదరాబాద్ ఖాజాగూడ లో శుక్రవారం ప్రారంభించింది. ఈ గ్రాండ్ ఓపెనింగ్‌ను సెర్టా ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితిన్ గుప్తా ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెల్స్, మార్కెటింగ్ డైరెక్టర్ ఎస్.కె. మల్హోత్రా, సేల్స్ హెడ్ ఉదయ్ దుబే, స్థానిక భాగస్వామి డెకర్ వరల్డ్ సిలెక్ట్‌కి చెందిన అంకిత్ గోయల్ హాజరయ్యారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి అనేక మంది ప్రముఖ ఆర్కిటెక్ట్స్, ఇంటీరియర్ డిజైనర్లు, ఇండస్ట్రీ నిపుణులు హాజరైనారు. వారాహమూర్తి ఫ్లెక్సిరబ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే న్యూ ఢిల్లీకి చెందిన సంస్థ, సెర్టా బ్రాండ్‌కు ఇండియాలో లైసెన్స్ పొందిన తయారీదారు. సెర్టా బ్రాండ్‌కి 90 సంవత్సరాల చరిత్ర ఉంది, ఇది 150 కంటే ఎక్కువ దేశాల్లో అందుబాటులో ఉంది. ఇది పోచర్ పెర్ఫెక్ట్ స్పైరల్ స్ప్రింగ్ టెక్నాలజీ, ఎయిర్ సపోర్ట్ ఫోమ్ వంటి ఆధునిక సాంకేతికతలతో పేరుగాంచింది. ఈ సందర్భంగా నితిన్ గుప్తా మాట్లాడుతూ "తదుపరి 12 నెలల్లో హైదరాబాద్‌లో ఐదు ఎక్స్క్లూజివ్ స్టోర్లను, అలాగే వచ్చే రెండేళ్లలో తెలంగాణలో మొత్తం 10 స్టోర్లను ప్రారంభించాలనే మా లక్ష్యం ఉంది. దీంతో పాటు టర్నోవర్‌ను ప్రస్తుతం ఉన్న రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్లకు పెంచాలని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ షోరూమ్‌లో అత్యంత ప్రీమియం ఉత్పత్తులైన సెర్టా ఆర్కిక్ కూడా ప్రదర్శించబడింది. ఇది భారతదేశంలోనే అత్యంత చల్లదనం కలిగిన పరుపుగా పరిగణించబడుతోంది. ఇది 15 రెట్లు అధిక కూలింగ్ పవర్ కలిగి ఉంది.

జవహర్‌నగర్‌లో కార్మికుల మృతి బాధాకరం : మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జవహర్ నగర్‌లో జరిగిన విషాదకర ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి విచారం వ్యక్తం చేశారు. జవహర్‌నగర్‌లో జరిగిన విషాద ఘటనపై శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శానిటేషన్ అధికారులు, రాంకీ ప్రాజెక్టు యాజమాన్యంతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా రాంకీ ప్రాజెక్టు యాజమాన్యం ప్రమాద కారణాలను మేయర్‌కు వివరించారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాంకీ ప్రాజెక్ట్ డైరెక్టర్ అగర్వాల్ ఈ ఘటనపై స్పందిస్తూ, ఇది అనుకోని ప్రమాదమని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పబ్లిక్ వర్క్స్ కాంట్రాక్టు నిబంధనల ప్రకారం ఒక్కో బాధిత కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా, మొదటి విడతగా ఒక్కొక్కరికి రూ.4 లక్షల పరిహారం శుక్రవారం మంజూరు చేసినట్లు మేయర్‌కు వివరించారు. మేయర్ స్వయంగా నగరంలో పారిశుద్ధ్య పరిస్థితిని సమీక్షించి, నగర శుభ్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే మిస్ వరల్డ్ పోటీలో జిహెచ్ఎంసి భాగస్వామ్యం అవుతున్నందున నగరాన్ని మరింత శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే దిశగా ప్రతి చర్య మార్గదర్శిగా ఉండాలని మేయర్ తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రతిరోజు సమీక్షిస్తానని, పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా లేనట్లయితే తీవ్ర చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు.

ప్రతి రోజు నివేదికలను తనకు అందజేయాలని మేయర్ సూచించారు. ఆ దిశగా ఇప్పటికే 700 బిన్‌లు ఏర్పాటు చేశామని, త్వరలో మరో 300 బిన్లు ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు మేయర్‌కు తెలిపారు. ఈ సమావేశంలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, రాంకీ ప్రాజెక్ట్ డైరెక్టర్ అగర్వాల్, ఫస్యా తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధపై ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఇంజనీరింగ్ విద్యార్థులకు కృత్రిమ మేధపై నైపుణ్యం కల్పించడమే లక్ష్యంగా సమ్మర్ ఆఫ్ ఏఐ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వం ఏఐ సెంటర్ హెడ్, కిరణ్ చంద్ర తెలిపారు. శత సహస్ర యాగం అనే ఈ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ నెల రోజుల పాటు జరగనుందన్నారు. ఇది ప్రపంచంలో మొట్టమొదటి తెలుగు లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) అభివృద్ధికి తోడ్పాటు అందించనుందన్నారు. దీని ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఉన్న లక్ష మందికి పైగా ఇంజినీరింగ్ విద్యార్థులకు లబ్ధి చేకూరనుందన్నారు. ఐఐఐటీ హైదరాబాద్, స్వేచ్ఛ, మెటా, హెచ్చైఎస్ఈఏ, ఓజోనెటెల్ తదితర సంస్థల సహకారంతో ఇది రూపుదిద్దుకుందన్నారు. విద్యార్థులు ఏఐ/ ఎంఎల్ ప్రాథమికాంశాలు, డేటా ప్రిపరేషన్, మోడల్ బిల్డింగ్, డిప్లాయ్మెంట్ వంటి అంశాలలో నైపుణ్యం పొందుతారన్నారు. ఈ హైబ్రిడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) కోర్సు ద్వారా విద్యార్థులు తెలుగు ఎల్ఎల్ఎం అభివృద్ధిలో భాగస్వాములవుతారన్నారు. ఇందులో డేటా సేకరణ, డేటా క్యూరేషన్, ఇండిక్ (తెలుగు) డేటాసెట్ నిర్మాణం, ఆపై ఆ డేటా ఆధారంగా విద్యార్థులు ఏఐ మోడల్ అభివృద్ధిని సమగ్రంగా నేర్చుకుంటారని తెలిపారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తే సహించేది లేదు

విశాలంధ్ర - రాజేంద్రనగర్ : పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా సాక్షి తెలుగు దినపత్రిక ఎడిటర్ ఆర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై ఎలాంటి వారెంటు లేకుండా దాడులు చేయటాన్ని జర్నలిస్టులు ముక్తకంఠంతో ఖండించారు. శుక్రవారం సాక్షి రాజేంద్రనగర్ జోన్ ఇంచార్జ్ బాబురావు ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని బుద్వేల్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ సర్కిల్ టియూడబ్ల్యూజే ఐజె యు అధ్యక్షుడు మేకల దామోదర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను కాల రాసేందుకు ఏపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు సరైంది కాదన్నారు. పత్రికలు సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను వెలుగులోకి తెచ్చేందుకు అనేక కథనాలు ప్రచురిస్తాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పున రావతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ చర్యపై న్యాయవ్యవస్థ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్పందించాలని కోరారు. నిజాలను నిర్భయంగా ప్రజల దృష్టికి తీసుకువెళ్లే స్వేచ్ఛ పత్రికలకు ఉందని గుర్తించాలన్నారు. అనుమతి లేకుండా సామాన్య పౌరుల ఇంట్లోకి సైతం వెళ్లే అర్హత ఎవరికీ లేదనే విషయం గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో అప్పారెడ్డిగూడెం భీమయ్య ప్రేమ్ రాజ్, వర్కల చందు సుజీవన్ రెడ్డి, నరసింహ, శివ చరణ్, సందీప్, వినయ్, శ్రీకాంత్, గణేష్, కృష్ణ బాబురావు రాజేందర్ రెడ్డి పాపిరెడ్డి సత్యం గౌడ్ విజయ్ కుమార్ గద్ద యాదగిరి శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

పూలే విగ్రహ తొలగింపును అడ్డుకున్న ప్రజాసంఘాలు

విశాలాంధ్ర - జవహర్ నగర్ : దళిత సంఘర్షణ సమితి, బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అంబేద్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతి పూలే విగ్రహాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్టాపకులు కాయిత రాజు యాదవ్ మాట్లాడుతూ జవహర్ నగర్ మున్సిపల్ అధికారులు గురువారం రాత్రి ఒంటి గంటకు పోలీస్ బందోబస్తుతో జెసిబి సహాయంతో పూలే విగ్రహాన్ని తొలగించేందుకు ప్రయత్నించారు. దీనితో పూలే అభిమానులు విగ్రహం తొలగించడాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్ఎస్ నేషనల్ కోఆర్డినేటర్ నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ జవహర్‌నగర్‌లో ఉన్న అన్ని విగ్రహాలకు లేని అనుమతులు నిబంధనలు ఒక్క పూలే విగ్రహానికి ఎందుకు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కనుకుంట్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ పూలే విగ్రహాన్ని తొలగించాలని చూస్తే బిసి సంఘాలతో పెద్దఎత్తున రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జవహర్ నగర్‌లోని బీసీ దళిత సంఘాలు పూలే విగ్రహ పరిరక్షణకు పాటుపడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డి ఎస్ ఎస్ నాయకులు హెచ్.విష్ణు, పెగడ వాసు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: న్యూఢిల్లీలోని లోక్‌నాయక్ భవన్‌లో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లిలోని సర్వేనెంబర్ 62/1 బాపూజీ నగర్ బాధితుల పట్టాల సమస్యపై ఫిర్యాదు విచారణకు శుక్రవారం ఉదయం జాతీయ ఎస్టీ కమిషన్ ముందు హాజరవడం జరిగింది. ఈ విచారణ సందర్భంగా ఎస్టి కమిషన్ ముందు బాధితులు ఎదుర్కొంటున్న పట్టాల సమస్య గురించి, కబ్జాదారుల దోపిడి గురించి వివరణ ఇవ్వడం జరిగింది. దాంతో కమిషన్ స్పందించి మేడిపల్లిలోని 62/1 సర్వేలో గల బాధితులకు న్యాయం చేస్తామని విచారణ సందర్భంగా తెలపడం జరిగింది. ఎస్టీ కమిషన్ ముందు హాజరైన తర్వాత ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు, లంబాడి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ అశోక్ నాయక్ మాట్లాడుతూ పట్టాల గురించే కాకుండా అమాయక ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తున్న భూ మాఫియాలను కఠినంగా శిక్షించేంతవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఎస్టి కమిషన్ ముందు హాజరై బాధితులు మోసపోయిన వైనాన్ని వివరంగా కమిషన్ ముందు క్షుణంగా వివరించామని కమిషన్ న్యాయం చేస్తానని తెలిపిందని, ఎన్ని ఒత్తిడి మాపై వచ్చిన గాని ధైర్యంతో ప్రజా సమస్యలపై కొట్లాడుతూనే ఉంటామని శ్రీలత బద్రు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: బడీడుకు వచ్చిన పిల్లలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాధికారి మల్లయ్య తల్లిదండ్రులకు సూచించారు. ముందస్తు బడిబాట కార్యచరణలో బాగంగా శుక్రవారం మల్లయ్య మండలం ప్రారంభించారు. మొదటి రోజు నాగిరెడ్డిగూడ గ్రామంలో ఆయన ప్రారంభించారు. ప్రతి శుక్రవారంతో పాటు జూన్ 6వ తేది వరకు ప్రతి గ్రామంలో ఉదయం ఆరు గంటల నుండి 10 గంటల వరకు బడిబాట అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ బడీడుకు వచ్చిన పిల్లలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దిందని.. అన్ని మౌళిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు శ్రీరాములు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆంజనేయ వర్మ, ఆవుల జగదీశ్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: శుక్రవారం నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆంజనేయ వర్మ, ఆవుల జగదీశ్ యాదవ్‌ల పుట్టినరోజు సందర్భంగా బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం కొలను హన్మంత్ రెడ్డి ఆంజనేయ వర్మ, ఆవుల జగదీశ్ యాదవ్‌ని శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ ఎమ్ సి అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కోలన్ జీవన్ రెడ్డి, రాజి రెడ్డి, మెడ శ్రీనివాస్ రావు, భాస్కర్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తయ్యను పరామర్శించిన మాజీ మంత్రి రాజయ్య

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఉప్పల్ టీఎక్స్ హాస్పిటల్‌లో కాలు శస్త్రచికిత్స చేయించుకొని నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్న క్రైస్తవ నాయకులు మత్తయ్యను మాజీమంత్రి తాటికొండ రాజయ్య పరామర్శించారు. మత్తయ్య త్వరగా కోలుకొని సమాజ సేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఉప్పల్ టీఎక్స్ ఆసుపత్రి సిఇఓ కిషోర్, ఉప్పల్ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శి రెవ అగ్రిప్ప రాజు, చైర్మన్ గోన ఫిలిప్, రెవ తేజోమయ, రెవ ప్రకాష్, బిషప్ భాస్కర్, రెవ అనిల్ జాబెజ్ కందూరి, సిస్టర్ సోఫియా, బ్రదర్ కోటి, ఆనంద్, శ్రావణ్ తదితరులు మత్తయ్యను పరామర్శించారు.

ప్రజా సేవకు వ్యాపారం ప్రారంభించడం అభినందనీయం

విశాలాంధ్ర - మొయినాబాద్ : ప్రజలకు సేవా చేయాలనే మంచి ఆలోచనతో యువత వ్యాపారం ప్రారంభించడం అభినందనీయమని బీఆర్ఎస్ రాష్ట్ర యువనాయకుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జీ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలో అదే గ్రామానికి చెందిన వడ్ల హరిశంకరాచారి శ్రీ వెంకటేశ్వర పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన ఫార్మసీ కేంద్రం, మెడికల్ షాపును శుక్రవారం కార్తీక్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించాడు. అనంతరం మాట్లాడుతూ చిన్న వయసులోనే వ్యాపారం ప్రారంభించడంతో వారిని అభినందించారు. వ్యాపారంలో లాభార్జనే ధ్యేయంగా కాకుండా నాణ్యమైన ఔషదాలను విక్రయించాలని సూచించారు. స్వయం ఉపాధితో యువత ఆర్థికంగా ఎదగాలి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు కొత్త నర్సింహ్మారెడ్డి, ముదిగొండ రవియాదవ్, నరోత్తంరెడ్డి, కొత్త మాణిక్ రెడ్డి, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు అరవింద్ రజక, దారెడ్డి కృష్ణారెడ్డి, అంజయ్య గౌడ్, అతిక్, తదితరులు ఉన్నారు.

బండారి రాజురెడ్డి మృతి పార్టీ తీరని లోటు

విశాలాంధ్ర - కాప్రా : కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బండారి రాజు రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీ తీరని లోటు అని మల్కాజ్గిరి పార్లమెంట్ మాజీ సభ్యులు సర్వే సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బండారి రాజి రెడ్డి భౌతిక కాయానికి కాంగ్రెస్ కండువాతో ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బాల్ రెడ్డి, గోపాల్ యాదవ్, లింగం నాయక్, నీరజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



17వ హైదరాబాద్ జ్యువెలరీ పెర్ల్ అండ్ జెమ్ ఫెయిర్ ప్రారంభం

విశాలాంధ్ర - జుబిలీహిల్స్ : ఇన్ఫార్మా మార్కెట్స్ ఇన్ ఇండియా నిర్వహించిన 17వ హైదరాబాద్ జ్యువెలరీ పెర్ల్ అండ్ జెమ్ ఫెయిర్ ఇవాళ హైదరా బాద్ హైటెక్స్‌లోని హాల్ 4లో ప్రారంభ మైంది. దక్షిణ భారతదేశంలో అత్యంత ముఖ్యమైన బి2బి ఆభరణాల వాణిజ్య వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది. దేశ విదేశాల నుంచి వేలాది మంది ఆభరణాల వ్యాపారులు, డిజైనర్లు, తయారీ దారులు రిటైలర్లు ఒకే వేదికను పంచుకున్నారు. రాబోయే దీపావళి పండుగ పెళ్లిళ్ల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని నగల కొనుగోళ్లు జరగనున్నాయనేది సుస్పష్టం. 8 వేల మందికి పైగా వ్యాపారులు వస్తారని అంచనా, భారతదేశ రత్నాలు, ఆభరణాల పరిశ్రమ ఉత్సాహాన్ని నిలకడను ప్రతిబింబిస్తుంది. దీప ప్రజ్వలన కార్యక్రమంతో ఈ ఆభరణాల పండుగ ప్రారంభ మైంది. దీనికి కార్తీక్ రెడ్డి (భారత రాష్ట్ర సమితి జాతీయ మీడియా ప్యానలిస్ట్), వర్గీస్ అలుక్కా (జోస్ అలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్) వంటి ప్రముఖులు హాజరయ్యారు. వారితో పాటు జీజేసీ వైస్ చైర్మన్ అవినాష్ గుప్తా, హెచ్‌జేఎంఏ అధ్యక్షుడు మహేంద్ర టాయల్, హెచ్‌జేఎంఏ ఉపాధ్యక్షుడు ముఖేష్ అగర్వాల్, జేఏబీ అధ్యక్షుడు డాక్టర్ చేతన్ మెహతా, ట్విన్ సిటీస్ జ్యువెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కైలాష్ చరణ్, తెలంగాణ బులియన్, జెమ్, జ్యువెలరీ ఫెడరేషన్ అధ్యక్షుడు జగదీష్ పర్షాద్ వర్మ, తెలంగాణ పాన్ బ్రోకర్ జ్యువెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరస్మల్ రాంకా, పోట్ మార్కెట్ జ్యువెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ పెర్చల్ జైన్, ఏటీజే మేనేజింగ్ డైరెక్టర్ సుమేష్ వాధేరా పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

విశాలాంధ్ర - అమనగల్లు : ప్రైవేటు పాఠశాలలలో ఫీజుల దోపిడిని అరికట్టాలని, అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం తలకొండపల్లి ఎంఈవో చాంప్లానాయకు టీఎస్ఎస్ఓ నాయకులు విజ్ఞప్తి చేశారు. పుస్తకాలు, యూనిఫామ్, బుక్స్ పేరుతో దందాకు పాల్పడుతున్నారని వారు పేర్కొన్నారు. వెంటనే ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి నిబంధనలు అతిక్రమించిన వారిపై కొరడా జరిపించాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల వంశీ, నాయకులు పాల్గొన్నారు.

ఫాసిజం ప్రపంచానికే ప్రమాదం

కమ్యూనిస్టుల ప్రాణత్యాగాలతో ప్రజాస్వామ్య పాలన

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: సామ్రాజ్యవాదుల నిరంకుశత్వానికి నిదర్శనమైన ఫాసిజం ప్రపంచానికే అత్యంత ప్రమాదకరమైన మహమ్మారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పేర్కొన్నారు. ఫాసిజంపై సోవియట్ యూనియన్ విజయాన్ని (విక్టరీ డే- 80వ వార్షికోత్సవం) పురస్కరించుకుని ఇస్కఫ్ ఏపీ రాష్ట్ర సమితి, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి సంయుక్త అధ్వర్యంలో శుక్రవారం విజయవాడ దాసరిభవన్‌లో ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షతన ఎర్ర జెండా విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. యుద్ధం వద్దు...శాంతి ముద్దు...ప్రపంచ శాంతి వర్ధిల్లాలి వంటి నినాదాలతో సాగిన ఈ సభలో ఫాసిజంపై యుద్ధ నేపథ్యాన్ని జ్ఞప్తికి తేస్తూ ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన గేయాలు ఆలోచింపజేశాయి. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ... పెత్తందారుల, సామ్రాజ్యవాదుల ఆధిపత్యం కోసం సాగిన 2వ ప్రపంచ యుద్ధంలో ఫాసిజంపై సోవియట్ యూనియన్ విజయం సాధించడం... ప్రపంచ రూపురేఖలను మార్చివేసిందన్నారు. ఈ యుద్ధంలో అందరికంటే తీవ్రంగా నష్టపోయింది సోవియట్ యూనియన్ మాత్రమేనని తెలిపారు. ప్రజాస్వామ్యవాదిగా ప్రజల పక్షంగా స్టాలిన్ ధైర్యంగా నిలబడి దేశం కోసం యుద్ధం చేశారని గుర్తు చేశారు. తన కుమారుడుని శత్రుసైన్యం హతమార్చినా కృంగిపోకుండా దీటుగా ఎదుర్కొని దేశంపై తనకున్న అభిమానాన్ని చాటుకున్న మహా నాయకుడని కొనియాడారు. ప్రజాస్వామ్య పాలన కోసం ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ప్రాణాలు త్యాగాలు చేసి హక్కులు సాధించడంలో అగ్ర భాగాన నిలిచారని రామకృష్ణ తెలిపారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని... రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య సాగుతున్న యుద్ధం ప్రజల జీవన విధానానికి పెను సవాల్‌గా మారిందని అన్నారు. ఈ ఆధిపత్య విధానానికి స్వస్తి పలికి ఇరు దేశాల మధ్య శాంతియుత వాతారణం నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇక దేశానికి ఉగ్రవాదం తీవ్ర ముప్పుగా పరిణమించిందని... భారత్, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధంపై ప్రజలల్లో చర్చ జరుగుతోందన్నారు. ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ స్వర్గధామంగా ఉందని, ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పెంచిపోషిస్తోందన్నారు. ఆర్థికవ్యవస్థ పూర్తిగా పతనంలో ఉన్న ఆ దేశంలో పాలకులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, దీని దృష్టి మళ్లించేందుకు భారత్‌పై ఉగ్ర దాడులకు తెగబడుతోందని... దీంతో అధికారంలో ఉన్నవారికి మేలు జరుగుతోందన్నారు. మన దేశంలో మత ఘర్షణలు సృష్టించేందుకు ఇటీవల 26మంది సామాన్య ప్రజలను పాకిస్థాన్ ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారని తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని దేశంలోని ముస్లిం సంఘాలు, ఓవైసీ లాంటి ముస్లిం నాయకులు కూడా ఖండిస్తున్నారని తెలిపారు. ఉగ్రవాదుల ఏరివేతకు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను సమర్థిస్తున్నామని స్పష్టం చేశారు. ఇరుదేశాలకు ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. జన సాహితీ కార్యదర్శి దివికుమార్ మాట్లాడుతూ... సోవియట్ రాజ్యాన్ని స్థాపించడంలో లెనిన్, స్టాలిన్ ప్రముఖ పాత్ర పోషించారన్నారు. పాలక వర్గాల రాజకీయ ప్రయోజనాల కోసం జరిగే యుద్ధాలను ప్రజలను సమర్థించకూడదన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ దేశం కోసం త్యాగాలు చేసిన చరిత్ర సోవియట్ యూనియన్‌కు ఉందని ,2 వ ప్రపంచ యుద్ధంలో స్టాలిన్ అలుపెరగని పోరాటం చేసి ప్రజాస్వామ్య రాజ్యాన్ని స్థాపించాడని గుర్తు చేశారు. వేర్పాటువాదులకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేసిన ఏకైక పార్టీ సీపీఐ అని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ఆర్మీకి సెల్యూట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ దుర్గాభవాని, ఏఎన్‌యు విశ్రాంత ప్రొఫెసర్ సి నరసింహారావు, సీపీఐ జిల్లా , నగర సహాయ కార్యదర్శులు బుడ్డి రమేష్, లంక దుర్గారావు, ఇస్కఫ్ నాయకులు మోతుకూరి అరుణ్‌కుమార్, బుద్ధవరపు వెంకట్రావు, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి చంద్రానాయక్, కోశాధికారి ఆర్ పిచ్చయ్య, జిల్లా అధ్యక్షులు శర్మ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలకు కొదవ లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎటువంటి పరిస్థితులు వచ్చినా... కూరగాయలు, నిత్యావసర వస్తువులకు కొరత లేదని... తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని కేంద్రం హామీ ఇచ్చింది. పప్పుధాన్యాలు, కూరగాయలు తదితర అత్యవసర ఆహార పదార్థాల ధరలు నియంత్రణలో ఉండేలా నిశితంగా పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అన్ని నగరాల్లో వీటి సరఫరాను స్థిరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపాయి. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం... రాష్ట్ర ఆహార కార్యదర్శులు, ఇతర కీలక వాటాదారులతో సమావేశాలు నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. నిత్యావసరాల ధరలు పెంచడం, నిల్వలను దాచడం వంటివి నివారించడానికి వ్యాపారులు, సరఫరాదారులపై నిఘా ఉంచాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా... చండీగఢ్‌లో నిత్యావసర సరకుల నిల్వపై అధికారులు నిషేధం విధించారు. వ్యాపారులందరూ తమ వద్ద ఉన్న నిల్వల సమాచారాన్ని మూడు రోజుల్లో ఆహార, సరఫరాల శాఖకు తెలియజేయాలి ఆదేశాలు జారీ చేశారు. దేశంలో ఉద్రిక్తతలు నెలకొంటున్న సమయంలో ఇదే అదునుగా భావించి కొందరు వ్యాపారులు, సంస్థలు పెట్రోల్, డీజిల్ సహా ఇతర నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఇంధన కొరత లేదు: ఐఓసీఎల్

న్యూఢిల్లీ: భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన వేళ పాక్ సరిహద్దు రాష్ట్రాల్లో భయాందోళనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్, ఎల్పీజీ కొరత ఏర్పడుతుందన్న భయంతో వాటిని నిల్వ చేసుకోవడానికి పెట్రోల్ పంపుల వద్ద బారులు తీరుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఈ విషయంపై దేశంలోని అతిపెద్ద చమురు సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీ) స్పందించింది. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికావలసిన అవసరం లేదని స్పష్టం చేసింది. తమ సరఫరా లైన్లు సజావుగా పనిచేస్తున్నాయని వివరించింది. తగినంత ఇంధనం ఉంటుందో లేదోనని భయపడి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఇంధన నిల్వల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని... తమవద్ద తగినంత నిల్వలు ఉన్నట్లు ప్రకటించింది. 'దేశవ్యాప్తంగా తగినంత ఇంధన నిల్వలు కలిగిఉన్నాం. మా సరఫరా లైన్లు సజావుగా పనిచేస్తున్నాయి. భయపడాల్సిన అవసరం లేదు. ఇంధనం, ఎల్పీజీ మా అన్ని అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రశాంతంగా ఉండి... అనవసరమైన రద్దీని నివారించి మెరుగైన సేవలు అందించడంలో మాకు సహాయపడండి. మా సరఫరా లైన్లు సజావుగా నడుపుతుంటాం' అని పేర్కొంది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ఇదే తరహా ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా కావాల్సినంత పెట్రోలు, డీజిల్, సీఎన్‌జీ, ఎల్పీజీ అందుబాటులో ఉందని తెలిపింది. ఇందుకు సంబంధించి దేశవ్యాప్తంగా బీపీసీఎల్ ఇంధన సరఫరా స్టేషన్లు, ఎల్పీజీ పంపిణీ సంస్థలు ఎటువంటి ఇబ్బంది లేకుండా పనిచేస్తున్నాయని వెల్లడించింది.

సార్వత్రిక సమ్మెపై 15న సమీక్షిస్తాం

కేంద్ర కార్మిక సంఘాల ప్రకటన

న్యూఢిల్లీ: ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. అయితే భారత్-పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ మారుతున్న పరిస్థితులను ఈ నెల 15వ తేదీన సమీక్షించి సార్వత్రిక సమ్మెపై తుది నిర్ణయం తీసుకుంటామని కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యల సంయుక్త వేదిక ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ వేదికలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్‌ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ తదితర కార్మిక సంఘాలు సభ్యులుగా ఉన్నాయి. 'ప్రజల మధ్య ఐక్యత, సామరస్యాన్ని కొనసాగించడానికి కార్మికులంతా ముందుకు రావాలనిమేము పిలుపునిస్తున్నాము' అని వేదిక పేర్కొంది. వేదిక భాగస్వామ్య సంఘాలు గురువారం సాయంత్రం సమావేశమై సార్వత్రిక సమ్మెకు సన్నాహాలను సమీక్షించారు. పహల్గాం ఉగ్ర దాడిని సమావేశం తీవ్రంగా ఖండించింది. ప్రస్తుత పరిస్థితుల్లో మే 15న మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించారు.

ఏడుగురు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య దాడులు, ప్రతిదాడుల వేళ సరిహద్దుల గుండా దేశంలోకి చొరబడేందుకు యత్నించిన ముష్కరులను సరిహద్దు రక్షణ దళం మట్టుబెట్టింది. జమ్మూకశ్మీర్‌లోని సాంబా జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అక్రమ చొరబాట్లకు అనువుగా పాకిస్థాన్ సైన్యం డ్రోన్లు, చిన్నపాటి మిసైళ్లతో గురువారం రాత్రి దాడులకు పాల్పడింది. ఇదే అదనుగా ఏడుగురు ఉగ్రవాదులు దేశంలోకి చొరబడేందుకు యత్నించగా... బీఎస్ఎఫ్ జవాన్లు వారిపై కాల్పులు జరిపి అంతమొందించారు. దీనిని బీఎస్ఎఫ్ ఎక్స్ వేదికగా నిర్ధారించింది. సాంబా జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి చొరబాట్లను బీఎస్ఎఫ్ అడ్డుకుందని, ఏడుగురు చొరబాటుదారులను అంతమొందించినట్లు అర్ధరాత్రి ఒంటి గంటకు ట్వీట్ చేసింది. కాగా, చొరబాటుదారులంతా జైషే మహమ్మద్‌కు చెందిన ఉగ్రవాదులుగా అనుమానిస్తున్నట్లు బీఎస్ఎఫ్ వర్గాలు వెల్లడించాయి.

సత్వరమే హైకోర్టు జడ్జీల భర్తీ

కేంద్రానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జీల నియామకాలను వెంటనే చేపట్టాలని, ఖాళీలను భర్తీ చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. దేశవ్యాప్తంగా న్యాయ పరిపాలనపై ప్రభావం చూపుతున్న దృష్ట్యా జడ్జీల నియామకాల్లో జాప్యం చేయొద్దని సూచించింది. కొలీజియం సిఫార్సులను త్వరగా పరిష్కరించాలని కేంద్రానికి స్పష్టంచేసింది. హైకోర్టులలో ఏడు లక్షలకుపైగా క్రిమినల్ కేసులు పెండింగ్ ఉన్నట్లు సర్వోన్నత న్యాయస్థానం గుర్తుచేసింది.. జడ్జిల కొరతతో ఇలాంటి పరిస్థితి ఉంటోందని అసహనం వ్యక్తంచేసింది. 2022, నవంబర్ 9 నుండి హైకోర్టులకు అర్హులైన న్యాయమూర్తులకు సంబంధించి సుప్రీం కొలీజియం చేసిన 29 సిఫార్సులు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ ఉన్నాయి. అలహాబాద్ హైకోర్టులో 160 మంది జడ్జీలుండగా, 79 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. హైకోర్టులో రెండు లక్షలకుపైగా క్రిమినల్ కేసులు పెండింగ్ ఉన్నాయి. బాంబే హైకోర్టులో మొత్తం 94 మంది జడ్జీలకు గాను 66 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఢిల్లీలో 60 మందికిగాను 41 మంది విధుల్లో ఉండగా, కోల్‌కతా హైకోర్టులో 72 మందికిగాను 44 మంది పనిచేస్తున్నారు.

భారత్ సత్తాకు చరిత్రే సాక్ష్యం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: ఎప్పుడైనా ఎవరైనా భారతదేశ ఆత్మగౌరవాన్ని సవాల్ చేసినప్పుడల్లా వారికి మననుంచి తగిన సమాధానం లభించిందని... ఇందుకు చరిత్రనే సాక్ష్యమని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. భారతదేశం మరోసారి సవాలు చేయబడిందని... దాని సహనాన్ని పరీక్షించేవిధంగా ఉగ్రవాదులు అమాయక ప్రజలను నిర్దాక్షిణ్యంగా చంపారని అన్నారు. దీనికి వారు మూల్యం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 'ఈ భూమిని రక్షించడానికి మన సైనికులు తమ ప్రతి రక్తపు బొట్టును త్యాగం చేయాలని ఉత్సాహంతో గర్జించినప్పుడు, శత్రువు హృదయం వణికిపోతుంది. మరోసారి మనల్ని సవాలు చేశారు. మన సహనాన్ని పరీక్షించారు. ఉగ్రవాదులు మన అమాయక ప్రజలను నిర్దాక్షిణ్యంగా చంపారు. వారు దీనికి మూల్యం చెల్లించాల్సి ఉంటుంది' అని రమేష్ అన్నారు. ఈ క్లిష్ట సమయంలో ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త దేశ సైన్యానికి అండగా నిలుస్తారని ఆయన అన్నారు. అందుకే శుక్రవారం సైనికులకు మద్దతుగా దేశవ్యాప్తంగా జై హింద్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భారత ప్రభుత్వానికి అండగా ఉన్నాం: పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా పూర్తి మద్దతు ఉంటుందని కాంగ్రెస్ తన సంఘీభావాన్ని పునరుద్ఘాటించింది. 'మనం ఆలోచన, మాట, చర్యల ద్వారా భారత ప్రభుత్వానికి అండగా ఉన్నాము' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరంతరం చెబుతున్నారని కాంగ్రెస్ ప్రతినిధి రాగిణి నాయక్ తెలిపారు. 'భారత ప్రభుత్వం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏదైనా ప్రధాన నిర్ణయం తీసుకుంటే, మా పూర్తి సహకారం, మద్దతు ప్రభుత్వానికి ఉంటుంది. ఈ రోజు జై హింద్ యాత్ర ద్వారా మేము ఈ సందేశాన్ని పునరుద్ఘాటిస్తాము' అక్బర్ రోడ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె స్పష్టం చేశారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు చంద్రబాబు ఘననివాళి

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు: దేశరక్షణ కోసం ప్రాణాలర్పించిన ధీరుడు మురళీనాయక్ అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా తిరుగు ప్రయాణంలో శుక్రవారం కర్నూలు ఎయిర్ పోర్ట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అమరవీరుడు మురళీ నాయక్ కు ముఖ్యమంత్రి ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితాండ పంచాయతీకి చెందిన వీర జవాన్ మురళీ నాయక్ గురువారం కశ్మీరులో పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో మృతి చెందాడు. ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, అతడి చిత్రపటం ముందు పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళి అర్పించారు.. 25 ఏళ్లకే దేశరక్షణ కోసం ప్రాణాలు వదిలిన వీరజవాన్‌కు ప్రభుత్వంతోపాటు ప్రజలు పెద్దఎత్తున నివాళులు అర్పిస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, డీఐజీ కోయ ప్రవీణ్, నంద్యాల జిల్లా ఎస్పీ, కర్నూలు జిల్లా ఇంచార్జి ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సివిల్‌సప్లయ్ డైరెక్టర్ మహేష్‌నాయుడు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

'ది వైర్'పై నిషేధం అప్రజాస్వామికం

పత్రికా స్వేచ్ఛను గౌరవించాలి: సీపీఐ

న్యూఢిల్లీ: డిజిటల్ వార్తా సంస్థ 'ది వైర్' వెబ్‌సైట్‌ను ఐటీ చట్టంలోని నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ చర్యను భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండించింది. పత్రికా స్వేచ్ఛను గౌరవించాలని, భావ ప్రకటన స్వేచ్ఛను పరిరక్షించాలని, ప్రజల సమాచార హక్కుకు కట్టుబడాలని కేంద్రానికి సూచించింది. ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్రప్రభుత్వ నిరంకుశ నిర్ణయలు ఆక్షేపణీయమని పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ క్రమంలో ఉగ్రవాదంపై పోరుకు దేశం మొత్తం ఒక్కటై మద్దతిస్తున్న సమయంలో ప్రధాన స్రవంతి వార్తా ఛానళ్లపై చర్యలు తీసుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించింది. పరిస్థితుల మతతత్వీకరణను తీవ్రంగా ఖండించింది. దూరదర్శన్ తరహా పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్లు కూడా విభజనకు దోహదమైనట్లు పేర్కొంది. ఇటువంటి ప్రమాదకర ధోరణిని ఆపకుండా జర్నలిజం సమగ్రతను పరిరక్షించే బాధ్యతాయుత 'ది వైర్' వంటి వార్తా సంస్థలను లక్ష్యం చేసుకోవడం ప్రభుత్వానికి తగదని పేర్కొంది. విమర్శనాత్మక, స్వతంత్ర స్వరాలపై కేంద్రం అసహనం, రాజకీయ వివక్ష తాజా చర్యతో స్పష్టంగా ప్రతిబింబించిందని వ్యాఖ్యానించింది. సెన్సార్‌షిప్‌ను వ్యతిరేకించాలని ప్రజాస్వామిక శక్తులకు పిలుపునిచ్చింది. ది వైర్ వెబ్‌సైట్‌ను వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ డిమాండ్ చేసింది.

తప్పుడు ప్రసారాల కట్టడి తక్షణావశ్యం: రాజా

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కొన్ని వార్తా సంస్థలు తప్పుడు కథనాలు ప్రసారం చేస్తుండటంపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేశారు. తాజా పరిస్థితులకు మతం రంగు పులిమేందుకు కొన్ని ఛానళ్లు ప్రయత్నిస్తుండటం ఆక్షేపణీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం లేక సాయుధ దళాల నుంచి అధికారిక సమాచారం లేకుండానే తప్పుడు కథనాల ప్రసారం ద్వారా రెచ్చగొట్టే మీడియా సంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాజా లేఖ రాశారు. ఇలాంటి ప్రసారాలు జర్నలిజం సమగ్రతను దెబ్బతీస్తాయన్నారు. కొన్ని వర్గాలను లక్ష్యం చేసుకునేలా ప్రమాదకర ధోరణితో ప్రజలు భయపడతారని, పభుత్వంపై నమ్మకం కోల్పోతారని హెచ్చరించారు. పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ల బాధ్యతారాహిత్యాన్ని విమర్శించారు. ఈ ప్రమాదకర ధోరణి నడుస్తున్నప్పుడు 'ది వైర్' వంటి బాధ్యతగల వార్తా సంస్థపై చర్యలు తగవని, తక్షణమే ఆ సంస్థ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలని రాజా కోరారు. మతోన్మాదాన్ని, విద్వేషాన్ని, తప్పుడు కథనాలను ప్రోత్సహిస్తున్న వార్తా సంస్థలు, ఛానళ్లు, మాధ్యమాలపై చర్యలు అత్యవసరమని కేంద్ర సమాచార, ప్రసారాల శాఖకు సూచించారు. జాతీయ ఐక్యతకు కట్టుబడాలని... తప్పుడు సమాచార వ్యాప్తిని అరికట్టాలని కోరారు. రక్షణ, హోం, విదేశీ వ్యవహారాల శాఖలతో సమన్వయం చేసుకొని నిజనిర్ధారణ ద్వారా ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని వైష్ణవ్‌కు సూచించారు. యుద్ధమొస్తే మొదట చనిపోయేది నిజమన్న సామెత సరిగ్గా సరిపోతోందని వ్యాఖ్యానించారు. నిజాన్ని చంపేయవద్దని, ప్రజలను విభజించవద్దని, దేశాన్ని ఐక్యంగా ఉంచాలని, ఈ అంశాలపై తక్షణమే దృష్టిని కేంద్రీకరించాలని తన లేఖలో అశ్వినీ వైష్ణవ్‌ను రాజా కోరారు. తన సూచనలు పరిగణనలోకి తీసుకుంటారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

గురుకులాల్లో అత్యుత్తమ బోధన

- కెరీర్ గైడెన్స్‌పై అవగాహన
- విద్యార్థుల వైద్య సదుపాయాలకు రూ.5 కోట్లతో నిధి
- బీఆర్ఏజీసీఈటీ ఫలితాల విడుదలలో మంత్రి డోలా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గురుకులాలపై ప్రజలకు నమ్మకం, విశ్వాసం పెరుగుతుందని, వారి నమ్మకాలను నిజం చేస్తూ విద్యాసంస్థల్లో అత్యుత్తమ బోధన అందేలా చర్యలు తీసుకుంటున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. గురుకుల విద్యాలయ సంస్థ కార్యాలయంలో బీఆర్ఏజీసీఈటీ-2025 ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం మంత్రి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ... అంబేద్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు అధిక సంఖ్యలో విద్యార్థులు పోటీ పడటం హర్షనీయమన్నారు. రాష్ట్రంలో గురుకులాల స్కూళ్లు, సీట్లు పెంచాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్ విధానం ద్వారా అత్యంత పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షలో మొదటి మూడు స్థానాల్లో కర్నూల్ జిల్లాకు చెందిన కడవల సుమతి 49 మార్కులతో ప్రథమ స్థానం, అనకాపల్లికి చెందిన వియ్యపు శరత్ 48 మార్కులతో ద్వితీయ, కర్నూల్ జల్లాకు చెందిన బోయా విద్యా 48 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారని వివరించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలో విశాఖపట్నం జిల్లాకు చెందిన రఘుపతి గీతిక 92.5 మార్కులతో మొదటి స్థానం, కర్నూల్ జిల్లాకు చెందిన ఈపూరు సుహృతి 91.25 మార్కులు, పిజరి హసీనా 90.5 మార్కులతో రెండవ, మూడవ స్థానాలను కైవసం చేసుకున్నారని మంత్రి తెలిపారు. గురుకులాల్లో ఇకపై ప్రతి నెలా కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన పెంచేలా ఒక క్లాస్ నిర్వహించాలన్న నిర్ణయం అమలు చేయనున్నామని చెప్పారు. విద్యార్థులకు అత్యవసరమైన పరిస్థితుల్లో వైద్య సదుపాయం, విషమ పరిస్థితుల్లో ఆర్థిక సహాయం సమకూర్చడానికి రూ.ఐదు కోట్లతో నిధి ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో వంద పాఠశాలల్లో రూ.10 కోట్లతో అధునాతన వంటశాలలకు చర్యలు చేపట్టామన్నారు. సెక్రటరీ వి.ప్రసన్న వెంకటేష్, అడిషనల్ సెక్రటరీ కె.సునీల్ రాజ్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఎన్. సంజీవరావు పాల్గొన్నారు.

సీఐడీ విచారణకు సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మంగళగిరి టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వైసీపీ నేత, అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి శుక్రవారం సీఐడీ విచారణకు హాజరయ్యారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో సజ్జలపై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి విచారణకు రావాల్సిందిగా సజ్జలకు సీఐడీ నోటీసులు జారీ చేయగా... శుక్రవారం గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి ఆయన హాజరయ్యారు. సజ్జలతో పాటు దేవినేని అవినాశ్ కూడా విచారణకు వచ్చారు. సజ్జల విచారణ నేపథ్యంలో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సీఐడీ కార్యాలయం వద్దకు వచ్చారు. దీంతో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సీఐడీ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. విచారణ ముగిసిన తర్వాత సజ్జల మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి సర్కార్ పథకం ప్రకారం వ్యవస్థీకృత టెర్రరిజం సృష్టిస్తోందని మండిపడ్డారు. అసమర్థ పాలనతో ఎన్నికల హామీలు అమలు చేయలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం 'దారిమళ్లింపు) రాజకీయాలకు పాల్పడుతోందని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో తప్పుడు కేసులు పెట్టి వైసీపీని భయపెట్టాలనుకోవడం చంద్రబాబు అవివేకమని అన్నారు.

ఏపీ టు అబుదాబి

- జూన్ 13 నుంచి విమాన సర్వీసులు ప్రారంభం
- జూన్ 2నుంచి విశాఖ టు భువనేశ్వర్, బెంగళూరు
- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర విమాన ప్రయాణికులకు ఆ శాఖ శుభవార్త తెలిపింది. ఆంధ్రప్రదేశ్ నుంచి అబుదాబి, బెంగళూరు, భువనేశ్వర్ ప్రాంతాలకు కొత్త విమాన సర్వీసులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మీడియాకు తెలిపారు. విమానయాన సర్వీసుల విస్తరణతో రాష్ట్రమంతటా కనెక్టివిటీ పెంచేందుకు కొత్త విమానాలు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నం- అబుదాబి మధ్య జూన్ 13 నుంచి విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని, ఇవి వారానికి నాలుగు రోజుల పాటు నడుస్తాయని పేర్కొన్నారు. విశాఖ- భువనేశ్వర్ విమాన సర్వీసు జూన్ 12 నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ సర్వీసుల ద్వారా ఏపీ, ఒడిశా మధ్య సంబంధాలు బలోపేతమవుతాయని ఆకాంక్షించారు. విజయవాడ-బెంగళూరు మధ్య ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు జూన్ 2 నుంచి ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఈ సర్వీసుల ద్వారా ఏపీ రాజధాని ప్రాంతం భారతదేశంలోని ప్రధాన టెక్ హబ్‌లలో ఒకటైన బెంగళూరుకు అనుసంధానం కావొచ్చని తెలిపారు. విశాఖ- విజయవాడ మధ్య కూడా గతంలో రద్దు అయిన విమాన సర్వీసును పునరుద్ధరిస్తున్నట్లు మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు.



శ్రామికుల సమస్యలపై పోరుబాట

సీహెచ్ కోటేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి పోరు బాటకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈనెల 12న అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలన్న సంఘం పిలుపులో భాగంగా శుక్రవారం రంగాపురం ప్రాంతంలో పర్యటించారు. సంవత్సరానికి 200 రోజుల పని, రూ.700 వేతనం సాధించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఉపాధి హామీ శ్రామికులకు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శ్రామికుల కష్టాలను గుర్తించి పని దినాలు, వేతనం పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్ల అభివృద్ధి పేరుతో ఉపాధి నిధులు కాంట్రాక్టులకు అప్పగించి శ్రామికుల కడుపుకొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అవసరమైన పనిముట్లు సరఫరా చేయకుండా కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని కోటేశ్వరరావు విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పోతురాజు సాంబయ్య, సోమయ్య, వెంకటేశ్వరరావు, నరశింహస్వామి, సామ్రాజ్యం, మరియమ్మ, సీతమ్మ, నాగమణి పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.